**BIG TRUTH** LITTLE BOOKS®
బిగ్ ట్రూత్ - లిటిల్ బుక్స్ (తెలుగు అనువాదం)

# అంత్యకాలం గురించి బైబిల్ ఏం చెబుతుంది?

Colin Eakin

కోలిన్ ఈకిన్

**With All Wisdom Publications**
Cupertino, California

# అంత్యకాలం గురించి బైబిల్ ఏం చెబుతుంది?

*What the Bible Says About the Future*
Copyright © 2019 Colin Eakin
Published by WITH ALL WISDOM PUBLICATIONS
Requests for information about **BIG TRUTH** LITTLE BOOKS® can be sent to:

Publications@creeksidebiblechurch.com

All rights reserved.

ISBN: 978-1-7336041-7-8

All Scripture quotations unless otherwise noted, or from the *New American Standard Bible*. © Copyright 1960, 1962, 1963, 1968, 1971, 1972, 1973, 1975, 1977, 1995 by the Lockman Foundation. Used by permission.

*What the Bible Says About the Future* is volume 16 in the Big Truth little books® series.

General Editor: Cliff McManis
Series Editor: Derek Brown
Associate Editors: J. R. Cuevas, Breanna Paniagua, Jasmine Patton
Proofreader: Sergio Gonzalez
Cover Design: Oluwasanya Awe

This work is a publication of WITH ALL WISDOM PUBLICATIONS. No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted in any form or by any means except by permission of the publisher.

*అంత్యకాలం కొరకు దేవుని ప్రణాళికను అత్యంత విశ్వాసంతో పరిశోధించిన **పాస్టర్. జాన్ మాక్ ఆర్థర్** గారికి  ఈ పుస్తకం అంకితం.*

“ఈ సంగతులు జరిగిన తరువాత నేను చూడగా,
అదిగో పరలోకమందు ఒక తలుపు
తెరువబడియుండెను. మరియు నేను మొదట
వినిన స్వరము బూరధ్వనివలె నాతో మాటలాడగా
వింటిని. ఆ మాటలాడినవాడు ఇక్కడికి
ఎక్కిరమ్ము; ఇకమీదట జరుగవలసినవాటిని నీకు
కనుపరచెదననెను.”

(ప్రకటన గ్రంథము 4:1)

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | లక్ష్యం | 1 |
| | ముందుమాట | 3 |
| | పరిచయం | 6 |
| 1. | కాల ఆవిర్భవానికి ముందు | 13 |
| 2. | ఇశ్రాయేలు: అంత్యకాలమునకు మూలస్తంభం | 20 |
| 3. | దానియేలుకు కలిగిన దర్శనము | 28 |
| 4. | అంత్యదినాలకు సూచనలు | 37 |
| 5. | పునరుత్థాన దినము | 42 |
| 6. | శ్రమలు – మహా శ్రమలు | 49 |
| 7. | క్రీస్తు రెండవ రాకడ | 61 |
| 8. | వెయ్యేళ్ళ క్రీస్తు రాజ్యము | 72 |
| 9. | తీర్పు తీర్చు ధవళ మహాసింహాసనం | 85 |
| 10. | క్రొత్త ఆకాశము & క్రొత్త భూమి | 90 |

# లక్ష్యం

మెరుగైన సాహిత్యాన్ని, బైబిల్ లో దాగియున్న సత్యాలని సుళువుగా అర్ధమయ్యే భాషలో, సులభంగా చదవగలిగే చిన్న చిన్న పుస్తకాల రూపంలో వివిద వర్గాల క్రైస్తవ పాఠకుల దగ్గరకి చేర్చడమే *BIG TRUTH little books®* **బిగ్ ట్రూత్ - లిటిల్ బుక్స్** యొక్క ప్రధాన లక్ష్యం. చదువుట వలన మరియు వినుట వలన జ్ఞానము మరియు విశ్వాసము అధికమవునని మనం ఎరిగియున్నాము గనుక, చిన్నవారికేమి, పెద్దవారికేమి, అందరూ వారి విశ్వాస జీవితంలో బలపడునట్లుగా, లోతైన పరిశీలనతో వాక్యానుసారంగా ఈ పుస్తకం నిర్మించడం జరిగినది.

**క్లిఫ్ మెక్ మానిస్, జనరల్ ఎడిటర్.**
**డెరెక్ బ్రౌస్, సిరీస్ ఎడిటర్.**

# ముందుమాట

గత కొన్ని సంవత్సరాలుగా, గ్రేస్ క్యాంపస్ మినిస్ట్రీస్ వారి స్టాన్‌ఫోర్డ్ స్టూడెంట్ గ్రూప్ నకు బైబిల్ బోధించడంలో పాస్టర్ డెరెక్ బ్రౌన్‌తో సహ బోధకుడిగా పని చేయడం దేవుడు నాకిచ్చిన ధన్యతగా భావిస్తున్నాను. గత సంవత్సరం (2018-2019) "క్రైస్తవ సిద్ధాంతం" - **బైబిల్ ఎస్కటాలజీ** (లేదా) "**అంత్యకాలం గురించి బైబిల్ ఏం చెబుతుంది**" అనే అంశంపై రెండు వారాల సధస్సు నడించింది. రాబోవు కాలం మరియు జరగబోవు సంగతులను గురించి, అక్కడ విధ్యార్థులు చూపిన ఆశక్తి, అడిగిన ప్రశ్నలను బట్టి ఈ పుస్తకం వ్రాయాలనే ప్రేరణ కలిగింది.

అంత్యకాలం గురించి లోకంలో అనేక సిద్ధాంతాలు, అనేక విశ్వాసాలు ఉన్నాయి. అసలు రాబోవు కాలం గురించి మరియు ఈ విశ్వం ఎలా అంతం అవుతుందనే దాని గురించి, బైబిలు నిజంగా ఏం చెబుతుందో ఒక వ్యక్తి ఖచ్చితంగా ఎలా చెప్పగలడు?

ఒకసారి పాస్టర్ జాన్ మాక్ ఆర్థర్ గారు తన బోధన/ ప్రసంగంలో చెప్పిన కథ ఒకటి నాకు గుర్తొస్తుంది.

ఆయన సోవియట్ యూనియన్ లో పని ముగించుకుని, కజకస్తాన్ లో 1,600 మంది పాస్టర్‌లతో ఒక వారంపాటు జరిగే సధస్సుకు 30 గంటల ప్రయాణం చేసి హాజరవుతారు. వారం చివరిలో, ఆయనని అందరూ ఒక ప్రశ్న అడుగుతారు –

**అసలు అంత్యదినాలు ఎలా ఉంటాయి?** అని వారు ఆయనని అడుగుతారు. వీరంతా ఎన్నో సంవత్సరాలుగా కఠినమైన పరిస్థితులు, హింసలకు లోనైన సంఘాలకు బోధ చేస్తూ వస్తున్నారు. వారి విశ్వాసం వారికి అందించే ఫలం ఏమిటి, అసలు రాబోవు కాలంలో వారు పొందబోవు ఫలితం ఏమిటి అనే ప్రశ్నలను వారు లేవనెత్తారు. ఈ విశ్వం ఎలా ముగియనున్నది, తరువాత జరగబోవు సంగతలు ఏమిటి అని వారు తెలుసుకొన గోరుచున్నారు.

గనుక మాక్ ఆర్థర్ గారు, ఆ శుక్రవారం దాదాపు 8 గంటల పాటు బైబిల్ లోని అంత్యదినాలను గురించిన అనేక అంశాలను ప్రసంగించారు. ఆయన చివరిలో వారితో "**నేను మీకు బైబిల్ నుండి బోధించిన ఈ సంగతులన్నిటినీ మీరు నమ్ముతున్నారా?**" అని అడుగుతారు.

వారంతా మేము నిస్సంధేహంగా నమ్ముతున్నాము అని సమాధానం ఇస్తారు. ఎలాంటి అనుమానాలు, వితర్కాలు లేని వారి సమాధానం విని ఆయన చాలా సంతోషిస్తారు.

ఇక్కడ మనం గమనించాల్సిన విషయం ఏమిటంటే, పరిశుద్ధ లేఖనాలను కలిపి చెరుపుతూ, సొంత జ్ఞానంతో ప్రసంగాలు చేస్తున్నవారిని ఎందరినో చూస్తున్నాం, ఎంతో మంది వారికి ఆకర్షితులవ్వడం కూడా చూస్తున్నాం.

**కానీ వీరు బైబిల్ లోని లేఖనాలను ఉన్నది ఉన్నట్లుగా నమ్మారు.**

ఇప్పుడు మనందరం చేయాల్సిన పని కూడా అదే — **స్పష్టంగానూ, సూటిగానూ బైబిలు మనతో చెప్పే సంగతులను విశ్వసించడమే**. ఇక ముందుకు మనం అధ్యయనం చేయబోవు విషయాలలో దేవుని వాక్యం స్వయంగా మనతో మాట్లాడటానికి మనం అనుమతించాలి. బైబిల్ వాక్యాలను పరిశీలిస్తూ, అవి మనతో స్పష్టంగా మాట్లాడుతున్న వాటిని అర్థం చేసుకోవాలి. ఇలా చేస్తేనే దేవుడు అంత్యకాలం కొరకు ఆయన కలిగియున్న ఉద్దేశాలను మనం అర్థం చేసుకోగలము.

**దేవునికే మహిమ కలుగును గాక!**

**కోలిన్ ఈకిన్ (Colin Eakin)**
**క్రీక్‌సైడ్ బైబిల్ చర్చి (Creekside Bible Church)**
**జూలై, 2019.**

# పరిచయం

**అసలు అంత్యకాలం గురించి బైబిల్ ఏమీ చెప్పలేదా?**

ఈ ప్రశ్న మీకెప్పుడైనా కలిగిందా? నిజానికి బైబిల్, రాబోవు కాలం గురించి చాలా చెబుతోంది. **వాస్తవానికి బైబిల్ - ఈ సృష్టికి, ఆ తరువాత జరగబోవు సంగతులకి, ఒక ఖచ్చితమైన మార్గదర్శకం.** చరిత్రను తెలిపే ఒక పుస్తకం కంటే, నేటి సంగతులను తెలిపే వార్తాపత్రిక (లేదా వెబ్‌సైట్) కంటే, జరగబోవు వాటి గురించి తెలిపే బైబిల్ మరింత నమ్మదగినది. **అసలు ఇది ఎలా సాధ్యం? ఎలా అనగా - ఇది దేవుని సృష్టి, బైబిల్ – దేవుని వాక్యం.** కాబట్టి మనం దేవుని సృష్టి యొక్క ఉద్దేశ్యం ఇంకా దాని ముగింపును తెలుసుకోవాలంటే, అసలు దేవుడు తన వాక్యమైయున్న పరిశుద్ధ గ్రంథంలో దాని గురించి ఏం చెప్తున్నాడో మనం గ్రహించాలి.

దేవుడు తన వాక్యాన్ని - **తన సృష్టిని గురించిన ఒక కథలా, ఒక ఆది & ఒక అంతం కలిగిన ఒక గ్రంథంలా వ్రాసాడు.** అందువలన బైబిల్ - భూత వర్తమానాలతో పాటుగా భవిష్యత్తును గురించిన విషయాలని కూడా కలిగి ఉంటుంది. పూర్తి కథా సారాంశం మాత్రం ఒక్కటే – **దేవునికి కలుగు మహిమ.**

దేవుని వాక్యగ్రంథంలో వ్రాయబడిన ప్రతీ వాక్యం, ఆయనను ఘనపరిచే విధంగానూ, ఆయన నామమునకు మహిమను, కీర్తిని కలుగుజేయు విధంగానూ ఉద్దేశించబడినది. యెషయా 40:5 లో ప్రవక్త పలికిన మాట: "**యెహోవా మహిమ బయలుపరచబడును**...." గనుక దేవుని మహిమను బయలుపరచడమే ఈ సృష్టి యొక్క ఉద్దేశ్యము.

**అసలు దేవుని మహిమ అంటే ఏమిటి?** ఇది దేవుని మహా జ్ఞానం, ఆయన శ్రేష్ఠమైన లక్షణాల సమగ్ర సమ్మేళనం. దేవుని మహిమ అంటే - ఆయన పరిశుద్ధత, ప్రేమ, శాంతి, అలానే ఆయన సహనం, కృప, కనికరం, మరియు క్షమాపణ. ఆయన మహిమ అంటే – ఆయన ఉగ్రత, పాపమునకు శిక్ష విధించు ఆయన నిశ్చయత. **దేవుడు తన మహిమను బయలుపరచుటకే ఈ సృష్టిని చేశాడని బైబిల్ ప్రకటిస్తుంది.** (కీర్తన 50:15; యెషయా 48:11).

దేవుని మహిమ యొక్క ఒక విశేషమైన లక్షణం - **ఆయన సార్వభౌమాధికారం.** దీని అర్థం, దేవుడు తాను సృష్టించిన ఈ విశ్వంలోని ప్రతి విషయాన్ని, ప్రతి సంగతిని

నియంత్రిస్తాడు అని. **ఎఫెసీ 1:12** లో – "**.....ఆయన తన చిత్తానుసారముగా చేసిన నిర్ణయము చొప్పున సమస్త కార్యములను జరిగించుచున్నాడు.** " అని వ్రాయబడి ఉంది. అనగా - ఏ దేశమైననూ, ఏ ప్రదేశమైననూ, ఏ కాలమైననూ, ఆయన దృష్టికి వెలుపల లేదని అర్థం. **యెషయా 46:10** లో దేవుడు – "**నా ఆలోచన నిలుచుననియు నా చిత్తమంతయు నెర వేర్చుకొనెదననియు, చెప్పుకొనుచు ఆదినుండి నేనే కలుగబోవు వాటిని తెలియజేయు చున్నాను. పూర్వకాలము నుండి నేనే యింక జరుగనివాటిని తెలియజేయుచున్నాను.**" ఈ వాక్యం – దేవుడు ఒక గొప్ప ప్రణాళికను కలిగియున్న సార్వభౌముడని – సమస్తమునూ ఆయన ప్రణాళిక చొప్పున జరిగిస్తున్నాడని చెబుతుంది. **కీర్తన 115:3** లో కీర్తనాకారుడు పలికిన మాట – **మా దేవుడు ఆకాశ మందున్నాడు తన కిచ్ఛ వచ్చినట్లుగా సమస్తమును ఆయన చేయుచున్నాడు.**

**దేవుడు తన సృష్టి నిమిత్తం, ఒక ముగింపునకు కూడా ఒక ప్రణాళికను కలిగి ఉన్నాడు** – అదే ఈ పుస్తకంలో మనం అధ్యయనం చేయు అంశం. అంత్యకాలం గూర్చిన అధ్యయనాన్నే **ఎస్కటాలజీ** అని పిలుస్తారు. ఈ ఎస్కటాలజీ అధ్యయనం – అస్పష్టమైనది, అప్రధానమైనది అనే కొన్ని అపోహలను బట్టి ఎన్నో క్రైస్తవ సంఘాలు ఒక క్రమబద్ధమైన బోధనను అందించడంలో విఫలమయ్యాయి. దీని కారణంగానే సరైన అధ్యయనం లేక – యేసు ప్రభువు ఏదో ఒక విధంగా, ఈ విశ్వాన్ని ఉద్ధరించడానికి తిరిగి వస్తున్నాడనే అస్పష్టమైన బోధనలు జరుగుతున్నాయి. పాత మరియు క్రొత్త నిబంధనలలోని ప్రవచనాల అసలైన భావమేమిటి, ఈ సృష్టి యొక్క ముగింపు ఏమిటి, ఆ తరవాత జరగబోవు సంగతులేమిటి అనే విషయాల పట్ల అవగాహనా లోపం వలన ఈ ఎస్కటాలజీ అధ్యయనం వివాదాస్పదమైనదిగాను, అప్రధానమైనదిగాను పరిగణించ బడుతుంది.

కానీ ఆయన శిష్యులు తన వాక్యాన్ని ఇలా వ్యవహరించాలని దేవుడు కోరుకొనడం లేదు. **మత్తయి 4:4**లో – యేసు **ద్వితీ 8:3** లోని వాక్యాన్ని ఉదాహరించి – "**మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోట నుండి వచ్చు ప్రతిమాటవలనను జీవించును**" అని ప్రవచనాత్మకంగా చెప్పిన మాట ఇది. **హెబ్రీయులు** – **మృతుల పునరుత్థానము** మరియు **నిత్యమైన తీర్పు** అను విషయాలను ప్రాథమిక సిద్ధాంతాలుగా వర్గీకరిస్తారు (**హెబ్రీ** 6:2). పౌలు కూడా దానిని అంగీకరిస్తూ, తాను అక్కడ ఉన్నది తక్కువ కాలమే అయినప్పటికీ, థెస్సలొనీకా లోని సంఘానికి అంత్యకాలం గురించి ఎంతో బోధించాడు – **రాబోవు క్రీస్తు విరోధి** (2థెస్స 2:5) గురించి, **రాబోవు క్రీస్తు రెండవ రాకడ** (1థెస్స 5:1-2)

గురించి సంఘాన్ని హెచ్చరించాడు. తరువాత, పరిశుద్ధ గ్రంథమంతటిలోనూ, ఏ ఇతర గ్రంథం కంటెనూ – **ప్రకటన గ్రంథం** – అంత్యకాలం గురించి మరింత వివరంగా ప్రకటిస్తుంది – **ఈ ప్రవచన వాక్యములు చదువు వాడును, వాటిని విని యిందులో వ్రాయబడిన సంగతులను గైకొనువారును ధన్యులు** (1:3; 22:7) – **అనే వాక్యంతో ఆరంభమయ్యి & ముగించబడినది కేవలం ప్రకటన గ్రంథంలో మాత్రమే.** రాబోవు కాలం గురించి, జరగబోవు సంఘటనల గురించి చదువు వారును, విను వారును – గ్రహించి, ఆయన చేయబోవు కార్యములను తెలుసుకొనునట్లు దేవుడు తన గ్రంథాన్ని వ్రాసియున్నాడు.

**అసలు అంత్యకాలం గురించి ఎందుకు అధ్యయనం చేయాలి?**

ఐదు బైబిల్ కారణాలలో ఇది **మొదటిది** – అంత్యకాల అధ్యయనం ద్వారా, రాబోవు కాలం నిమిత్తం దేవుని ప్రణాళిక ఏమిటని పరిశీలించి గ్రహించుట వలన కలుగు **దేవుని ఆశీర్వదం.**

**రెండవది** – జరగబోవు సంఘటనలను తెలుసుకొనుట ద్వారా కలుగు **పాప క్షమాపణ – రక్షణ పొందుటకు ఇదొక ముఖ్యమైన ప్రమాణం.** ఏథెన్సువారితో పౌలు పలికిన మాటలు – **ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించు చున్నాడు. ఎందుకనగా తాను నియమించిన మనుష్యునిచేత నీతి ననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చ బోయెడి యొక దినమును నిర్ణయించి యున్నాడు. మృతులలోనుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసియున్నాడు.** లోకమునకు తీర్పు తీర్చుటకై నీతిమంతుడైన న్యాయాధిపతిగా యేసు క్రీస్తు తిరిగి రానున్నాడనే జ్ఞానం – అది ఎరిగిన వారికి పాశ్చాత్తాపన్ని మరియు మారుమనస్సును కలుగజేస్తుంది.

**మూడవ కారణం** – ప్రవచనాత్మక దేవుని వాక్యాలను చదివి అర్థం చేసుకోవడం ద్వారా **పొందు – పవిత్రత.** యోహాను పలికిన మాటలు – **ప్రియులారా, యిప్పుడు మనము దేవుని పిల్లలమై యున్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్షపరచబడలేదు గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము. ఆయనయందు ఈ నిరీక్షణ పెట్టుకొనిన ప్రతివాడును ఆయన పవిత్రుడై యున్నట్టుగా తన్ను పవిత్రునిగా చేసికొనును.** (1యోహాను 3:2-3). యేసు కూడా తన అపొస్తలులకు ఉపదేశించినప్పుడు ఇలాంటి మాటలనే చెప్పుట మనం చూస్తాం – **ఏ జామున దొంగవచ్చునో యింటి**

**యజమానునికి తెలిసియుండిన యెడల అతడు మెలకువగా ఉండి తన యింటికి కన్నము వేయనియ్యడని మీరెరుగుదురు.** (మత్తయి 24:43). యేసు ప్రభువు, యోహానులు చెబుతున్నది ఒక్కటే విషయం – **క్రీస్తు ఎప్పుడైననూ తిరిగి రావొచ్చని మీరు ఎరిగిన వారైతే – మిమ్మల్ని మీరు సిద్ధపరుచుకుని పవిత్రులై ఉంటారు** అని.

**నాలుగవది – కలుగు ఆదరణ, పొందు భరోసా**. 1 **థెస్స 4:16-17**లో పౌలు – క్రీస్తు రెండవ రాకడ విషయమై, పునరుత్థాన విషయమై, దేవుని ప్రణాళికను గూర్చి మాట్లాడిన మాటలు – **ఆర్భాటముతోను**, **ప్రధానదూత శబ్దముతోను**, **దేవుని బూర తోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తు నందుండి మృతులైన వారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘ ములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము.** ఇక్కడ పౌలు చెబుతున్న అసలు విషయం – **18వ వచనం: కాబట్టి మీరు ఈ మాటలచేత ఒకనినొకడు ఆదరించుకొనుడి.** ఇక్కడ పౌలు, విశ్వాసులు జరగబోవు సంగతులను తెలుసు కొని ఒకరినొకరు ఆదరించుకొనాలని సూచిస్తున్నాడు.

**ఐదవ కారణం – దేవుడే బయలుపరిచాడు గనుక** – దేవుని వాక్యం అల్పమైనది, నిరుపయోగమైనది కాదు గనుక. (**సామెతలు** 30:5; 2వ **తిమో** 3:16). **దేవుని వాక్యం** – అను ఆయన కథలో, దాని ముగింపును కూడా చేర్చుట ఆయనకి ముఖ్యమైన విషయతే, ఆయన శిష్యులుగా మనకి కూడా అది ముఖ్యమైన విషయమే గనుక. **యేసు ప్రభువు** కూడా అంత్యకాల సంగతులను, శిష్యులు తెలుసుకోవాలని సూచించినట్లు మనం చూస్తాము (లూకా **16:29;** యోహాను 12:48).

**అసలు అంత్యకాలం గురించి ఎలా అధ్యయనం చేయాలి?**

అంత్యకాలం గురించి దేవుడు ఏం చెబుతున్నాడు, ఎందుకు అధ్యయనం చేయాలి అనే మునపటి ప్రశ్నలకు సమాధానాలను కనుగొనిన మనకు, తదుపరి యుక్తమైన ప్రశ్నలు – **అసలు ఎలా అధ్యయనం చేయాలి? పాత మరియు క్రొత్త నిబంధన ప్రవచన వాక్యాలన్నిటినీ స్పష్టముగా ఎలా సమీకరించాలి?**

**సమాధానం**: సాధారణంగా, లేఖనాలలోని ఇతర ప్రవచన వాక్యాలను అధ్యయనం చేసినట్లుగానే **అంత్యకాలం గురించిన ప్రవచన వాక్యాలను కూడా సూటిగాను, స్పష్టముగాను ఒక క్రమబద్ధమైన అధ్యయనం చేయాలి.**

ప్రవచన వాక్యాలను – ఒక సాధారణ **శబ్దార్థ/ అక్షరార్థ ప్రకారమైన అధ్యయనం** చేయడం సరైన మార్గమని మనకు ఎలా తెలుస్తుంది? **మనం బైబిల్ లోనికే చూద్దాం** – అనేక బైబిల్ ప్రవచనాలు వాస్తవానికి వాటి సంఘటనల పరిధిలోనే నెరవేరాయని మీకు తెలుసా? – అనగా - ప్రవచనం మరియు దాని నెరవేర్పు రెండూ ఒకే సమయ వ్యవధిలో నమోదు చేయబడ్డాయి – ముఖ్యంగా మెస్సయ్యను గూర్చిన ప్రవచనాలు. **ఒక సాధారణ శబ్దార్థప్రకారమైన అధ్యయనం కొరకు ఇవే విశేషమైన ఉదాహరణలు.**

ముఖ్యంగా, మెస్సయ్య రాకడ గురించి దాదాపు 333 ప్రవచనాలు గ్రంథంలో ఉన్నాయి, వాటిలో ఇంచుమించు 111 ప్రవచనాలు, యేసు మొదటి రాకడలోనే నెరవేరిపోయాయి – ఆయన బెత్లెహేములో (**మీకా** 5:2), యూదా గోత్రములో (**ఆది** 49:10), ఒక కన్యకు జన్మించి "ఇమ్మానుయేలు" అని పేరు పెట్టబడతాడని (**యెషయా** 7:14), తరువాత, మెస్సయ్య తన ప్రజలచే తిరస్కరించబడతాడని (**యెషయా** 53:3), అతని స్నేహితుడి వంచనకు గురవుతాడాని (**కీర్తన** 41:9), తరువాత సిలువపై మరణిస్తాడని (**సంఖ్యా** 21:9; **యోహాను** 3:14) తరువాత ఆ మరణాన్ని జయించి తిరిగి లేస్తాడని (**కీర్త** 16:10) ఇలా క్రీస్తు మొదటి రాకడ గురించి చెప్పబడిన ప్రవచనాలన్నీ ఒకే కాల వ్యవధిలో నెరవేరబడ్డాయి – **ఒక సాధారణ శబ్దార్థ ప్రకారమైన అధ్యయనానికి ఇంతకి మించిన ఉదాహరణ ఇంకేం కావాలి! ఈ మాదిరిగానే క్రీస్తు రెండవ రాకడ గూర్చిన అధ్యయనం కూడా శబ్దార్థప్రకారముగా చేయబడుతుంది.**

బైబిల్ చరిత్రలో ఎన్నడైనా – **జరగబోవు సంగతులను గూర్చిన ప్రవచనాలు శబ్దార్థ ప్రకారముగా నెరవేరినట్లు ఆధారాలు ఉన్నాయా?** – అవును, ఉన్నాయి.

(యెహె 14:14; 28:3; దాని 9:23). అది సుమారు క్రీ.పూ.538వ సంవత్సరం – దేవుడు ఎన్నుకొనిన జనాంగమైన యూదా వారిలో మిగిలినవారు – ఇంచుమించు క్రీ.పూ. 605 నుండి 586 మధ్యకాలంలో మూడు విడతలుగా వారి దేశం నుండి బహిష్కరించబడి బబులోను చెరలోనికి పంపబడతారు. ఈ సంగతులను, యిర్మియా ప్రవక్త ముందుగానే ప్రవచిస్తాడు – **"ఈ దేశమంతయు పాడుగాను నిర్జనము గాను ఉండును**; **ఈ జనులు డెబ్బది సంవత్సరములు బబులోను రాజునకు దాసులుగా ఉందురు. యెహోవా వాక్కు ఇదే డెబ్బది సంవత్సరములు గడచిన తరువాత వారి దోషములనుబట్టి నేను బబులోనురాజును ఆ జనులను కల్దీయుల దేశమును శిక్షింతును**; **ఆ దేశము ఎప్పుడు పాడుగనుండునట్లు నియమింతును."** (యిర్మియా 25:11-12). మరొక ప్రకరణంలో ఇలా ప్రవచిస్తాడు –**"యెహోవా ఈ ఆజ్ఞ ఇచ్చు చున్నాడు – బబులోను రాజ్యమునకు డెబ్బది**

**సంవత్సరములు గతించిన తరువాతనే మిమ్మును గూర్చి నేను పలికిన శుభవార్త నెరవేర్చి యీ స్థలమునకు మిమ్మును తిరిగి రప్పించునట్లు నేను మిమ్మును దర్శింతును."** (యిర్మియా **29:10**).

మొదటి బహిష్కరణలో, బబులోనుకు చెరగా కొనుపోబడినవారిలో ప్రవక్తయైన దానియేలు, అప్పుడు యౌవనస్థుడు. అయినప్పటికీ, దేవుని కృప మరియు ఆయన సాధికారతను బట్టి, అతడు బబులోను సంస్థాన మంతటిమీద అధిపతినిగాను, బబులోను జ్ఞానులందరిలోను ప్రధానుడు గాను నియమించబడతాడు. తరువాత క్రీ.పూ. 539లో, మాదీయులు మరియు పారసీకులు, బబులోనును జయించినప్పుడు, దానియేలు తనకు దైవికంగా అనుగ్రహించబడిన జ్ఞానం మరియు సామర్థ్యము చేత తన స్థానాన్ని నిలబెట్టుకుంటాడు. అయితే తాను అధికారంలో ఉన్నప్పటికీ, దానియేలు తన ప్రజలైన యూదులు తమ వాగ్దాన దేశానికి తిరిగి రావాలనే కోరికను ఎన్నడూ కోల్పోలేదు. కాబట్టి దానియేలు తన చివరి రోజులలో, యిర్మియా ద్వారా దేవుడు బయలుపరిచిన విషయాలను జ్ఞాపకం చేసుకుంటాడు – **"దానియేలను నేను యెహోవా తన ప్రవక్తయగు యిర్మీయాకు సెలవిచ్చి తెలియజేసినట్టు, యెరూషలేము పాడుగా ఉండవలసిన డెబ్బది సంవత్సరములు సంపూర్తియౌచున్నవని గ్రంథములవలన గ్రహించితిని"** (దానియేలు **9:2**).

మరో మాటలో చెప్పాలంటే, ఇక్కడ దానియేలు ఆ లేఖనాల ప్రవచనాన్ని శబ్దార్థ ప్రకారముగానే అర్థం చేసుకున్నాడు. అక్కడ చెప్పబడిన **డెబ్బది సంవత్సరములు** అన్న మాటను దాని అక్షరార్థమే అర్థం చేసుకున్నాడు. తాను చదివిన వాక్యాలకు లేనిపోని ఆధ్యాత్మికతను కాని, ఉపమానాలను కాని చేర్చలేదు. ఉన్నది ఉన్నట్లు చదివి అర్థం చేసుకున్నాడు. అక్కడ వాస్తవంగా, ప్రవచనం ప్రకారమే డెబ్బది సంవత్సరముల చెర ముగియబడి, పారసీకదేశపు రాజైన కోరెషు ఆజ్ఞ మేరకు, ఇశ్రాయేలీయులు తమ దేశానికి తిరిగి పంపబడతారు. (**ఎజ్రా 1:1-4**). దేవుడు తన అన్ని ప్రవచనాల మాదిరిగానే, యిర్మీయా చేత వ్రాయించిన ప్రవచనాన్ని కూడా, దాని శబ్దార్థ ప్రకారముగానే జరిగించి యున్నాడు. **అంత్యకాలం గురించి చేయవలసిన అధ్యయనం ఎలా? అనే మన ప్రశ్నకు మరొక అద్భుతమైన సమాధానం ఇక్కడ మనకి దొరికింది.**

మరొక అద్భుతమైన విషయం ఏమిటంటే, ప్రవచనాలని అక్షరార్థంగా అర్థం చేసుకోవడంలో విఫలమై, తెచ్చిపెట్టుకున్న విపత్తులకు ఉదాహరణలను కూడా దేవుని వాక్యగ్రంథం అందిస్తుంది. యెరికో పట్టణమును సాధించిన తరువాత (క్రీ.పూ. 1400),

ఇశ్రాయేలు ప్రజల నాయకుడైన యెహోషువ, తన జనులచేత శపథము చేయించి ఇలా ఆజ్ఞాపిస్తాడు – **"ఎవడు యెరికో పట్టణమును కట్టించ పూనుకొనునో వాడు యెహోవా దృష్టికి శాపగ్రస్తుడగును."** వ్యతిరేకించిన వారికి శిక్షను కూడా పేర్కొంటాడు – **"వాడు దాని పునాది వేయగా వాని జ్యేష్ఠకుమారుడు చచ్చును; దాని తలుపులను నిలువ నెత్తగా వాని కనిష్ఠకుమారుడు చచ్చును."** (యెహోషువ 6:26). అయితే దాదాపు 500 వందల సంవత్సరాల తరువాత, (క్రీ.పూ. 875-853) అప్పటి రాజైన అహాబు యేలుబడిలో, ఆ ప్రవచనాత్మకమైన శిక్ష అమలులోనికి రాక తప్పలేదు – "**అతని దినములలో బేతేలీయుడైన హీయేలు యెరికో పట్టణమును కట్టించెను. అతడు దాని పునాదివేయగా అబీరాము అను అతని జ్యేష్ఠపుత్రుడు చనిపోయెను; దాని గవునుల నెత్తగా సెగూబు అను అతని కనిష్ఠపుత్రుడు చనిపోయెను. ఇది నూను కుమారుడైన యెహోషువద్వారా యెహోవా సెలవిచ్చిన మాట చొప్పున సంభవించెను.**"(1 రాజులు 16:34). పరిశుద్ధాత్మ ప్రేరణతో యెహోషువ పలికిన మాటలకు అనుగుణంగా, **ఆ ప్రవచనం అక్షరార్థంగా నెరవేరబడుతుంది.**

**ఇక్కడ మనం నేర్చుకున్న పాఠం ఏమిటి?** శబ్దార్థ ప్రకారముగా లేఖనాలను, ప్రవచనాలను అర్థం చేసుకోవడం ద్వారా ఆశీర్వదించబడడమే కాకుండా, అర్థం చేసుకోవడంలో విఫలమైతే, విపత్తులను మరియు విషాదాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది అని నేర్చుకున్నాము.

అంత్యకాలం గురించిన అధ్యయనం **ఎందుకు? & ఎలా?** అని తెలుసుకున్న మనం ఇప్పుడు అధ్యయన ప్రయాణం మొదలు పెడదాం. అయితే, భవిష్యత్తులో ఏం జరుగుతుందనే విషయాలను తెలుసుకునే ముందు, **ఒకసారి కాలంలో వెనక్కి వెళ్దాం – సరిగ్గా "కాలం" అన్నది మొదలైన కాలానికే తిరిగి వెళ్దాం – అసలు ఎక్కడికి వెళ్ళడం కోసం దాని ప్రయాణం మొదలైందో చూద్దాం.**

# 1

# కాల ఆవిర్భావానికి ముందు

భవిష్యత్కాలాన్ని దేవుడు ముందుగానే వ్రాసియున్నాడు, అని మనం విశ్వసిస్తున్నప్పుడు, ఒక్క ఖచ్చితమైన విషయాన్ని కూడా మనం గమనిస్తాము, అదే – **కాలం** (లేదా) **సమయం**. దేవుడు దానిని సృష్టించడానికి ముందు అసలు **కాలమే లేదు**. దానికి ముందు దేవుడు ఒక శాశ్వతమైన గతంలో – **తండ్రి, కుమార, పరిశుద్ధాత్మల సమ్మేళనమైన – ఒక త్రియేకమైన, శాశ్వతమైన అస్తిత్వాన్ని కలిగి ఉన్నాడు.**

దేవుడే కాలాన్ని సృష్టించినవాడు గనుక, ఆయన దాని సరిహద్దులు, పరిమితులకు వెలుపల ఉంటాడు. దేవుడు మాత్రమే కాలాన్ని పరిపాలించగలడు మరియు దానిలో సంభవించు వాటినన్నిటినీ నియంత్రించగలడు. మరో మాటలో చెప్పాలంటే – **దేవుడు – గతంలో ఏదైనా ఒకటి జరిగింది (లేదా) భవిష్యత్తులో జరగనుంది అని చెప్పినప్పుడు, అది ఖచ్చితమైన వాస్తవమై ఉంటుంది.**

దేవుడు తన వాక్య గ్రంథంలోని మొదటి వాక్యంలోనే **కాలం** గురించి మొదటి ప్రస్తావన చేస్తాడు – (**ఆది 1:1**): "**ఆదియందు** దేవుడు భూమ్యాకాశములను సృజించెను." **సరిగ్గా ఆ సమయంలోనే ఈ విశ్వం యొక్క గడియారం ప్రారంభమయింది**. అనగా – ఈ సృష్టి ప్రారంభానికి ముందు గానే దేవుడు ఒక ప్రణాళికను కలిగి ఉన్నాడు అని మనకు దీనిని బట్టి అర్థమవుతుంది – **అందువలన అంత్యకాలం గురించిన మన అధ్యయనం, ఇక్కడే మొదలవుతుంది.**

ఈ సృష్టి చరిత్రంతా ఎవరి ఆధారితమై ఉంది, ముఖ్యంగా అంత్యకాలం కొరకు దేవుని ప్రణాళిక ఏమై ఉంది అని తెలుసుకోవడానికి, మనం యోహాను సువార్త, 17వ అధ్యాయంలో ఏముందో చూద్దాం – ఇక్కడే కుమారుడుగా ఉన్న దేవుడు – **యేసుక్రీస్తు** – గ్రంథంలో మరెక్కడా బయలుపడని విధంగా దేవునితో తనకున్న సంబంధాన్ని బయలు పరుస్తాడు. 5వ వచనంలో యేసు దేవునితో చేసిన ప్రార్థన – **"తండ్రీ, లోకము పుట్టకమునుపు నీయొద్ద నాకు ఏ మహిమ యుండెనో ఆ మహిమతో నన్ను ఇప్పుడు నీయొద్ద మహిమ పరచుము."** ఇక్కడ యేసు – శాశ్వతమైన గతంలో, తాను తండ్రితో కలిసి మహిమను కలిగియున్నాడని బయలు పరుస్తున్నాడు, ఇప్పుడు అదే మహిమతో మళ్ళీ ఆయనను

మహిమ పరచమని కోరుతున్నాడు. తరువాత 24వ వచనంలో ఇలా కొనసాగిస్తాడు – **"తండ్రీ, నేనెక్కడ ఉందునో అక్కడ నీవు నాకు అనుగ్రహించిన వారును నాతోకూడ ఉండవలె ననియు, నీవు నాకు అనుగ్రహించిన నా మహిమను వారు చూడవలెననియు కోరుచున్నాను. జగత్తు పునాది వేయబడక మునుపే నీవు నన్ను ప్రేమించితివి."**

కాల ఆవిర్భవానికి ముందుగానే, తండ్రియైన దేవుడు, **కుమారుడైన దేవునికిచ్చిన ఈ మహిమ ఏమిటి?** యేసు, పూర్తిగా ప్రదర్శించబడాలని కోరిన ఈ మహిమ ఏమిటి? **తండ్రి - కుమారునికి అనుగ్రహించిన "వారు" ఎవరు?** వీటికి సమాధానాలు ప్రవక్తయైన దానియేలు పలికిన మాటలలో కనబడతాయి:

> **రాత్రి కలిగిన దర్శనములను నేనింక చూచు చుండగా, ఆకాశమేఘారూఢుడై మనుష్య కుమారుని పోలిన యొకడు వచ్చి, ఆ మహా వృద్ధుడగువాని సన్నిధిని ప్రవేశించి, ఆయన సముఖమునకు తేబడెను. సకల జనులును రాష్ట్రములును ఆ యా భాషలు మాటలాడు వారును ఆయనను సేవించునట్లు ప్రభుత్వమును మహిమయు ఆధిపత్యమును ఆయన కీయబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది అదెన్నటికిని తొలగిపోదు; ఆయన రాజ్యము ఎప్పుడును లయముకాదు.** (7:13-14).

మరో మాటలో చెప్పాలంటే, **కాల ఆవిర్భవానికి ముందుగానే, తండ్రియైన దేవుడు, తన కుమారునికి ఒక మహిమాన్వితమైన రాజ్యాన్ని ఇచ్చుటకు, ఒక ప్రణాళికను కలిగి ఉన్నాడు. ఆ రాజ్య వారసులు – అన్ని దేశాల వారై, అన్ని భాషల వారై యుండి కుమారుడిని శాశ్వతముగా ఆరాధిస్తూ, ఆయనను శాశ్వతముగా మహిమ పరచాలని తండ్రి ప్రణాళిక.** ఇదే మనం చేస్తున్న ఎస్కటాలజీ అధ్యయనానికి ప్రాథమిక సత్యం – **తండ్రియైన దేవుడు, తన కుమారుడైన యేసుక్రీస్తునకు ఇవ్వనిశ్చయించిన ఆ రాజ్యం దిశగా, సమస్తమూ నడిపించ బడుతున్నాయి.**

రాబోవు క్రీస్తు రాజ్యం ఎలా ఉంటుంది? ఆ రాజ్య వారసులు ఎవరు? వారసులగుటకు అర్హతలు ఏమిటి? దీనికి సమాధానం మళ్ళీ యోహాను 17తోనే మొదలవుతుంది. "**తండ్రీ, నా గడియ వచ్చియున్నది**" (17:1; 12:23). **ఏ గడియ?** – 1 పేతురు 1:20 : "ఆయన **జగత్తు పునాది వేయబడక మునుపే** నియమింపబడెను గాని తన్ను మృతులలో నుండి లేపి తనకు మహిమనిచ్చిన దేవుని యెడల తన ద్వారా **విశ్వాసులైన మీ నిమిత్తము,** కడవరి కాలములయందు ఆయన ప్రత్యక్ష పరచబడెను..."

**ఏమని నియమింపబడెను?** – వ.18-19 "పితృపారంపర్యమైన మీ వ్యర్థప్రవర్తనను విడిచిపెట్టునట్లుగా వెండి బంగారములవంటి క్షయ వస్తువులచేత మీరు విమోచింపబడలేదుగాని అమూల్యమైన రక్తముచేత, అనగా, **నిర్దోషమును నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్ల**వంటి క్రీస్తు రక్తము చేత, విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా."

పేతురు చెబుతున్నదేమిటంటే – **జగత్తు పునాది వేయబడక మునుపే, తండ్రియైన దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తును – పాపులను వారి పాపము నుండి విమోచించు దేవుని పరిపూర్ణ గొర్రెపిల్లగా పంపాలని ఆయన ప్రణాళిక కలిగి ఉన్నాడు.** ఇదే విషయం, హెబ్రీ 13:20లో – తండ్రికిని కుమారునికిని మధ్యన ఒక – **"నిత్యమైన నిబంధన"** అని చెప్పబడుతుంది.

శాశ్వతమైన గతం నుండి ఈ నిబంధన యొక్క అంతరార్థం లోతైనది: **పాపం – ఆ పాపం నుండి ప్రాయశ్చిత్తం కొరకు చిందింపబడు రక్తం** (లేవీ 17:11; హెబ్రీ 9:22) ఇవి రెండూ జగత్తు పునాది వేయబడక మునుపే ఆలోచన చేయబడ్డాయి. మరో మాటలో చెప్పాలంటే, **పాపుల కొరకు క్రీస్తు చనిపోతాడనే దేవుని ప్రణాళిక, అసలు ఏ పాపీ ఇంకా పుట్టకమునుపే స్థాపించబడింది!** ఈ కారణం చేతనే అపొస్తలుడైన పౌలు ఇలా వ్రాస్తాడు – **మన క్రియలనుబట్టి కాక తన స్వకీయ సంకల్పమును బట్టియు, అనాది కాలముననే క్రీస్తుయేసు నందు మనకు అనుగ్రహింపబడినది.** (2 తిమో 1:9).

తండ్రియైన దేవుడు – తన ఉద్దేశ్యము చొప్పున, తన కృపను బట్టి, పాపులను రక్షించవలెనని, వారిని రాజ్య వారసులుగా చేయవలెనని, జగత్తు పునాది వేయబడక మునుపే నిర్ణయించియున్నాడు. అనగా, తండ్రి ఉద్దేశ్యం చొప్పున – వారి పాపములను బట్టి, వారికి బదులుగా న్యాయమైన శిక్షను పొందిన క్రీస్తు ద్వారా విమోచించబడిన వారు-రాజ్య వారసులై ప్రభువును నిత్యమూ ఆరాధించెదరు. (విలాప 3:1; ప్రక. 5:9-11). **యోహాను** 17:1లో యేసు చేసిన ప్రార్థనలో పలికిన **గడియ** – తండ్రియైన దేవుడు అనాదిలోనే **నిర్ణయించిన గడియ – ఈ సృష్టి, ఉనికి లోనికి రాక మునుపే; ఈ కాలం, ఆవిర్భవం కాక మునుపే; అసలు పాపం ప్రవేశింపక మునుపే – ప్రవేశించబోవు పాపమునకు, కలుగబోవు ఆయన ఉగ్రత నుండి, ఆయన సృష్టించబోవు మానవాళిని రక్షించుటకు – యేసుక్రీస్తు ద్వారా న్యాయమైన విమోచనను దయచేసి** (యెష 54:4-6; 9-11; 1యోహా 2:2; 4:10), **రాజ్య ప్రవేశాన్ని, శాశ్వతమైన జీవితాన్ని అనుగ్రహించాలని – తండ్రి, అనాదిలోనే ఉద్దేశించియున్నాడు.**

**ఇంతవరకూ ఇంత శ్రేష్టమైన, విశేషమైన & అత్యున్నతమైన ప్రేమను ఎవ్వరూ కనుపరచలేదు.** (యోహాను 15:13; రోమా 5:6,8-10). దేవుని పవిత్రమైన సద్గుణములో ప్రేమ శ్రేష్టమైనది గనుక (1 కొరింథీ 13:13), తన తండ్రి చిత్తానికి విధేయత చూపి క్రీస్తు స్వీకరించిన శ్రమ, చేసిన శిలువయాగం – **యుగయుగములకూ, ఇదొక అత్యంత మహిమాన్వితమైన కార్యం.**

తన సమయం ఆసన్నమైనది గనుక, ప్రభురాత్రి భోజన సమయంలో, తాను కనుపరచబోవు మహిమలో, తండ్రి పాలుపంచుకోవలెనని యేసు పలికిన మాటలు – **"ఇప్పుడు మనుష్యకుమారుడు మహిమ పరచబడియున్నాడు; దేవుడును ఆయనయందు మహిమ పరచబడియున్నాడు. దేవుడు ఆయనయందు మహిమ పరచబడినయెడల, దేవుడు తనయందు ఆయనను మహిమపరచును; వెంటనే ఆయనను మహిమపరచును."** (యోహాను 13:31-32).

ప్రభువు రాజ్య వారాసులను గురించి మనం అధ్యయనం చేయాల్సిన ముఖ్యమైన విషయం ఒకటి ఉంది: **రాజ్య నివాసులలో ప్రతి ఒక్కరినీ, తండ్రియైన దేవుడు, పేరు పేరునా వారిని ఎన్నుకొనియున్నాడు** (యోహాను 6:37, 44; 1 కోరింథీ 1:26-31). ఈ సత్యాన్ని పౌలు, థెస్సలొనీకయులకు వ్రాసిన 2వ పత్రికలో విశదపరుస్తాడు: **"ప్రభువువలన ప్రేమింపబడిన సహోదరులారా, ఆత్మ మిమ్మును పరిశుద్ధ పరచుట వలనను, మీరు సత్యమును నమ్ముటవలనను, రక్షణ పొందుటకు దేవుడు ఆదినుండి మిమ్మును ఏర్పరచు కొనెను గనుక మేము మిమ్మును బట్టి యెల్లప్పుడును దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లింప బద్ధులమైయున్నాము. మీరీలాగున రక్షింపబడి మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క మహిమను పొందవలెనని, ఆయన మా సువార్త వలన మిమ్మును పిలిచెను."** (2 థెస్స 2:13-14). మరొక సంధర్భంలో, ఎఫెసీయులకు కూడా తన పత్రికలో ఇలానే వ్రాస్తాడు – **"ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు, తన చిత్త ప్రకారమైన దయాసంకల్పము చొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను."** (1:4-6). అనగా, దేవుడు అనాదిలోనే రాజ్య వారసులను

ఎన్నుకున్నాడని, వారి రక్షణ నిమిత్తమే తాను సువార్త పరిచర్య చేస్తున్నాడని పౌలు పేర్కొంటాడు – **"అందుచేత ఏర్పరచబడినవారు నిత్యమైన మహిమతోకూడ క్రీస్తు యేసునందలి రక్షణ పొందవలెనని నేను వారికొరకు సమస్తము ఓర్చుకొనుచున్నాను."** (2 తిమో **2:10**).

ఇదొక అద్భుతమైన సందేశం: **క్రీస్తు వద్దకు వచ్చు ప్రతి ఒక్కరూ, అనాదిలోనే తండ్రిచేత ఎన్నుకోబడ్డారు** (యోహాను 6:37, 44, 65). అనగా, **రాబోవు క్రీస్తు రాజ్య వారసులందరూ, కాల ఆవిర్భవానికి ముందుగానే ఎన్నుకోబడి, వారి పేర్లు గొఱ్ఱెపిల్లయొక్క జీవగ్రంథమందు లిఖించబడ్డాయి** (ప్రకటన 13:8; 17:8) – **ఇదంతా కేవలం కుమారుడైన దేవుని మహిమార్థమై జరుగుతుంది**.

దేవుడు తన కుమారునికి ఇవ్వనిశ్చయించిన రాజ్యంలో కేవలం కొందరిని మాత్రమే ఎన్నుకుంటాడు, అందరినీ కాదు, అనే మాట ఒక పక్షపాత ధోరణిగా మనలో కొందరికి అనిపించవచ్చు. మనం మానవులం గనుక, మన ఆలోచనలు అంతవరకే ఆలోచించగలగడం, పూర్తిగా మానవ సహజం. కానీ మానవ హృదయం, పాపం చేత చెడి పోయినదని మనం గుర్తుంచుకోవాలి, అందువలన ఈ విశ్వంలో, ఏది నిజంగా న్యాయమైనదో, ఏది కాదో అని మనం పూర్తి స్థాయిలో తెలుసుకోలేము (ఎఫెసీ 4:17-18; తీతు 1:15)

**మనం శరీర స్వభావము గలవారిగా కాక, ఆత్మస్వభావము గలవారిగా మారితే తప్ప నిజమైన దేవుని నీతిని అర్థం చేసుకొనలేము** (రోమా 8:7-8). అంతే కాదు, ఈ సృష్టిలోని ఏ ఒక్క విషయమూ, మానవుల దృష్టిలో అది ఉత్తమమైనదని లేదా కాదని, అనే విషయాన్ని బట్టి కాక, కేవలం దేవుని మహిమను బట్టి, తన అంతిమ ప్రణాళికను బట్టి సమస్తమూ నిర్ణయించబడ్డాయి. **"....ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను"** (ఎఫెసీ1:6). విశ్వంలోని అన్ని విషయాలతో పాటుగా, పాపులకు రక్షణ దయచేయుట కూడా, అంతిమంగా, దేవుని మహిమ హెచ్చింపబడుట కొరకు మాత్రమే రూపొందించబడినది.

అసలు ఈ విషయాలన్నీ మనకు ఎలా తెలుస్తాయి? పాపం నిమిత్తం పశ్చాత్తాప పడవలెనని, క్రీస్తు మన కొరకు చేసిన శిలువ బాలియాగాన్ని నమ్ముట వలన రక్షణ అని, దేవుని యొక్క ఈ నిత్యసంకల్పాన్ని మానవులు ఎలా అర్థం చేసుకోగలరు? – అనాదిలోనే దేవుడు చేసిన ప్రకటనను ఇక్కడ దేవుని వాక్యగ్రంథంలో చూద్దాం రండి. కొరింథులోని సంఘానికి పౌలు ఇలా వ్రాస్తాడు – **"దేవుని జ్ఞానము మర్మమైనట్టుగా**

**బోధించుచున్నాము; ఈ జ్ఞానము మరుగై యుండెను. జగదుత్పత్తికి ముందుగానే దీనిని దేవుడు మన మహిమ నిమిత్తము నియమించెను"** (1 కొరింథీ 2:7). **ఆ "మరుగైయున్న జ్ఞానము" ఏమిటి? – "నమ్ము ప్రతివానికి.... రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది."** (రోమా 1:16). తన సువార్త పరిచర్యలో పౌలు చేసిన ప్రకటన – **"దేవుడు కార్యకారియగు తన శక్తినిబట్టి నాకు అనుగ్రహించిన కృపావరము చొప్పున నేను ఆ సువార్తకు పరిచారకుడనైతిని. దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసునందు చేసిన నిత్యసంకల్పము చొప్పున, పరలోకములో ప్రధానులకును అధికారులకును, సంఘము ద్వారా తనయొక్క నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడ వలెనని ఉద్దేశించి... "** (ఎఫెసీ 3:7-9). అనగా, ఆది నుండి అంతము వరకూ ఈ సృష్టి నిమిత్తం దేవుడు కలిగియున్న ఉద్దేశ్యం, కేవలం ఆయనకు మాత్రమే తెలిసినది కాదని, అనాదిలోనే తన వాక్యమందు (వాక్యగ్రంథమందు) స్థాపించబడినదని పౌలు ప్రకటిస్తున్నాడు. గనుక, దేవుని వాక్యమైయున్న పరిశుద్ధ గ్రంథాన్ని క్షుణ్ణంగా పరిశీలించుట వలన మాత్రమే, ఈ సృష్టి యొక్క భవిష్యత్తును, దానికి గల దేవుని అంతిమ ప్రణాళికను మనం అర్థం చేసుకోగలము.

**ఈ అధ్యాయంలో మనం ఏం నేర్చుకున్నాము?** త్రియేకమైయున్న దేవుడు, శాశ్వతమైన గతం నుండీ, ఒక మహిమాన్వితమైన అస్తిత్వాన్ని కలిగియున్నాడు.
అనాదిలోనే – తండ్రియైన దేవుడు, తన కుమారుడు మహిమ పొందునట్లు – తన కుమారుని శిలువయాగము చేత, పాపము నుండి విమోచించబడి, రక్షించబడిన వారు – రాజ్యవారసులుగా గల ఒక మహిమాన్వితమైన రాజ్యాన్ని తన కుమారునికి ఇవ్వనుద్దేశించాడు.
**అయితే ఈ సంగతులన్నీ, కాల ఆవిర్భావానికి ముందుగానే దేవుని చేత నిర్ణయించబడ్డాయని, దేవుని వాక్యగ్రంథమందు లిఖితమైయుండుట మనం చూసాము.**

ఆయన మహిమనొందునట్లు, క్రీస్తు రాజ్యం భవిష్యత్తులో రానున్నదని మనం తెలుసుకున్నాము. అయితే **ఇది ఎలా రానున్నది? ఈ "ఎన్నుకోబడిన వారు" ఎవరు? మరి, ఈ రాజ్యం ఎలా నిర్మించబడనున్నది?**

అనే ఈ ప్రశ్నలకు సమాధానాలను, మనం తదుపరి అధ్యాయంలో అధ్యయనం చేస్తాము.

# 2

# ఇశ్రాయేలు: అంత్యకాలమునకు మూలస్తంభం

బైబిల్ పాఠకులకు, లేఖనాలలో తరచుగా తారసపడే ఒక పదం: **ఇశ్రాయేలు.** దేవుడు – **"ఇశ్రాయేలీయుల రాజైన యెహోవా వారి విమోచకుడైన సైన్యములకధిపతియగు యెహోవా...."** (యెష 44:6) అని ప్రకటిస్తాడు. ఆయన ఇశ్రాయేలు గురించి పలికిన మాటలు – **"యాకోబూ, ఇశ్రాయేలూ; వీటిని జ్ఞాపకము చేసికొనుము నీవు నా సేవకుడవు నేను నిన్ను నిర్మించితిని ఇశ్రాయేలూ, నీవు నాకు సేవకుడవై యున్నావు నేను నిన్ను మరచిపోజాలను."** (44:21). తరువాతి వచనంలో – **"మంచు విడిపోవునట్లుగా నేను నీ యతిక్రమములను మబ్బు తొలగు నట్లుగా నీ పాపములను తుడిచివేసి యున్నాను..."** ఇంకా, ఆకాశములారా, ఉత్సాహధ్వని చేయుడని కూడా చెబుతాడు, ఎందుకని? – **"...యెహోవా యాకోబును విమోచించును ఆయన ఇశ్రాయేలులో తన్నుతాను మహిమోన్నతునిగా కనుపరచుకొనును."** (44:22-23). చివరగా, దేవుడు ఇశ్రాయేలునకు ఒక వాగ్దానం కూడా చేస్తాడు – **"నా నీతిని దగ్గరకు రప్పించియున్నాను అది దూరమున లేదు నా రక్షణ ఆలస్యము చేయలేదు సీయోనులో రక్షణనుండ నియమించు చున్నాను ఇశ్రాయేలునకు నా మహిమను అనుగ్రహించు చున్నాను."** (46:13).

ఇక్కడ స్పష్టంగా, "ఇశ్రాయేలు" దేవునికి చాలా ముఖ్యమైనదిగా మనకు కనబడుతుంది. ఇశ్రాయేలు – దేవుని చేత ఏర్పరచబడిందని, దేవునిచే విమోచించ బడిందని, ఆయనన ఎన్నటికీ ఇశ్రాయేలును మరువడని, చివరగా, దేవుడు ఇశ్రాయేలు ద్వారా మహిమ పొందుతాడని పై వాక్యభాగాలు వెల్లడిస్తున్నాయి. ఇశ్రాయేలు కొరకైన దేవుని ఉద్దేశ్యం, పాత నిబంధన మొదలుకొని క్రొత్త నిబంధన వరకూ తరచుగా కనబడుతుంది. అసలు ఈ **ఇశ్రాయేలు** అను పదం **ఎవరిని (లేదా) దేనిని సూచిస్తుంది?** ఎన్నో చోట్ల **అక్షరార్థ వివరణ**కు బదులుగా, replacement theology – **ప్రత్యామ్నాయ వేదాంతాన్ని** అనుసరిస్తారు – దాని ప్రకారం "ఇశ్రాయేలు"నకు అర్థం " క్రైస్తవ సంఘం" అని అభిప్రాయ పడతారు. గనుక వారు క్రైస్తవ సంఘాన్ని "నూతన ఇశ్రాయేలు" అని పిలుస్తారు – దీనివలన, మెస్సయ్యను జాతీయంగా తిరస్కరించిన పాత నిబంధన యూదులను, వారికి చేసిన వాగ్దానాలను కూడా తృణీకరిస్తున్నారు. "**ఇశ్రాయేలు**" అంటే

“**ఇశ్రాయేలు సంతతి**” వారికి బదులుగా “**క్రైస్తవ సంఘానికి**” ఆపాదించే ఈ రీప్లేస్‌మెంట్ థియాలజీ - **ప్రత్యామ్నాయ వేదాంతం – సరైనది కాదు.**

ఇలా అక్షరార్థ భావనకు బదులుగా, ప్రత్యామ్నాయ వివరణలను ఇచ్చుటకు, బైబిల్ నందు ఎలాంటి ఆధారమూ కనబడుట లేదు. గనుక వాక్యగ్రంథమందు, “ఇశ్రాయేలు” అని ప్రస్తావించబడిన ప్రతిసారీ, అది – అబ్రహాము, ఇస్సాకు, ఇశ్రాయేలు అని పిలవబడిన యాకోబు వంశావళి నుండి వచ్చిన **యూదా సంతతి** వారినే సూచిస్తుంది.

ఇశ్రాయేలును గురించి ఇంత స్పష్టంగా తెలుసుకోవడం, ఎందుకంత ముఖ్యమైనది? ఎందుకనగా, ఎన్నుకోబడిన జనాంగమైన ఇశ్రాయేలునకు, దేవుడు చేసిన ఒడంబడికలను/ నిబంధనలను, వాగ్దానాలను అర్థం చేసుకోవడం ద్వారా మాత్రమే, అంత్యకాల సంగతులను అర్థం చేసుకోవడం వీలవుతుంది. మరో మాటలో చెప్పాలంటే, మనం చేస్తున్న ఈ **ఎస్కటాలజీ అధ్యయనానికి మూలస్తంభం - ఇశ్రాయేలు.**

దీనిని బాగా అర్థం చేసుకునేందుకు దోహదపడునట్లుగా, **మాక్ ఆర్థర్** గారు ఈ క్రింద 4 వాక్యాల సరణిని అందించారు:

1) మీరు **ఇశ్రాయేలును** సరిగ్గా గుర్తించ గలిగినప్పుడే, **అంత్యకాలం** గురించి సరిగ్గా అర్థం చేసుకోగలరు;

2) మీరు **పాత నిబంధన ఒడంబడికలు/ వాగ్దానాలను** సరిగ్గా అర్థం చేసుకున్నప్పుడే, **ఇశ్రాయేలును** సరిగ్గా గుర్తించగలరు;

3) మీరు సరైన విధంగా **లేఖనాలను పరిశీలించిన్నప్పుడే**, **పాత నిబంధన ఒడంబడికలు/ వాగ్దానాలను** సరిగ్గా అర్థం చేసుకోగలరు;

4) మీత స్పష్టంగా మాట్లాడుతున్న దేవునివాక్యాన్ని, వాటి **అక్షరార్థ భావనను గ్రహించినప్పుడే**, మీరు సరైన విధంగా **లేఖనాలను పరిశీలించగలరు**.

అటువంటి అక్షరార్థ వివరణ ప్రకారం, దేవుడు ఇశ్రాయేలుతో చేసిన నిబంధనలు (లేదా) వాగ్దానాలు ఏమిటి? ప్రస్తుతం మనం చేస్తున్న అధ్యయనానికి సంబంధించి ఐదు ప్రధానమైన నిబంధనలు ఉన్నాయి. వాటిని వరుసగా చూస్తే – **అబ్రహాముతో చేసిన నిబంధన, మోషేతో చేసిన నిబంధన, దావీదుతో చేసిన నిబంధన, క్రొత్త నిబంధన, మరియు వాగ్దానదేశం నిమిత్తం చేసిన నిబంధన.** ఇశ్రాయేలుతో చేసిన ఈ నిబంధనలన్నీ కొన్ని

సాధారణ (common points) లక్షణాలను కలిగి ఉన్నాయి: (1) **ఇవన్నీ దేవుని కృపచేత ప్రవేశ పెట్టబడ్డాయి**; (2) **ఇవన్నీ కొన్ని నిర్దిష్ట సమయాలలో ఇవ్వబడ్డాయి**; (3) **ఏ నిబంధనా – మునుపటి నిబంధనను రద్దు చేయదు**; (4) **ప్రతీ నిబంధన – విధేయతకు ఆశీర్వాదాలను, మరియు అవిధేయతకు శాపాలను వాగ్దానం చేసింది**; (5) **నిబంధనలన్నీ క్రీస్తునందు వాటి అంతిమ నెరవేర్పు మరియు సార్థకత కొరకు కనిపెడతాయి.**

వీటిలోని కొన్ని ముఖ్యాంశాలను వరుసగా చూద్దాం. **మొదటిది**, అబ్రహాముతో చేసిన నిబంధన – దేవుడు అబ్రామును, ఊరను పట్టణము నుండి పిలిచి, వాగ్దాన దేశమైన కనానుకు పంపినప్పుడు ఒక నిబంధన చేస్తాడు. ఆయన సార్వభౌమాధికారం మరియు ఉద్దేశ్యం చొప్పున, దేవుడు అబ్రామును (అబ్రహాముకు ముందు), ఇలా దీవిస్తాడు – "**నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును, నీవు ఆశీర్వాదముగా నుందువు. నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను; నిన్ను దూషించువాని శపించెదను; భూమియొక్క సమస్తవంశములు నీయందు ఆశీర్వదించబడునని....**" (ఆది 12:2-3). ఈ వాగ్దానం ఏ ప్రత్యేకతలను కలిగి ఉంది? క్లుప్తంగా చూస్తే, దేవుడు అబ్రామును ఒక జనాంగంగా/ దేశంగా చేస్తానని వాగ్దానం చేశాడు. అయితే ఏ దేశానికైనా 3 ముఖ్యమైన అంశాలుంటాయి:

**ప్రజలు**, **భూములు - ఆస్తులు**, **నాయకులు - చట్టాలు.**

లెక్కింపశక్యము కాని సంతానముతో ఒక జనాంగం – అనగా, **ప్రజలు** (ఆది **13:16; 17:4-6; 22:17**); నేటి వరకూ నిరూపించగల, ప్రాదేశిక సరిహద్దులతో కూడిన **భూమి** (**13:14-15; 15:18-21; 17:8**); మరియు, **చట్టాలు కలిగిన నాయకత్వం** (22:17-18).

ఈ వాగ్దానం ఎంతకాలం అమలులో ఉంటుంది? – **ఎల్లప్పటికీ...** (ఆది **13:15**; లూకా **1:55**). ఎందుకంటే, దేవుడు అబ్రహాముతో ఒక **నిర్నిబంధమైన** (unconditional) **నిత్యనిబంధనను** చేశాడు (ఆది 13, 17:7-8, 19). అపొస్తలుడైన పౌలు, "**దేవుడు తన కృపావరముల విషయములోను, పిలుపు విషయములోను పశ్చాత్తాప పడడు.**" అని ప్రకటిస్తాడు (రోమా 11:29).

దాదాపు 1000 సంవత్సరాలు తర్వాత – దేవుడు, అబ్రహాముతో చేసిన నిబంధనలను విస్తరిస్తూ, దావీదుతో ఒక నూతన నిబంధనను చేస్తాడు. 2 **సమూ 7:12**లో, దేవుడు అబ్రహాముతో చేసినట్లుగానే, రాజైన దావీదుతో కూడా ఒక నిర్నిబంధమైన నిత్యనిబంధనను చేస్తాడు – "**నీ దినములు సంపూర్ణములగునప్పుడు నీవు నీ పితరులతో కూడ నిద్రించిన తరువాత నీ గర్భములోనుండి వచ్చిన నీ సంతతిని హెచ్చించి, రాజ్యమును**

**అతనికి స్థిరపరచెదను."** 16వ వచనంలో కొనసాగిస్తూ: **"నీ మట్టుకు నీ సంతానమును నీ రాజ్యమును నిత్యము స్థిరమగును, నీ సింహాసనము నిత్యము స్థిరపరచబడును అనెను."** కీర్తన 89లో మరొకసారి: **"అతని సంతానము శాశ్వతముగా ఉండుననియు అతని సింహాసనము సూర్యుడున్నంతకాలము నా సన్నిధిని ఉండుననియు చంద్రుడున్నంత కాలము అది నిలుచుననియు మింటనుండు సాక్షి నమ్మకముగా ఉన్నట్లు అది స్థిరపరచబడుననియు నా పరిశుద్ధతతోడని నేను ప్రమాణము చేసితిని దావీదుతో నేను అబద్ధమాడను"** (89:35-37). కాబట్టి, దావీదుతో తాను చేసిన నిబంధన ద్వారా, దేవుడు ఇశ్రాయేలుకు ఏం వాగ్దానం చేశాడు? **ఒక శాశ్వతమైన రాజ్యం – దావీదు వంశము నుండి శాశ్వతముగా పరిపాలించు ఒక రాజు.**

అయితే అబ్రహాము, దావీదులతో చేసిన నిబంధనల నడుమ దేవుడు, మోషేతో కూడా ఒక నిబంధన చేసియున్నాడు – అదే మోషే ద్వారా అనుగ్రహించబడిన **ధర్మశాస్త్రం** – రేబోవు క్రొత్త నిబంధనతో పాటు, మునుపటి నిబంధనలను నెరవేర్చుటకు, తన జనులను సిద్ధం చేయుటకు, దేవుడు ధర్మశాస్త్రాన్ని ప్రవేశపెట్టాడు – పది ఆజ్ఞలు, వందలాది చట్టపరమైన శాసనాలు, బలులు, పండుగలు, ప్రత్యక్ష గుడారాలు, మొదలగు ఎన్నో వాటిని ప్రవేశపెట్టి – **దేవుని పరిశుద్ధతకు, మనిషి పాపస్థితికి మధ్యనున్న దూరాన్ని వారు తెలుసుకొనునట్లు, మరియు ఒక రక్షకుని యొక్క అవసరాన్ని వారు గుర్తెరుగునట్లు, వారికొక ప్రతీకగా ఉండునట్లు – దేవుడు ధర్మశాస్త్రాన్ని ప్రవేశపెట్టాడు.** అబ్రహాముతో చేయబడిన నిబంధన సంపూర్ణమగునట్లు, ఒక మేలైన క్రొత్త నిబంధన ఉద్భవించునట్లు, మోషే ధర్మశాస్త్రం ఎంతగానో దోహదపడింది.(హెబ్రీ 7:22; లేవీ 26). అబ్రహాముతో చేయబడిన నిబంధనకును, మోషే ద్వారా అందించబడిన ధర్మశాస్త్రానికిని మధ్య గల విశేష సంబంధాన్ని పౌలు స్పష్టంగా చెబుతాడు: **"ఆలాగైతే ధర్మశాస్త్ర మెందుకు? ఎవనికి ఆ వాగ్దానము చేయబడెనో ఆ సంతానము [మెస్సయ్య] వచ్చువరకు అది అతి క్రమములనుబట్టి దానికి తరువాత ఇయ్యబడెను; అది మధ్యవర్తిచేత దేవదూతల ద్వారా నియమింపబడెను."** (గలతీ 3:19). తరువాతి వచనంలో ఇలా వివరిస్తాడు – **"....ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను."** (3:24). అబ్రహాముతో చేయబడిన నిబంధన మొదలుకొని తరువాత చేయబడిన నిబంధనల వరకూ, అన్నీ దేవుని అంతిమ ఉద్దేశ్యం యొక్క నెరవేర్పునకు దోహదపడతాయి (రోమా 9:4).

మోషే ధర్మశాస్త్రాన్ని పాటించడంలో ఇశ్రాయేలు విఫలమైనందున, దేవుని ఇతర వాగ్దానాలు – అనగా, అబ్రహాము, దావీదులతో చేసిన నిబంధనలు రద్దు అయిపోతాయా?

దీనికి సమాధానం పౌలు మాటలలో చూద్దాం – **గలతీ** 3:17-18: **"నేను చెప్పునదేమనగా 430 సంవత్సరములైన తరువాత వచ్చిన ధర్మశాస్త్రము, వాగ్దానమును నిరర్థకము చేయునంతగా పూర్వమందు దేవునిచేత స్థిరపరచబడిన నిబంధనను కొట్టివేయదు. ఆ స్వాస్థ్యము ధర్మశాస్త్రమూలముగా కలిగినయెడల ఇక వాగ్దానమూలముగా కలిగినది కాదు. అయితే దేవుడు అబ్రాహామునకు వాగ్దానము వలననే దానిని అనుగ్రహించెను."**

వారి స్వభావ స్థితిని బట్టి, పాపులు చేయలేనివాటిని వారు చేయలేదు గనుక, దేవుని వాగ్దానాలు ఎన్నటికినీ రద్దు చేయబడవు. దేవుడే ప్రక్షాళన చేసి నూతనపరిస్తే తప్ప, ఏ దేశస్తుడూ, చివరకు ఎన్నుకోబడిన ఇశ్రాయేలు వారు కూడా, దేవుని ధర్మశాస్త్రాన్ని పాటించలేరు. మరి ఇలాంటి పరిస్థితుల్లో, ఇశ్రాయేలు యొక్క పాపపు హృదయాన్ని మార్చుటకు, తద్వారా అబ్రహాము, దావీదులతో ముందుగా చేసిన నిబంధనలను నెరవేర్చుటకు ఒక సాధనం అవసరం. ఇందునిమిత్తమే క్రొత్త నిబంధన వాగ్దానం చేయబడింది. దీని గురించి ప్రవక్తయైన యిర్మీయా ఇలా వివరిస్తాడు:

> **'ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను యూదావారి తోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి; ఇదే యెహోవా వాక్కు. అది ఐగుప్తులోనుండి వారిని రప్పించుటకై నేను వారిని చెయ్యి పట్టుకొనిన దినమున, వారి పితరులతో నేను చేసిన నిబంధనవంటిది కాదు; నేను వారి పెనిమిటినైనను వారు ఆ నిబంధనను** [**మోషే ధర్మశాస్త్రం**] **భంగము చేసికొనిరి; యిదే యెహోవా వాక్కు."** (31:31-32).

మరో మాటలో చెప్పాలంటే – మోషే ధర్మశాస్త్రాన్ని పాటించి, ఇశ్రాయేలు వారు దేవుని ప్రమాణాలైన – పరిపూర్ణమైన పరిశుద్ధతను, నీతిని సాధించలేకపోయారు గనుక వారికొక "క్రొత్త" నిబంధన అవసరమైనది. 33వ వచనంలో: **"'ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను చేయబోవు నిబంధన యిదే, వారి మనస్సులలో నా ధర్మవిధి ఉంచెదను, వారి హృదయముమీద దాని వ్రాసెదను; యెహోవా వాక్కు ఇదే."** మరొక ప్రకరణంలో – యెహెజ్కేలు 36:26-27: **"నూతన హృదయము మీ కిచ్చెదను, నూతన స్వభావము మీకు కలుగజేసెదను, రాతిగుండె మీలోనుండి తీసివేసి మాంసపు గుండెను మీకిచ్చెదను. నా ఆత్మను మీయందుంచి, నా కట్టడల ననుసరించు వారినిగాను నా విధులను గైకొను వారినిగాను మిమ్మును చేసెదను."**

దీని పేరే: **రక్షణ/ విమోచన.** ఇశ్రాయేలును విమోచిస్తానని దేవుడు వాగ్దానం చేశాడు (రోమా 11:26). నీతిమంతులను ఆశీర్వదిస్తానని కూడా వాగ్దానం చేశాడు (కీర్తన 5:12),

అయితే దానికి వైరుధ్యంగా గ్రంథంలో ఇలా వ్రాయబడింది – **"నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు"** (రోమా 3:10). అందువలన, క్రొత్త నిబంధన ప్రకారం, ముందుగా దేవుడు ఇశ్రాయేలు యొక్క పాప స్థితిని మార్చి, అబ్రహాము, దావీదులతో ఆయన చేసిన నిబంధనలను నెరవేర్చుతాడని వెల్లడవుతుంది.

మరి ఇశ్రాయేలు కానివారి సంగతేమిటి? అన్యజనులైన విశ్వాసుల సంగతేమిటి? దేవుని వాగ్దానాలు వారికి కూడా వర్తిస్తాయా? **ఖచ్చితంగా!** మారుమనస్సు పొంది, వారి పాపస్థితి నిమిత్తమె పశ్చాత్తాపపడి, క్రీస్తు యొక్క ప్రాయశ్చిత్త బలిని విశ్వసించు ప్రతిఒక్కరికీ – దేవుడు ఇశ్రాయేలుకు చేసిన వాగ్దానాలు, వారికి కూడా వర్తిస్తాయని, దేవుని వాక్యం హామీ ఇస్తుంది. (రోమీ 10:13; గలతీ 3:14, 29). కేవలం ఇశ్రాయేలు మాత్రమే దేవుని దయకు, ప్రేమకు ఏకైక లబ్ధిదారిగా చెప్పబడలేదు; బదులుగా, ఇశ్రాయేలు ద్వారా రక్షణ, సమస్త మానవాళికి కలగాలని ఉద్దేశించబడినది (యెష 45:22; యోహా 4:22). ఇదే విషయాన్ని యెషయా ప్రవక్త ఇలా వ్రాస్తాడు (దేవుడు, తన కుమారుడైన యేసు గురించి చెప్పినట్లుగా): **"నీవు యాకోబు గోత్రపువారిని ఉద్ధరించునట్లును ఇశ్రాయేలులో తప్పింపబడినవారిని రప్పించునట్లును నా సేవకుడవై యుండుట ఎంతో స్వల్పవిషయము; భూదిగంతముల వరకు నీవు నేను కలుగజేయు రక్షణకు సాధనమగుటకై అన్యజనులకు వెలుగైయుండునట్లు నిన్ను నియమించి యున్నాను"** (యెష 49:6). అనగా, క్రొత్త నిబంధన ద్వారా – కేవలం ఇశ్రాయేలుకు మాత్రమే కాదు, ప్రపంచంలోని విశ్వాసులందరికీ రక్షణ కలదు అని వ్రాయబడినది. అంతే కాదు, క్రీస్తు రాజ్యంలో ఇశ్రాయేలుతో పాటుగా, విశ్వాసులైన వారందరూ పాల్గొంటారు.

చివరగా ఐదవ నిబంధన – **వాగ్దానదేశం నిమిత్తం చేసిన నిబంధన –** తరచుగా విస్మరించబడే నిబంధన ఇది. కానీ ఇశ్రాయేలు భవిష్యత్తునకు ఇది చాలా ముఖ్యమైనది. మోయాబు మైదానాలలో దేవుడు ఇశ్రాయేలుతో చేసిన నిబంధన ఇది.( ద్వితీ 27-30). ఈ నిబంధన – వాగ్దాన భూమిపై ఇశ్రాయేలుకు హక్కులను వాగ్దానం చేసింది. అది ఇశ్రాయేలుకు, దేవుని నుండి బహుమతిగా ఇవ్వబడింది (ద్వితీ 3:18). ఈ నిబంధన ప్రకారం, వారు అవిధేయత చూపిన యెడల ఇశ్రాయేలును భూ-నలుదిక్కులకు చెదరగొడతానని దేవుడు వాగ్దానం చేస్తాడు. తరువాత వారు అవిధేయత చూపుట వలన, చెదరగొట్టబడతారు. అయితే, 30వ అధ్యాయంలో – చెదరిన వారందరూ, భూ-నలుదిక్కుల నుండి వాగ్దాన దేశానికి ఒకే జనాంగముగా తిరిగి చేర్చబడతారని, అప్పుడు వారు దేవునికి లోబడునట్లు వారికి నూతన హృదయం ఇవ్వబడుతుందని, వారు వారికి వాగ్దానం

చేయబడిన దేశంలోనే నివసిస్తారని కూడా వాగ్దానం చేయబడింది. అయితే ఈ రెండవ వాగ్దానం ఇంకా నెరవేరాల్సి ఉంది.

ఈ అధ్యాయంలో మనం ఏం తెలుసుకున్నాము? భవిష్యత్తులో, యూదా సంతతి వారు, సమిష్టిగా యేసుక్రీస్తును రక్షకుడిగా విశ్వసిస్తారని; యూదులలో మిగిలియున్నవారి రక్షణ నిమిత్తం, అనాదిలోనే దేవుడు కలిగియున్న ఉద్దేశ్యం ఇంకా నెరవేరాల్సి ఉందని, అది నెరవేరిన తరువాత, వారి వాగ్దాన రాజ్యాన్ని వారికి అందించడానికి, యేసు తిరిగి వస్తాడని తెలుసుకున్నాం. జెకర్యా 12:10 – **"దావీదు సంతతివారిమీదను యెరూషలేము నివాసులమీదను కరుణ నొందించు ఆత్మను విజ్ఞాపనచేయు ఆత్మను నేను కుమ్మరింపగా వారు తాము పొడిచిన నామీద దృష్టియుంచి, యొకడు తన యేక కుమారుని విషయమై దుఃఖించునట్లు, తన జ్యేష్ఠపుత్రుని విషయమై యొకడు ప్రలాపించునట్లు అతని విషయమై దుఃఖించుచు ప్రలాపింతురు."**

భవిష్యత్తులో, ఇశ్రాయేలులో (ఇజ్రాయెల్ దేశంలో) ఒక భౌతికమైన రాజ్యం స్థాపించబడి, నిత్యరాజైన యేసుక్రీస్తు చేత పరిపాలించబడుతుంది. ఈ వాగ్దానాన్ని దేవుడు – తాను ఎన్నుకున్న జనాంగమైన ఇశ్రాయేలుతో, ఒక నిర్నిబంధమైన నిబంధనగా చేశాడు. (హెబ్రీ 6:13-20).

క్రొత్త నిబంధన ఆధారంగా, ప్రభువైన యేసుక్రీస్తుపై విశ్వాసముంచిన ప్రతి ఒక్కరూ, రక్షించబడి, రాబోవు భౌతికమైన క్రీస్తు రాజ్యంలో (తరువాత శాశ్వతమైన రాజ్యంలో కూడా) వారసత్వం పొందుతారు.

తరువాతి అధ్యాయంలో, అంత్యకాలానికి సంబంధించి, ఇశ్రాయేలు యొక్క భవిష్యత్తును గురించిన ఒక ముఖ్యమైన ప్రవచనాన్ని మనం విశ్లేషిస్తాము.

# 3

# దానియేలుకు కలిగిన దర్శనము

ఇంతవరకూ మనం చూసినట్లుగా, దేవుడు – తాను ఎన్నుకున్న జనాంగమైన ఇశ్రాయేలుతో, కొన్ని విశేషమైన, నిర్నిబంధమైన నిబంధనలను చేసినట్లుగా చూశాము. ఆ వాగ్దానాల అనుసారం, అంతిమంగా, ఇశ్రాయేలు రక్షణ పొందునని, ఇశ్రాయేలు ద్వారా ప్రపంచమంతటికీ రక్షణ కలుగునని తెలుసుకున్నాము. ఇప్పుడు మనం అధ్యయనం చేయనున్న అధ్యాయం - **దానియేలుకు కలిగిన దర్శనము** ఏమిటో చూద్దాం.

వాక్యగ్రంథంలోని ఒక ప్రత్యేక వాక్యభాగమైన, **దానియేలు 9:24-27 – అంత్య కాలానికి మరియు ఇశ్రాయేలుకు గల సంబంధాన్ని నేరుగా సూచిస్తుంది.** ఒకసారి, సర్ ఐజక్ న్యూటన్ (సైంటిస్టు) – క్రైస్తవ విశ్వాసం ఆధారితమైన సత్యం, ఈ ఒక్క ప్రవచనంపై మాత్రమే ఆధారపడి ఉందని ఆయన పేర్కొంటాడు. **అంత్యకాల సంఘటనల కాలక్రమం** గురించి యేసుప్రభువు చేసిన అత్యంత ఖచ్చితమైన వివరణలో కూడా, ఈ ప్రవచనాన్నే పునాదిగా పేర్కొన్నాడు **(మత్తయి 24).** అంత్యకాల సంఘటనలను గూర్చి ప్రస్తావించు ఏ ఇతర వేదాంతం అయినప్పటికీ ఈ వాక్యభాగం లేకుండా పూర్తి కాదు. ఇక వాక్యంలోనికి వెళితే:

> **24 తిరుగుబాటును మాన్పుటకును, పాపమును నివారణ చేయుటకును, దోషము నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయుటకును, యుగాంతము వరకుండునట్టి నీతిని బయలు పరచుటకును, దర్శనమును ప్రవచనమును ముద్రించుటకును, అతి పరిశుద్ధ స్థలమును అభిషేకించుటకును, నీ జనమునకును పరిశుద్ధ పట్టణమునకును డెబ్బదివారములు విధింపబడెను.**
>
> **25 యెరూషలేమును మరల కట్టించవచ్చునని ఆజ్ఞ బయలుదేరిన సమయము మొదలుకొని అభిషిక్తుడగు అధిపతి వచ్చువరకు ఏడు వారములు పట్టునని స్పష్టముగా గ్రహించుము. అరువది రెండు వారములు తొందరగల సమయము లందు పట్టణపు రాచవీధులును కందకములును మరల కట్టబడును.**
>
> **26 ఈ అరువది రెండు వారములు జరిగిన పిమ్మట ఏమియు లేకుండ అభిషిక్తుడు నిర్మూలము చేయబడును. వచ్చునట్టి రాజు యొక్క ప్రజలు పవిత్ర పట్టణమును**

**పరిశుద్ధ ఆలయమును నశింపజేయుదురు, వాని అంతము హఠాత్తుగా వచ్చు ను మరియు యుద్ధకాలాంతమువరకు నాశనము జరుగునని నిర్ణయింపబడెను.**

**27అతడు ఒక వారమువరకు అనేకులకు నిబంధనను స్థిరపరచును; అర్ధవారమునకు బలిని నైవేద్యమును నిలిపివేయును హేయమైనది నిలుచువరకు నాశనము చేయువాడు వచ్చును నాశనము చేయువానికి రావలెనని నిర్ణయించిన నాశనము ముగించువరకు ఈలాగున జరుగును.**

ఈ నాలుగు వచనాలు అనేక కారణాల వలన, బైబిల్ బోధకులకు మరియు వ్యాఖ్యాతలకు ఒక సవాలుగా నిలిచాయని, హీబ్రూ (హెబ్రీ) పండితులు అంగీకరిస్తారు. ఇందులో ప్రధానమైన కారణం, బహుశా ఈ ప్రవచనంలో – "**క్రీస్తు యొక్క రెండు రాకడలను గూర్చి ఇమిడి ఉండడం**" వలన కావచ్చు. దానియేలు మరియు పాత నిబంధన పరిశుద్ధులు, రెండు రాకడలను గురించి ఆలోచించలేదు – వారు ఒక్క రాకడను మాత్రమే గ్రహించారు. దీనిని ఆంగ్లములో prophetic foreshortening (ప్రొఫెటిక్ ఫోర్‌షోర్టెనింగ్) అంటారు. ఎందుకంటే, క్రీస్తు యొక్క రెండు రాకడల మధ్యన కాలవ్యవధి చాలా ఎక్కువగా ఉండడం వలన (ఇప్పటికే 2000 సంవత్సరాలు గడిచాయి), ఈ ప్రవచనాన్ని అర్థం చేసుకోవడంలో కొన్ని అవకతవకలు జరుగుతున్నాయి. ఇందువలన అంత్యకాల సంఘటనల కాలక్రమాన్ని, క్రమబద్ధీకరించు ప్రయత్నాలు సంక్లిష్టమవుతున్నాయి (1పేతురు1:11). ఏదేమైనప్పటికీ, లేఖనాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ, వాటి దృష్టాంతాలను, అక్షరార్థ భావనలను అర్థం చేసుకోవడం ద్వారా, మన ఎస్కటాలజీ అధ్యయనానికి మరింత సహాయం చేకూరుతుంది.

మనం ఇంతకు ముందు చూసిన ప్రవచనాన్ని – దానియేలు ఇంచుమించు **క్రీ.పూ. 539లో** వ్రాస్తున్నాడు. అప్పటికే అతడు 60 సంవత్సరాలకు పైగా చెరలో ఉన్నాడు. గబ్రియేలను దేవదూత అతనికి ప్రత్యక్షమై, ఇశ్రాయేలు కొరకు రాబోవు "**డెబ్బై వారాలు**"**(9:24)** గురించి ఒక ప్రవచనాన్ని ఇస్తాడు. హీబ్రూ మూల భాషలో దీని అర్థం 70x7 అని వస్తుంది. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో మనం – పదులలోను లేదా పదుల గుణకాలలోను వ్యవహరిస్తాము. (ఉదాహరణకు: పది సంవత్సరాల క్రితం, వంద సంవత్సరాల తరువాత అని). కానీ ప్రాచీన కాలంలో, కాలవ్యవధిని వివరించుటకు ఎటువంటి ప్రాథమిక సూచనా లేదు. అప్పుడు వారికి కేవలం ఒక సంఖ్యాపరమైన కొలమానం మాత్రమే ఉంది. దానియేలు కాలంలోని ప్రజలందరూ, ఏడు(7) లేదా సప్తకాల పరంగానే ఆలోచించేవారు.

ఉదాహరణకు, ప్రతి ఏడవ సంవత్సరం, వారికొక **విశ్రాంతి** (సబ్బాతు) **సంవత్సరం (లేవీ 25).** ప్రతి 7x7 లేదా 49 సంవత్సరాలకు, ఒక **సునాద** (జూబ్లీ) **సంవత్సరం (25:8-12).**
ఆ విధంగా, ఇక్కడ దానియేలుకు ప్రత్యక్షపరచబడిన **డెబ్బది వారములు – 70x7 = 490** సంవత్సరాలుగా సూచించబడుతుంది, ఇదే ఇశ్రాయేలు మరియు విశ్వాసులందరికీ ఆ ప్రవచన నెరవేర్పు కొరకు మిగిలి ఉన్న సమయం.

**"నీ జనమునకును పరిశుద్ధ పట్టణమునకును..." (9:24)** అని ఇశ్రాయేలు గురించి, యెరూషలేము పట్టణము గురించి చెప్పబడింది. ఈ వచనంలో ఆరు సంగతులను గురించి ప్రస్తావించబడింది. అందులోని మొదటి మూడు, పాపానికి సంబంధించినవి – **తిరుగుబాటును మాన్పుటకును, పాపమును నివారణ చేయుటకును, దోషము నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయుటకును.** ఈ మొదటి మూడు సంగతులు, క్రీస్తు మొదట రాకడలోనే, తాను చేసిన శిలువ యాగము చేత నెరవేర్చబడ్డాయి. మిగిలిన మూడు సంగతులు నీతికి సంబంధించినవి – **నీతిని బయలు పరచుటకును, దర్శనమును ప్రవచనమును ముద్రించుటకును, అతి పరిశుద్ధ స్థలమును అభిషేకించుటకును**. ఈ మిగిలిన మూడు సంగతులు, క్రీస్తు రెండవ రాకడలో నెరవేర్చబడవలసినవి. **(ద్వితీ 30:1-6; రోమా 11:26).** ఈ సంగతులను గురించి మరింత వివరంగా పరిశీలిద్దాం:

క్రీస్తు తన మొదటి రాకడలో – లోకపాపమంతటి కొరకు చేసిన శిలువయాగము చేత, పొందిన మరణము చేత, తన పునరుత్థానము చేత – లోక పాపాన్ని, దాని వలన వచ్చిన మరణాన్ని గెలిచాడు. తన రెండవ రాకడలో, భూమిపై (ఇశ్రాయేలులో) తన రాజ్యాన్ని స్థాపించి, **అతి పరిశుద్ధ స్థలాన్ని అభిషేకిస్తాడు. (దాని 9:24).** తన వెయ్యేళ్ళ భూ-రాజ్యంలోను, ఆ తరువాత పరలోక నిత్యరాజ్యంలోను, రాజైన క్రీస్తు, నీతియుక్తమైన రాజ్య పరిపాలన చేస్తాడు.

ఈ ప్రవచనం ఎప్పుడు నెరవేరనుందని వాక్యం వివరిస్తుందో ఒకసారి విశ్లేషిద్దాం: 24వ వచనంలో, రాబోవు **డెబ్బది వారములు = డెబ్బది ఏడులు** (ఆనాటి సంఖ్యాపరమైన కొలమానం ప్రకారం) = **70x7** అనగా, రాబోవు **490** సంవత్సరాలలో నెరవేరనుందని, ఒక సూచన ప్రాయంగా చెప్పబడినది. ఆ తరువాత 25వ వచనంలో, చెప్పబడిన ఈ కాలవ్యవధిని దశల వారీగా వివరించుటను మనం గమనిస్తాం: "యెరూషలేమును మరల కట్టించవచ్చునని **ఆజ్ఞ బయలుదేరిన సమయము మొదలుకొని,** అభిషిక్తుడగు అధిపతి వచ్చువరకు **ఏడు వారములు** పట్టునని స్పష్టముగా గ్రహించుము" – అనగా, **ఏడు వారములు = ఏడు ఏడులు = 7x7 =49** సంవత్సరాలు, యెరూషలేము దేవలయమును

తిరిగి నిర్మించుట కొరకు; తరువాత, "**అరువది రెండు వారములు** తొందరగల సమయములందు పట్టణపు రాచవీధులును కందకములును మరల కట్టబడును" – అనగా, **అరువది రెండు వారములు = అరవై రెండు ఏడులు = 62x7 = 434** సంవత్సరాలు యెరూషలేము పట్టణమును తిరిగి నిర్మించుట కొరకు.

అనగా, **ఏడు వారములు + అరువది రెండు వారములు = మొత్తం అరువది తొమ్మిది వారములు = 69x7 = 483** సంవత్సరాలు – మెస్సయ్య రాకడ కొరకు పట్టు సమయం.

దీని అర్థం, క్రీస్తు మొదటి రాకడ, యెరూషలేమును మరల కట్టించవచ్చునని ఆజ్ఞ బయలుదేరిన సమయము మొదలుకొని, **అరువది తొమ్మిది వారములు = 483 సంవత్సరాలు** పడుతుందని – 24,25 వచనాల ప్రకారం అర్థమవుతుంది. ఇక్కడ మీరొకటి గమనిస్తే మొత్తం **డెబ్బది వారములు** అని చెప్పబడిన మొత్తం కాలవ్యవధిలో నుండి, కేవలం అరువది తొమ్మిది వారముల వరకే నెరవేరింది. <u>ఇంకా **ఒక వారము = 7 సంవత్సరాల నెరవేర్పు మిగిలి ఉంది**</u>. దాని గురించిన వివరణ తరువాతి వచనంలో కనబడుతుంది. అయితే ముందుగా, క్రీస్తు మొదటి రాకడను గూర్చిన, 483 సంవత్సరాల ప్రవచనం ఎలా నెరవేరబడిందో చారిత్రానుసారంగా పరిశీలిద్దాం:

**క్రీ.పూ. 605లో,** బబులోను సామ్రాజ్యం యెరూషలేమును జయిస్తుంది. ఆ సంవత్సరం మొదలుకొని, దశల వారీగా బహిష్కరించబడుతూ, ఇశ్రాయేలీయులు బబులోను చెరలోనికి పంపబడతారు. (**యిర్మీయా 25:11; 29:10**). యిర్మీయా ప్రవచనం ప్రకారం, ఇశ్రాయేలీయులు 70 సంవత్సరాల తరువాత యెరూషలేమునకు తిరిగి రావడానికి అనుమతించబడతారు. అయితే దానియేలు, ఆ 70 సంవత్సరాల కాలం, క్రీ.పూ. 605 నుండే లెక్కించబడుతుందేమో అని భావిస్తాడు, కానీ తరువాత మాదీయులు మరియు పారసీకులు – బబులోనును జయించుట వలన, ఇశ్రాయేలీయులు ఇక వారి పాలనలో చెరగా కొనసాగుతారు. తుదకు, మాదీయులు & పారసీకుల పాలనలో, ఇశ్రాయేలీయులు వారి స్వదేశానికి తిరిగి వెళ్ళుటకు అనుమతించబడతారు – తుదకు యిర్మీయా ప్రవచనం నెరవేరబడుతుంది. (**ఎజ్రా 1:1-3; 2 దిన 36:22-23**).

అయితే వారు నాలుగు దశలవారీగా తిరిగి వెళ్ళుటకు అనుమతించబడతారు. మొదటి మూడు దశలలో (**ఎజ్రా 1, 6, 7** ప్రకారం), వారు యెరూషలేము దేవాలయమును తిరిగి నిర్మించుట కొరకు మాత్రమే అనుమతించబడతారు. అటు తరువాత, రాజైన **అర్తహషస్త** (ఎస్తేరు కథలోని రాజు) ఏలుబడిలో, తుదకు నాలుగవ దశలో, యెరూషలేము పట్టణమును తిరిగి నిర్మించుట కొరకు – పట్టణపు రాచవీధులును

కందకములును తిరిగి నిర్మించుట కొరకు – తిరిగి వెళ్ళుటకు అనుమతించబడతారు. అది దాదాపు మార్చి (నీసాన్) మాసం, **క్రీ.పూ. 444** (లేదా) **445**వ సంవత్సరం. (నెహెమ్యా 2:1-6).

ఇప్పుడు, దానియేలు ప్రవచనం మళ్ళీ చూద్దాం. "**అభిషిక్తుడగు అధిపతి** (మెస్సయ్య) **వచ్చువరకు**" **(9:25)** – ఏడు వారములు + అరువది రెండు వారములు = మొత్తం అరువది తొమ్మిది వారములు = **69x7 = 483** సంవత్సరాలు పడుతుందని ప్రవచిస్తాడు. ఇక్కడ మొదట చెప్పబడిన **ఏడు వారములు** = **7x7 =49** సంవత్సరాలు – యెరూషలేము దేవలయమును తిరిగి నిర్మించుట కొరకు పట్టిన కాలం; తరువాత చెప్పబడిన **అరువది రెండు వారములు** = **62x7** = **434** సంవత్సరాలు – **తొందరగల సమయములందు (9:25)** (ఇబ్బందికరమైన పరిస్థితులలో), యెరూషలేము పట్టణమును తిరిగి నిర్మించుట కొరకు మరియు మెస్సయ్య వచ్చు వరకూ పట్టిన కాలం.

**<u>ఈ తేదీ నాటికి, ఇశ్రాయేలు జనాంగానికి సంభవించిన నాలుగు సంగతులు:</u>**

**మొదటిది**, ఇశ్రాయేలీయులు (యూదులలో మిగిలిన వారు) తమ స్వదేశానికి తిరిగి చేర్చబడ్డారు. జనాంగం/ దేశం పునరుద్ధరించబడింది.

**రెండవది**, దేవాలయం పునర్నిర్మించబడింది. (ఇది తరువాత కూడా నాశనం చేయబడి మళ్ళీ పునర్నిర్మించబడుతుంది), అయితే ప్రస్తుతానికి ఆలయం పునర్నిర్మించబడి, యాజకత్వం మరియు బలులు పునః ప్రారంభమయ్యాయి.

**మూడవది**, యెరూషలేము పట్టణం పునర్నిర్మించబడింది. (ఇది **క్రీ.పూ. 605**లో నెబుకద్నెజరు చేత నాశనం చేయబడి, మళ్ళీ ఇప్పుడు అది పునఃస్థాపన చేయబడింది). కావున, ఇశ్రాయేలీయులకు తమ దేశం, దేవాలయం మరియు వారి పట్టణం, మొదలగునవన్నీ వారికి పునరుద్ధరించబడ్డాయి.

**చివరగా**, ఇశ్రాయేలీయులు తమ వాగ్దాన దేశాన్ని తిరిగి పొందుకున్నారు. అంతేకాదు, దేవుని వాక్యమైయున్న పాత నిబంధన గ్రంథాన్ని – పరిపూర్ణముగాను, లిఖితపూర్వకముగాను, వారు కలిగియున్నారు.

ఇప్పుడు కొంత చరిత్రలోనికి వెళితే, (దానియేలు **2** & **7**లో ప్రవచించబడినట్లుగా), గ్రీకు సామ్రాజ్యం – మాదీయులు & పారసీకుల రాజ్యాన్ని జయిస్తుంది. గ్రీకు చక్రవర్తులలో ఒకడైన **ఆంటియోకస్ IV "ఎపిఫనెస్"**, ఇశ్రాయేలు వారిని హింసిస్తూ, వారి దేవాలయాన్ని కూడా అపవిత్రం చేస్తుండేవాడు. "**తొందరగల సమయములు**" అని దానియేలు ప్రవచించినట్లుగానే **(9:25)** అంతా జరుగుతుంది.

**25వ** వచనం ప్రకారం – ఏడు వారములు + అరువది రెండు వారములు, అనగా మొత్తం అరువది తొమ్మిది వారములులో, అనగా 69x7 = 483 సంవత్సరాలకు, **అభిషిక్తుడగు అధిపతి**, అనగా **మెస్సయ్య** వస్తాడని ప్రవచించబడుతుంది. ఆశ్చర్యకరంగా, దాదాపు **క్రీ.శ. 33**లో, ఒక పస్కా పండుగ వారంలో, యేసు ఒక గాడిద పిల్లను ఎక్కి సమీపంలోని బేతనియ నుండి యెరూషలేమునకు వస్తాడు – "...**ఇదిగో నీ రాజు గాడిదపిల్లమీద ఆసీనుడై వచ్చుచున్నాడు**" అని జెకర్యా చేసిన ప్రవచన **(జెకర్యా 9:9)**, నెరవేరుతుంది — రాజైన **అర్తహషస్త**, ఇశ్రాయేలీయులు యెరూషలేమునకు తిరిగి వెళ్ళుటకు అనుమతించిన సంవత్సరం మొదలుకొని, **అప్పటికి సరిగ్గా 483 సంవత్సరాలు**. ఈ సృష్టి నిమిత్తం దేవుడు కలిగియున్న తన మహిమాన్వితమైన ప్రణాళికకు, **దానియేలు 9:25**లోని ప్రవచనం ఇంత ఖచ్చితంగా నెరవేరడం, ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది.

చివరగా, "**అభిషిక్తుడు నిర్మూలము చేయబడును**" **(దాని 9:26)** – క్రీస్తు పొందు మరణము గురించిన ప్రవచనం కూడా నెరవేరబడుతుంది. అయితే ఇక్కడ, అదే వచనంలో, "**వచ్చునట్టి రాజు**" అని చెప్పబడిన మాట – రాబోవు **అబద్ధక్రీస్తు** గురించి చెప్పబడింది. మొత్తం డెబ్బై వారాలు, అనగా 490 సంవత్సరాల ప్రవచనంలో, అరవై తొమ్మిది వారాలు, అనగా 483 సంవత్సరాల ప్రవచనం నెరవేరబడితే, ఇంకా **ఒక వారము**, అనగా **7 సంవత్సరాల నెరవేర్పు మిగిలి ఉంది.** (31వ పేజీలో ముందుగానే చెప్పుకున్నాం).

**ఆ 7 సంవత్సరాలు – అంత్యకాలములో రాబోవునవి. ఈ వచనంలో చెప్పబడుతున్న అబద్ధక్రీస్తు సంగతులు, క్రీస్తు రెండవ రాకడకు మునుపు అంత్యకాలమందు జరగబోవునవి.**

దానియేలు ప్రవచనంలో, దాని నెరవేర్పు కొరకు ఉపయోగించిన సంఖ్యా పరమైన కొలమానం – "**ఏడులు**" గురించి, ఈ క్రింది సారాంశం ద్వారా, మరింత స్పష్టంగా అర్థం చేసుకొనే ప్రయత్నం చేద్దాం:

a) **"డెబ్బది సంవత్సరములు" (9:2)** – ఇది ధర్మశాస్త్రం ప్రకారం, 70వ సబ్బాతు సంవత్సర ఆచారాలను ఉల్లంఘించినందువలన, పర్యవసానంగా ఇశ్రాయేలు బబులోను చెరకు గురవుతుందని, యిర్మియా ప్రవక్త ద్వారా ప్రవచించబడిన సంఖ్యను సూచిస్తుంది. **(లేవీ 25:2-5; 2 దిన 36:21)**;

b) **"డెబ్బది వారములు" (9:24)** – రాబోవు డెబ్బది వారములు = డెబ్బది ఏడులు (ఆనాటి సంఖ్యాపరమైన కొలమానం ప్రకారం) = 70x7 అనగా, రాబోవు 490 సంవత్సరాలలో, ప్రవచనం నెరవేరనుందని చెప్పబడినది. అయితే ఈ

490 సంవత్సరాల కాలం – యెహోషువ నాయకత్వంలో, ఇశ్రాయేలు వారు వాగ్దాన దేశాన్ని జయించినది మొదలుకొని, బబులోను చెరకు గురైన కాలం వరకు, దాదాపు 800 సంవత్సరాల కాలంలో, 70 సార్లు ఇశ్రాయేలు వారు విశ్రాంతి (సబ్బాతు) సంవత్సరాన్ని ఉల్లంఘించినందువలన, ధర్మశాస్త్రం ప్రకారం విధించబడు శిక్షకు సరిగ్గా సరిపోతుంది;

c) **"ఏడు వారములు"** (9:25) – అనగా **7x7 =49** సంవత్సరాలు. నెహెమ్యా కాలంలో, ఇశ్రాయేలు వారు యెరూషలేము పునరుద్ధరణ కొరకు, అప్పటి రాజు ద్వారా పొందిన అనుమతి నుండి, అది పూర్తయ్యే వరకు పట్టిన కాలం;

d) **"అరువది రెండు వారములు"** (9:25, 26) – అనగా, 62x7 = 434 సంవత్సరాలు – **తొందరగల సమయములందు** (ఇబ్బందికరమైన పరిస్థితులలో), యెరూషలేము పట్టణమును తిరిగి నిర్మించుట కొరకు మరియు మెస్సయ్య వచ్చు వరకూ పట్టిన కాలం;

e) **"ఏడు వారములు & అరువది రెండు వారములు"** (9:25) – అనగా, 69x7 = 483 సంవత్సరాలు – ఇది కోరెషు ఆజ్ఞ మొదలుకొని, క్రీస్తు మరణం వరకు మధ్యన కాలం. [మొత్తం 70 వారాలలో, ఇంకా ఒక వారం, అనగా 7 సంవత్సరాల నెరవేర్పు మిగిలి ఉంది.]

f) **"ఒక వారము"** (9:27) – అనగా 7 సంవత్సరాల కాలం – క్రీస్తు రెండవ రాకడకు మునుపు వచ్చు 7 సంవత్సరాల శ్రమల కాలం గురించి ప్రవచించబడింది. దానియేలు, ఆ అబద్ధక్రీస్తును – **"వచ్చునట్టి రాజు"** **(9:26)**, **"ఒక చిన్న కొమ్ము"** **(7:8)**, **"ఒక మానవుడు"** **(7:8)** అని వేరువేరు ప్రవచనాలలో వేరువేరు పేర్లతో వర్ణించాడు. ఆ అబద్ధక్రీస్తు – **"గర్వముగా మాటలాడు నోరు"** (7:20) కలిగి, **"పరిశుద్ధులతో యుద్ధము చేయును"** (7:21), **"ఒక రాజు"** (7:24) గా మారును, **"దేవాది దేవునిమీదను గర్వముగా మాటలాడును"** (11:36). "**అతడు ఒక వారమువరకు అనేకులకు** (ఇశ్రాయేలుతో) **నిబంధనను స్థిరపరచును**" (9:27) (70వ వారమున – అంత్యకాలమందు, రాబోవు శ్రమలకాలములో జరుగు సంగతులు).

g) **“అర్ధవారము” (9:27)** – అనగా, 7/2 = మూడున్నర సంవత్సరములు. అబద్ధక్రీస్తు – ఇశ్రాయేలుతో చేసిన 7 సంవత్సరాల నిబంధనలో, మూడున్నర సంవత్సరాల తరువాత, ఆ నిబంధనను ఉల్లంఘించి, యూదులకు వ్యతిరేకంగా మారి, మరో మూడున్నర సంవత్సరాలు ఆధిపత్యం చెలాయిస్తాడు (హింస పెడతాడు). యేసు ఆ హింసాకాలాన్ని, "మహా శ్రమకాలం" అని వర్ణిస్తాడు. **(మత్తయి 24:21)**. ఇది **42 నెలల పాటు** ఉంటుందని ప్రకటన గ్రంథం **(13:5)** ప్రకటిస్తుంది; మరొక చోట, **“ఒకకాలము కాలములు అర్ధకాలము”** (12:14) అని; మరొక చోట, “**వెయ్యిన్ని రెండువందల అరువది దినములు**” (12:6) అనగా 1,260 రోజులు అని — ఈ వాక్యాలన్నీ దానియేలు ప్రవచించిన **మూడున్నర సంవత్సరముల** శ్రమల కాలాన్నే సూచిస్తున్నాయి.

దానియేలు ప్రవచనం ప్రకారం, ఇంకా నెరవేరాల్సిన వాటి గురించి 7వ అధ్యాయంలో చూద్దాం.

# 4

# అంత్యదినాలకు సూచనలు

**అంత్యకాలం గురించి బైబిల్ ఏం చెబుతుందని** అన్వేషించే వారికి, వచ్చే సర్వసాధారణమైన ప్రశ్న, "**అంతం దగ్గరలోనే ఉందా?**" అని. దేవునిచే ఎన్నుకోబడిన జనాంగమైన ఇశ్రాయేలు వారికి (విశ్వాసము ద్వారా అబ్రాహాము సంతానముగా పిలవబడిన వారికి కూడా – **గలతీ 3:29**), క్రొత్త నిబంధన బయలుపరచబడి, ఇప్పటికి 2500 సంవత్సరాలకు పైగా అయింది. అంతేకాకుండా, దేవుని కుమారుడైన యేసుక్రీస్తు – పాపుల పరిహారార్థమై, తన శిలువయాగము చేత, పాపం మరియు మరణాలపై విజయమొంది, పునరుత్థానుడై, ఆరోహణుడై, ఇప్పటికి దాదాపు 2000 సంవత్సరాలయింది.

తాను తిరిగి వచ్చు వరకూ, మనలో ఉండి, మనల్ని ముందుకు నడిపించుటకు పంపబడిన **పరిశుద్ధాత్మ** – ఈ అధ్యాయంలో ముఖ్యమైన పాత్రను పోషిస్తాడు. అంత్యదినాలను గురించి, వాటి సంకేతాలను గురించి, మనం చేస్తున్న ఈ అధ్యయనానికి, ఆయనే మనకు సహాయం చేస్తాడు. (**ఆమోసు 2:17; యోవేలు 2:28; అపో 2:16-21**).

అయితే, "**అంతం దగ్గరలోనే ఉందా?**" అను మన ప్రశ్నకు, దేవుని వాక్యం – "**నిస్సందేహంగా, అవును!**" అని సమాధానమిస్తుంది. **పేతురు, పౌలు, యాకోబు,** మరియు **హెబ్రీయులకు పత్రిక వ్రాసిన గ్రంథకర్త,** అందరూ "**అంతము సమీపమైయున్నది**" అనే చెబుతున్నారు. (**1 కోరింథీ 10:11; 1 పేతురు 4:7; హెబ్రీ 1:2; యాకోబు 5:3; యూదా 1:18**).

**క్రీ.శ. 95 లేదా 96**లో, అపొస్తలుడైన యోహానుకు, అంత్యదినాలను గురించిన సంగతులను బయలుపరచుటకు, అనుగ్రహించబడిన **ప్రత్యక్షత – ప్రకటన గ్రంథము**. ఆయన వ్రాసిన తొలిమాట – "**సమయము సమీపించినది**" (**ప్రకటన 1:3**). ఈ కారణం చేతనే, అపొస్తలుడైన యోహాను, తాను వ్రాసిన పత్రికలో, ఇది "**కడవరి గడియ**" (**1 యోహాను 2:18**) అని వ్రాస్తాడు. అయితే **ఆ కడవరి గడియకు, మనం ఎంత దూరంలో ఉన్నాము?** దేవునిచే అనుగ్రహించబడిన ప్రత్యక్షత ద్వారా, **అంత్యదినాలకు సూచనలు**గా – భూమిపై జరగబోవు నిర్దిష్టమైన సంగతులను మనం తెలుసుకోవలసి ఉంది.

**సృష్టి ముగింపు దశ ఎలా ఉంటుందని, దేవుని వాక్యం ప్రకటిస్తుంది?**

అంతం సమీపిస్తున్న కొద్దీ, ఈ లోకంలోని విషయాలు, చెడు నుండి మరింత చెడుగా మారుతాయని దేవుని వాక్యం స్పష్టం చేస్తుంది. **(2 తిమోతి 3:13).** అంత్యకాలమునందు, ధనాపేక్ష ప్రబలమవునని యాకోబు ప్రకటిస్తున్నాడు. **(యాకోబు 5:3)** **"అంత్యకాలమునందు తమ భక్తిహీనమైన దురాశలచొప్పున నడుచు పరిహాసకులుందురని" (యూదా 1:18)** యూదా ప్రకటిస్తున్నాడు. **"అంత్యదినములలో, అపహాసకులు అపహసించుచువచ్చి, తమ స్వకీయ దురాశల చొప్పున నడుచుకొనుచు"**; క్రీస్తు రెండవ రాకడను తిరస్కరిస్తూ; జరిగిన నోవహు కాల జలప్రళయాన్ని మరుస్తూ; ఈ సృష్టి అంతమవునన్న సత్యాన్ని విస్మరిస్తూ, బైబిల్ వృత్తాంతాన్ని అపహాస్యం చేస్తారని, పేతురు ప్రకటిస్తున్నాడు **(2 పేతురు 3:3-7)**. వారందరితో ఏకీభవిస్తూ, పౌలు ఇలా వ్రాస్తాడు:

> **"అంత్యదినములలో అపాయకరమైన కాలములు వచ్చునని తెలిసికొనుము; ఏలాగనగా మనుష్యులు స్వార్థ ప్రియులు ధనాపేక్షులు బింకములాడువారు అహంకారులు దూషకులు తల్లిదండ్రులకు అవిధేయులు కృతజ్ఞత లేనివారు అపవిత్రులు, అనురాగరహితులు అతిద్వేషులు అపవాదకులు అజితేంద్రియులు క్రూరులు సజ్జనద్వేషులు, ద్రోహులు మూర్ఖులు గర్వాంధులు దేవునికంటె సుఖాను భవము నెక్కువగా ప్రేమించువారు, పైకి భక్తిగలవారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించనివారునై యుందురు." (2 తిమోతి 3:1-5).**

పౌలు కొనసాగిస్తూ – అప్పుడు ప్రజలు, **"పాపభరితులై నానావిధములైన దురాశలవలన నడిపింపబడి, యెల్లప్పుడును నేర్చుకొనుచున్నను, సత్యవిషయమైన అనుభవజ్ఞానము ఎప్పుడును పొందలేని"** (6-7) వారవుతారని; **"చెడిన మనస్సు కలిగి విశ్వాస విషయములో భ్రష్టులై సత్యమును ఎదిరింతురు"** (8) అని; మరొక పత్రికలో, **"వారి అవివేక హృదయము అంధకారమయమాయెను; తాము జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులైరి"** అని; **అన్ని రకాల లైంగిక అనైతికతకు దిగజారుతారని**, పౌలు వ్రాస్తాడు.**(రోమా 1:21-27)**. ఇంకా కొనసాగిస్తూ:

> **"మరియు వారు తమ మనస్సులో దేవునికి చోటియ్య నొల్లకపోయిరి గనుక చేయరాని కార్యములు చేయుటకు దేవుడు భ్రష్ట మనస్సుకు వారినప్పగించెను. అట్టివారు సమస్తమైన దుర్నీతిచేతను, దుష్టత్వముచేతను, లోభముచేతను,**

> **ఈర్ష్యచేతను నిండుకొని, మత్సరము నరహత్య కలహము కపటము వైర మనువాటితో నిండినవారై కొండెగాండ్రును అపవాదకులును, దేవద్వేషులును, హింసకులును, అహంకారులును, బింకములాడువారును, చెడ్డవాటిని కల్పించువారును, తలిదండ్రులకవిధేయులును, అవివేకులును మాట తప్పువారును అనురాగ రహితులును, నిర్దయులునైరి. ఇట్టి కార్యములను అభ్యసించువారు మరణమునకు తగినవారు అను దేవుని న్యాయ విధిని వారు బాగుగ ఎరిగియుండియు, వాటిని చేయు చున్నారు. ఇది మాత్రమే గాక వాటిని అభ్యసించు వారితో సంతోషముగా సమ్మతించుచున్నారు." (రోమా 1:28-32).**

సమాజంలోని ఈ క్షీణత, కేవలం అవిశ్వాసులలో మాత్రమే కాదని, విశ్వాసులలో కూడా కనబడుతుందని బైబిల్ స్పష్టం చేస్తుంది — **"పైకి భక్తిగలవారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించనివారునై యుందురు" (2 తిమోతి 3:5)** — ఇది మరింత భ్రష్టత్వానికి దారి తీస్తుందని, అబద్ధ బోధకులకు దూరంగా ఉండమని, దేవుని వాక్యాన్ని అలక్ష్యము చేయుట వలన కలుగు వినాశనం భయంకరమైనదని, బైబిల్ పదే పదే హెచ్చరిస్తోంది. **(అపో 20:28-31; గలతీ 1:6-10; ఎఫెసీ 5:11; 1 తిమో 6:20; 2 తిమో 4:1-4; తీతు 1:9; 2 పేతురు 2:1-22; 2 యోహాను 7-11; యూదా 3-23).**

**1 తిమోతి 4:1-2**లో, పౌలు – **"అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు ఆత్మలయందును దయ్యముల బోధయందును లక్ష్యముంచి...." – దయ్యముల బోధనలు ఏమిటి?** – దేవుని ఉద్దేశ్యాన్ని వ్యతిరేకించు ఎలాంటి ఆలోచనైననూ, అది **దయ్యముల బోధన అనబడును.** (2 కోరింథీ 10:5; యాకోబు 3:14-15).

**"యెల్లప్పుడును నేర్చుకొనుచున్నను, సత్యవిషయమైన అనుభవజ్ఞానము పొందలేని..." (2 తిమోతి 3:6-7)** వారిలోనూ, **"చెడిన మనస్సు కలిగి విశ్వాస విషయములో భ్రష్టులై సత్యమును ఎదిరింతురు" (8)** – అనబడు వీరిలోనూ, కనబడు ఒక సాధారణమైన లక్షణం – **సత్యాన్ని తిరస్కరించుట.** పౌలు – రోమీయులను హెచ్చరిస్తూ – **"దుర్నీతిచేత సత్యమును అడ్డగించు మనుష్యులయొక్క సమస్త భక్తిహీనతమీదను, దర్నీతిమీదను దేవుని కోపము పరలోకమునుండి బయలుపరచబడుచున్నది." (రోమా 1:18). సత్యాన్ని తిరస్కరించుట**, శ్రమలకు దారి తీయును అని ప్రవక్తయైన యెషయా హెచ్చరిస్తూ – **"కీడు మేలనియు మేలు కీడనియు చెప్పుకొని చీకటి వెలుగనియు వెలుగు**

**చీకటనియు ఎంచుకొను వారికి శ్రమ. చేదు తీపి అనియు తీపి చేదనియు ఎంచుకొనువారికి శ్రమ." (యెషయా 5:20).**

సత్యాన్ని తిరస్కరించువారు, దేవుని విరోధులు అని దేవుని వాక్యం సెలవిస్తుంది. వివరణ – యేసును వెంబడించు వారు, దేవుని వాక్య సత్యము చేత పరిశుద్ధపరచ బడతారు **(యోహాను 8:31-32; 17:17)** అనగా, ఆయనను తిరస్కరించు వారు, సత్యాన్ని కూడా తిరస్కరించువారవుతారు – అట్టి వారు శిక్షార్హులవుతారు.

**2 థెస్స 2:10-12**లో, పౌలు – **"నశించుచున్నవారు తాము రక్షింపబడుటకై సత్యవిషయమైన ప్రేమను అవలంబింపక పోయిరి, ఇందుచేత సత్యమును నమ్మక దుర్నీతియందు అభిలాషగల వారందరును శిక్షావిధి పొందుటకై, అబద్ధమును నమ్మునట్లు మోసముచేయు శక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు."** – అనగా, సత్యాన్ని తిరస్కరించువారు, తీర్పుదినమందు తీర్పు తీర్చబడతారు అని వాక్యం బోధిస్తుంది. **(యోహాను 3:18; 36; హెబ్రీ 10:31; ప్రకటన 21:6-8).**

**కావున మనం అంతం దగ్గరలోనే ఉన్నామా?**

ఈ క్రింది వాటిని పరిగణించండి:

లోకంలో – **ధనాపేక్ష ప్రబలమవుతుందా?**

అపహాసకులు – **క్రీస్తు రెండవ రాకడను తిరస్కరిస్తూ; జరిగిన నోవహు కాల జలప్రళయాన్ని మరుస్తూ; ఈ సృష్టి అంతమవునన్న సత్యాన్ని విస్మరిస్తూ, బైబిల్ వృత్తాంతాన్ని – అపహాస్యం చేస్తున్నారా?**

లోకంలో – **లైంగిక అనైతికత** మరియు **ఇతరేతర దౌష్ట్యము – ప్రబలమవుతున్నాయా?**

లోకంలో – **కీడు మేలనియు మేలు కీడనియు, చీకటి వెలుగనియు వెలుగు చీకటనియు – అనుసరించు వారి చీకటి కమ్ముకుందా?**

లోకంలో – **పైకి భక్తిగలవారిలా కనబడు వేషధారులు, దయ్యముల బోధనలు చేయు అబద్ధ బోధకలు – ప్రబలమవుతున్నారా?**

**ఇవన్నీ అంతం యొక్క ప్రారంభానికి సూచనలు!**

# 5

# పునరుత్థాన దినము

అంత్యదినాలలో సంభవింపబోవు **6** సంఘటనల క్రమంలో మొదటిది – **పునరుత్థాన దినము – విశ్వాసులు ఎత్తబడు దినము.** ఆ దినమందు, విశ్వాసులందరూ – **క్రీస్తునందుండు సజీవులును** మరియు మృతులైన వారును – **"ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘముల మీద కొనిపోబడి, సదాకాలము ప్రభువుతో కూడ ఉందురు."** (1 **థెస్సలొనీకయులకు** 4:16-17).

**1 థెస్సలొనీకయులకు 4:13-18** – ఈ సంఘటనను వివరిస్తుంది:

**[13] సహోదరులారా, నిరీక్షణలేని యితరులవలె మీరు దుఃఖపడకుండు నిమిత్తము,**
**నిద్రించుచున్నవారిని గూర్చి మీకు తెలియకుండుట మాకిష్టములేదు. [14] యేసు మృతి**
**పొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించిన**
**వారిని దేవుడాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. [15] మేము ప్రభువుమాటను బట్టి**
**మీతో చెప్పునదేమనగా, ప్రభువు రాకడవరకు సజీవులమై నిలిచియుండు మనము**
**నిద్రించినవారికంటె ముందుగా ఆయన సన్నిధి చేరము. [16] ఆర్భాటముతోను, ప్రధాన**
**దూతశబ్దముతోను, దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తు**
**నందుండి మృతులైన వారు మొదట లేతురు. [17] ఆ మీదట సజీవులమై నిలిచియుండు**
**మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు**
**మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ**
**ఉందుము. [18] కాబట్టి మీరు ఈ మాటలచేత ఒకనినొకడు ఆదరించుకొనుడి.**

**పునరుత్థాన దినమునకు సంబంధించి, 6 అంశాలను మనం అర్థం చేసుకోవాలి:**

**మొదటిది**, పునరుత్థాన దినము – **ఆసన్నమైనది.** ఇది ఎప్పుడు సంభవించున్న ప్రశ్నకు బైబిల్ లో మనకు ఎలాంటి సమాధానం లేదు. అనగా, ఇది ఎలాంటి సంకేతాలు కనుపరచక, ఎప్పుడైననూ సంభవింపబోవు సంఘటన.

**రెండవది**, పునరుత్థాన దినము – **అనివార్యమైనది**. బైబిల్ నందు అనేక సందర్భాలలో ఆ దినము అనివార్యమైనదని ప్రకటించబడుతున్నప్పటికీ – కొంతమంది విశ్వాసులమని చెప్పుకొనుచు, పునరుత్థాన దినాన్ని విశ్వసించుట లేదు. అందువలన పౌలు, **14**వ వచనంలో – "**యేసు మృతి పొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల, అదే ప్రకారము...**" – **సజీవులును మరియు క్రీస్తునందుండి మృతులైన వారును, పునరుత్థాన దినమందు ఎత్తబడతారని** ప్రకటిస్తాడు.

**మూడవది**, పునరుత్థాన దినము – **ఆకాశమండలమునందు సంభవించును.** 16-17 వచనాలు – "**...క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము...**" ఇది క్రీస్తు ఆరోహణ సమయంలో, ఇద్దరు దేవదూతలు – అపొస్తలులు ఆకాశమువైపు తేరి చూస్తున్నప్పుడు, వారికి చెప్పిన (పునరుత్థాన దినమందు నెరవేరబడు) ప్రవచనం:

"**...వారు చూచుచుండగా ఆయన ఆరోహణమాయెను, అప్పుడు వారి కన్నులకు కనబడకుండ ఒక మేఘము ఆయనను కొనిపోయెను. ఆయన వెళ్లుచుండగా, వారు ఆకాశమువైపు తేరి చూచు చుండిరి. ఇదిగో తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు వారియొద్ద నిలిచి – గలిలయ మనుష్యులారా, మీరెందుకు నిలిచి ఆకాశమువైపు చూచు చున్నారు? మీయొద్దనుండి పరలోకమునకు చేర్చుకొన బడిన యీ యేసే, ఏ రీతిగా పరలోకమునకు వెళ్లుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి.**" (**అపొ 1:9-11**).

నాలుగవది, **ఈ పునరుత్థాన దినము, క్రీస్తు రెండవ రాకడకు భిన్నమైనది.** ఈ పునరుత్థాన దినమందు, క్రీస్తు నందు విశ్వసించిన వారందరూ – ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములమీద కొనిపోబడునిమిత్తం, ఎత్తబడతారు. తరువాత సంభవించబోవు క్రీస్తు రెండవ రాకడలో, ఆయన ఆకాశ మండలములో నిలిచియుండుటకు రాడు కానీ, **జెకర్యా 14:4**లో జెకర్యా ప్రవచించినట్లు – ఆయన భూమి మీదకు దిగి వస్తాడు – "**ఆ దినమున యెరూషలేము ఎదుట తూర్పు తట్టుననున్న ఒలీవ కొండమీద ఆయన పాదములుంచగా ఒలీవకొండ తూర్పు తట్టునకును పడమటి తట్టువకును నడిమికి విడిపోయి సగము కొండ ఉత్తరపుతట్టునకును**

**సగముకొండ దక్షిణపుతట్టు నకును జరుగును గనుక విశాలమైన లోయ యొకటి యేర్పడును.**" అయితే, ఆ దినమును చూచుటకు, మనం వేచియుండవలసి ఉంది.

ఐదవది, పునరుత్థాన దినమందు కేవలం – **క్రీస్తునందుండు విశ్వాసులు మాత్రమే ఎత్తబడుదురు** – వారు ఆ దినమందు, **దేవుని న్యాయ పీఠము ఎదుట నిలి** , వారి **క్రియల చొప్పున జీతము పుచ్చుకొని**, వారు **పునరుత్థానము పొందుదురు.**

ఈ సంగతులను ఇంకొంచెం వివరంగా చూద్దాం:

**దేవుని న్యాయ పీఠము** — పునరుత్థాన దినమందు, **విశ్వాసులు – ఆకాశమండలమున ప్రభువును ఎదుర్కొనబోయి, దేవుని న్యాయ పీఠము ఎదుట నిలుతురు – ప్రతివాడును తన్నుగురించి దేవునికి లెక్క యొప్పగించును. (రోమా 14:10, 12; 2 కొరింథీ 5:10)**. దీని గురించి పౌలు **రోమా 14:10**లో ఇలా వ్రాస్తాడు – **"మనమందరము దేవుని న్యాయ పీఠము ఎదుట నిలుతుము"** & **"మనలో ప్రతివాడును తన్నుగురించి దేవునికి లెక్క యొప్పగింపవలెను"** (12). అయితే, పునరుత్థాన దినము – విశ్వాసులను క్రీస్తుతో ఏకము చేయునదని మనం గుర్తుంచుకోవాలి. (**యోహాను 14:3; 1 కొరింథీ 15:50-58; కొలొస్స 3:4; 1 థెస్స 4:13-18; ప్రకటన 3:10**) అయితే ఇక్కడ, **దేవుని న్యాయ పీఠమునందు, విశ్వాసులకు ఎటువంటి శిక్ష వేయబడదని గమనించాలి.** పాపుల కొరకు, **క్రీస్తు చేసిన శిలువ యాగము చేత, విశ్వాసులకు ఎటువంటి శిక్ష విధించబడదు (రోమా 8:1).** విమోచించబడిన వారి పాపములు క్షమించబడ్డాయి (రక్షణకు ముందువి & తరువాతవి కూడా), అయితే వారి రక్షణ నిమిత్తం వారు సంతోషించెదరు కానీ, **రక్షణ పొందియుండియు వారు చేసిన తప్పిదములను బట్టి వారు ప్రభువు సముఖమందు సిగ్గుపడుదురు.** దీని గురించి జాగ్రత్తపడవలెనని – **1 యోహాను 2:28** లో యోహాను ఇలా వ్రాస్తాడు, "**కాబట్టి చిన్న పిల్లలారా, ఆయన ప్రత్యక్షమగునప్పుడు ఆయన రాకడయందు మనము ఆయన యెదుట సిగ్గుపడక ధైర్యము కలిగియుండునట్లు మీరాయన యందు నిలిచియుండుడి.**"

**పుచ్చుకొను జీతము** — పునరుత్థాన దినమందు, విశ్వాసులు తమ తమ క్రియల చొప్పున జీతము పుచ్చుకొందురు. **1 కొరింథీయులకు 3:13-14** లో పౌలు – "**వాని వాని పని కనబడును, ఆ దినము దానిని తేటపరచును, అది అగ్నిచేత బయలు పరచబడును. మరియు వాని వాని పని యెట్టిదో దానిని అగ్నియే పరీక్షించును. పునాదిమీద ఒకడు కట్టిన పని నిలిచినయెడల వాడు జీతము పుచ్చుకొనును.**"

విశ్వాసులు తమ క్రియల వలన కాదు గాని, క్రీస్తు పాపుల కొరకు చేసిన దాని వలన వారు రక్షణ పొందుదురు. గనుక ఇక్కడ చెప్పబడిన జీతము – విశ్వాసము చేత రక్షణ పొంది, తాను తిరిగి వచ్చు వరకు, నమ్మకముగా పని చేయు వారి కొరకు చేయబడిన వాగ్దానం. (**మత్తయి 5:12; 25:14-30; లూకా 14:14; 19:11-27; కొలొస్స 3:24; 2 యోహాను 1:8**).

**పునరుత్థానము** –పునరుత్థాన దినమందు, క్రీస్తునందుండు సజీవులును మరియు మృతులైన వారును ఎత్తబడి, అక్షయమైన దేహములతో మహిమగల శరీరులుగా **రూపాంతరం చెందుదురు**. ఒక అధ్భుతమైన వాక్యభాగంలో, దీని గురించి పౌలు స్పష్టంగా వివరిస్తాడు:

**51 ఇదిగో మీకు ఒక మర్మము తెలుపుచున్నాను; మన మందరము నిద్రించము గాని నిమిషములో, ఒక రెప్ప పాటున, కడబూర మ్రోగగానే మనమందరము మార్పు పొందుదుము. 52 బూర మ్రోగును; అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు, మనము మార్పు పొందుదుము.** (**1 కొరింథీ 15:51-52**).

ఈ వాక్యభాగంలో పౌలు పునరుత్థానదినం గురించి వివరిస్తూ, "**ఒక మర్మము తెలుపుచున్నాను**" అని చెబుతాడు. అనగా, పాత నిబంధనలో వెల్లడించబడని ఒక క్రొత్త విషయాన్ని చెబుతున్నాడని అర్థం. అయితే పాత నిబంధనలో కూడా పునరుత్థానము గురించి బయలుపరచబడింది. **(**కీర్తన **16;** యెషయా **26:19-20;** దాని **12:2;** హెబ్రీ **11:19)** కానీ, **మొదట మరణించనవసరం లేకుండగనే** కొందరు అక్షయమైన దేహములతో మహిమగల శరీరులుగా రూపాంతరం చెందుదురని, పాత నిబంధనలో ఎప్పుడూ బోధించబడలేదు.

విశ్వాసి "పునరుత్థాన దేహాన్ని" పొందుతాడని చెప్పడంలో అర్థం ఏమిటి? ఒకరు మరణించినప్పుడు, అతని లేదా ఆమె ఆత్మ వెంటనే తన భౌతిక దేహాన్ని విడిచిపెట్టి, అది నియమించబడిన ప్రదేశానికి వెళుతుందని బైబిల్ ప్రకటిస్తుంది – అయితే ప్రభువుతో కూడా ఉండునట్లు **పరదైసునకును** (**లూకా 23:43; 2 కోరింథీ 5:8; ఫిలిప్పీ 1:23**), లేదా తీర్పుదినం వరకు వేచియుండునట్లు **పాతాళానికిని** చేరుతుంది (**లూకా 16:22-23**). అంతే కానీ, "**ఉత్తరించు స్థలం**" (Purgatory) వంటివి ఏమీ లేవని గమనించాలి.

విమోచించబడిన మరియు విమోచించబడని ప్రతి ఒక్కరూ అంతిమంగా పునరుత్థానమొందుదురని బైబిల్ బోధిస్తుంది. **విమోచించబడిన వారు జీవ పునరుత్థానమును, విమోచించబడని వారు తీర్పు పునరుత్థానమును పొందుదురని భావం.** (**యోహాను 5:28-29**; **ప్రకటన 20:5-6**). పునరుత్థాన దినమందు, క్రీస్తునందుండు

సజీవులు ఆ సమయమందే మహిమగల శరీరులుగా రూపాంతరం చెందుదురు (**ఫిలి 3:21**). క్షయమైన వారి దేహాలు, వారు ఇంకనూ సజీవులైయుండగనే – మహిమాన్వితమైన, అక్షయమైన దేహాలుగా మారిపోతాయి. ఆ దేహాలు పాపరహితమై, ఎన్నటికీ మరణాన్ని లేదా క్షీణతను రుచి చూడవు.

విశ్వాసులు ఎలా పునరుత్థానము పొందుదురో తెలుసుకున్న మనం, ఇప్పుడు పునరుత్థాన దినమందు ఎవరు ముందు లేపబడుదురు, ఎవరు తరువాత అనే వరుస క్రమాన్ని తెలుసుకుందాం – విశ్వాసులందరూ ఒక్కసారే లేపబడరని, ఒక కాలక్రమానుసారంగా అందరూ లేపబడతారని పౌలు స్పష్టం చేస్తున్నాడు (**1 కొరింథీ 15:23**). కావున, పునరుత్థానం యొక్క క్రమం ఈ క్రింది విధంగా ఉంటుంది: 1) ప్రథమ ఫలమైన క్రీస్తు మొదటి పునరుత్థానమును పొందగా (**1 కొరింథీ 15:23**); తరువాత 2) పాతనిబంధన పరిశుద్ధులు పునరుత్థానమును పొందగా (**మత్తయి 27:52-53**); 3) క్రీస్తునందుండి మృతులైన విశ్వాసులు (**1 థెస్స 4:16**); 4) శ్రమల కాలంలో చంపబడిన ఇద్దరు సాక్షులు (**ప్రకటన 11:11-12**); 5) మిగిలినయున్న పాత నిబంధన పరిశుద్ధులు మరియు శ్రమల కాల హతసాక్షులు (**యెషయా 26:19; దాని 12:2; ప్రకటన 6:9-11; 20:4**); 6) క్రీస్తు వెయ్యేళ్ళ రాజ్య యాజకులు (**యోహాను 5:28-29; ప్రకటన 20:6**); ధవళమైన మహా సింహాసనము వద్ద తీర్పు పొందు అవిశ్వాసులు (**ప్రకటన 20:5, 11-15**). ఈ వరుస క్రమంలో అందరూ పునరుత్థానమును పొందుతారు.

మన పునరుత్థాన శరీరాలు యేసు పునరుత్థాన శరీరాన్ని పోలియుండును (**ఫిలిప్పీ 3:21**). అనంతుడైన యేసు, మరియ గర్భమున జన్మించుటకు ముందు ఎలాంటి భౌతికమైన శరీరాన్ని కలిగి లేనప్పటికీ, మానవుడిగా జీవించి, మరణించి, పునరుత్థానుడై పొందిన అక్షయమైన మహిమగల శరీరాన్ని, ఇక నిత్యకాలమంతా కలిగి ఉంటాడనే సత్యం ఒక అద్భుతమైన విషయం; అలానే, ఆయన సమస్త దైవ లక్షణాలను కలిగి సర్వాంతర్యామై ఉంటాడు.

చివరగా, పునరుత్థాన దినము గురించిన ఆరవ అంశం – **పునరుత్థాన దినము తరువాత – లోకంలోని చెడులన్నిటిపై యున్న పరిశుద్ధాత్మ అడ్డగింపు తొలగిపోతుంది.** అప్పుడు ఈ ప్రపంచం – సమస్త కల్మషము చేత, దుష్టత్వము చేత, చెడునుండి మరింత చెడుకి దిగజారి పోతుంది — (**మత్తయి 24:21**). ప్రస్తుతానికి, పరిశుద్ధాత్మ యొక్క నిరంతరమైన ప్రభావం వలన, లోకమందు జ్యోతులవలెనున్న విశ్వాసులు, వారి ప్రార్థనల వలన – మనుషులపై, వారి మనసులపై, ప్రభుత్వాలపై పడు పరిశుద్ధాత్మ ప్రభావం వలన,

ఈ ప్రపంచంలోని చెడు ఒక స్థాయి వరకూ ఇంకా నియంత్రణలోనే ఉంది (**ఫిలిప్పీ 2:15**). భవిష్యత్తులో, లోకంలోని చెడులపై ఉన్న పరిశుద్ధాత్మ అడ్డగింపు తొలగించబడును. అది పునరుత్థాన దినమందు జరుగును. దీని గురించి **2 థెస్సలొనీకయులకు** 2:7లో **ఇలా చెప్పబడింది – "ధర్మవిరోధ సంబంధమైన మర్మము ఇప్పటికే క్రియచేయుచున్నది గాని, యిదివరకు అడ్డగించుచున్న వాడు మధ్యనుండి తీసి వేయబడు వరకే అడ్డగించును."** పరిశుద్ధుల పునరుత్థానము తరువాత, భూమిమీద చెడు ఎందుకు ప్రబలమవుతుందో అర్థం చేసుకోవడానికి, ఒకసారి పరిశుద్ధాత్మ నివాస స్థలాన్ని గుర్తు చేసుకోండి – **విశ్వాసుల హృదయాలు** (**యోహాను 14:17; రోమా 8:9-11; ఎఫెసీ 1:13**). విశ్వాసులైన పరిశుద్ధులు పునరుత్థానము పొంది, భూమిమీద నుండి నిష్క్రమిస్తుంటే, పరిశుద్ధాత్మ కూడా వారితోనే నిష్క్రమిస్తాడు. ఆ కారణం చేత, భూమిమీద చెడు అంతకంతకూ ప్రబలమవుతుంది.

పరిశుద్ధాత్మ నిష్క్రమణతో – అంత్యదినాలలో సంభవింపబోవు తదుపరి సంఘటన ప్రారంభమవుతుంది: **శ్రమలు – మహా శ్రమలు**!

# 6

# శ్రమలు – మహా శ్రమలు

పునరుత్థాన దినమున సంఘం ఎత్తబడిన తరువాత, భూమిపై **7 సంవత్సరాల శ్రమల కాలం** సంభవిస్తుందని దేవుని వాక్యం ప్రకటిస్తుంది. ఇది భూమిపైకి దేవుడు తీసుకురాబోయే ఒక భయానకమైన **శిక్షాకాలం.** ఆ కాలం గురించి యేసు ఇలా బోధిస్తాడు – "**అవి శ్రమగల దినములు; దేవుడు సృజించిన సృష్ట్యాదినుండి ఇదివరకు అంత శ్రమ కలుగలేదు, ఇక ఎన్నడును కలుగబోదు**" (మార్కు 13:19). "**లోకారంభము నుండి ఇప్పటివరకును అట్టి శ్రమ కలుగలేదు, ఇక ఎప్పుడును కలుగబోదు.**" (మత్తయి 24:21), అలానే ప్రకటన గ్రంథంలో కూడా చూస్తాము – **ప్రకటన** 7:14.

**శ్రమల కాలం – 7 సంవత్సరాల పాటు ఉండునని మనం ఎలా తెలుసుకుంటాము? దానియేలు 9:24-27** గురించి గత అధ్యాయం (దానియేలుకు కలిగిన దర్శనము) లో చేసిన మన అధ్యయనంలోని, **మొత్తం 70 వారాల ప్రవచనంలో - క్రీస్తు మొదటి రాకడతో** 69 **వారాల ప్రవచన నెరవేర్పు**ను మనం చూశాం, మిగిలి ఉన్న **ఆ ఒక్క వారం, అనగా 7 సంవత్సరాల కాలం – అంత్యకాలమందు సంభవించబోవు శ్రమల కాలమందు నెరవేరబడును.**

పాత మరియు క్రొత్త నిబంధనలలో, ఈ 7 సంవత్సరాల శ్రమల కాలం గురించి చాలా వ్రాయబడింది. అయితే ఈ క్రింద ఇవ్వబడిన 8 మూలసూత్రాల ద్వారా, దీనిని సుళువుగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం:

1) **ఉద్దేశ్యం;**
2) **ప్రారంభం;**
3) **అబద్ధ క్రీస్తు;**
4) **శ్రమల పురోగతి;**
5) **పరివర్తన దశ;**
6) **రక్షణ;**
7) **ఆపదలు;**
8) **వాగ్దానం.**

**మొదటిది** – శ్రమల కాలం యొక్క **ఉద్దేశ్యం** – అంత్య కాలమున, ఈ 7 సంవత్సరాల శిక్షా కాలాన్ని, దేవుడు ఎందుకు నిర్ణయించాడు? – ముఖ్యంగా 3 ఉద్దేశాలను కలిగియున్నాడు – మొదటి **ఉద్దేశ్యం** – దేవుడు ఇశ్రాయేలీయుల కొరకు ఇదొక శిక్షా కాలంగా ఉద్దేశించినట్లు, యిర్మీయా ప్రవక్త ప్రకటిస్తాడు **(యిర్మీయా 30:7). ఇది శిక్షాకాలమే కాని తీర్పు కాలం కాదు.** అసలు వారు ఎందుకు శిక్షించబడతారు? దేవుని పట్ల వారి యుగాలనాటి అవిధేయతకు కారణంగాను, ముఖ్యంగా యేసును మెస్సయ్యగా తిరస్కరించిన కారణంగాను వారు శిక్షించబడతారు **(లేవీ 26:40-45). యెహెజ్కేలు 20:33-38**లో – శ్రమల కాలంలో ఇశ్రాయేలునకు దేవుని యొద్దనుండి రాబోవు శిక్ష వివరించబడింది:

"**నా జీవముతోడు నా రౌద్రము కుమ్మరించుచు, బాహుబలముతోను చాచిన చేతితోను నేను మీపైన అధికారము చేసెదను. మరియు నేను రౌద్రము కుమ్మరించుచు, బాహుబలముతోను చాచిన చేతితోను మిమ్మును చెదరగొట్టిన ఆయా దేశములలో నుండియు జనులలోనుండియు నేను మిమ్మును సమకూర్చి జనములున్న అరణ్యములోనికి మిమ్మును రప్పించి, అక్కడ ముఖాముఖిగా మీతో వ్యాజ్యెమాడెదను**;" ఇదే యెహోవా వాక్కు.

"**ఐగుప్తీయులదేశపు అరణ్యములో నేను మీ పితరులతో వ్యాజ్యెమాడినట్టు మీతోను వ్యాజ్యె మాడెదను;**" ఇదే ప్రభువైన యెహోవా వాక్కు – "**చేతి కఱ్ఱక్రింద మిమ్మును దాటించి నిబంధనకు లోపరచెదను. మరియు నామీద తిరుగబడువారిని దోషము చేయువారిని మీలో ఉండకుండ ప్రత్యేకించెదను, తాము కాపురమున్న దేశములో నుండి వారిని రప్పించెదను గాని నేను యెహోవానని మీరు తెలిసికొనునట్లు వారు ఇశ్రాయేలు దేశములో ప్రవేశించరు.**"

శ్రమల కాలం యొక్క రెండవ ముఖ్యమైన **ఉద్దేశ్యం** – ప్రపంచదేశాలలో, దేవునికి వ్యతిరేకంగా ఉన్న వారినందరినీ (అన్యజనులను) శిక్షించు నిమిత్తం (**ప్రకటన 3:10**). **యెషయా 13:11** – అంత్య కాలమున, దేవుడు ప్రపంచదేశాలపై విధించు శిక్షను గురించి చేయబడిన ప్రకటన: "**లోకుల చెడుతనమునుబట్టియు దుష్టుల దోషమునుబట్టియు నేను వారిని శిక్షింపబోవు చున్నాను అహంకారుల అతిశయమును మాన్పించెదను బలాత్కారుల గర్వమును అణచివేసెదను.**" ఇది శ్రమల కాల సమయమందే నెరవేరబడును.

అవిశ్వాసులైన ఇశ్రాయేలీయులకు మరియు పాపపూరితమైన అన్యజనులకు శిక్షను విధిస్తూనే, వారు మారుమనస్సు పొందునట్లు, దేవుడు చివరి వరకూ తన గొప్ప కృపను బయలుపరుస్తాడు. అదే ఈ శ్రమల కాలం యొక్క మూడవ **ఉద్దేశ్యం** – పాపులందరికీ – ఇశ్రాయేలునకు మరియు అన్యజనులైన వారందరికీ, వారు పశ్చాత్తాపపడి మారుమనస్సు పొందునట్లు వారికొక అవకాశం ఇవ్వబడుతుంది – ఆ పిలుపునకు ఫలితాలను, ప్రకటన 7వ అధ్యాయంలో స్పష్టంగా చూడవచ్చు – ప్రతి గోత్రము నుండి 12,000 మంది చొప్పున, మొత్తం 144,000 మంది ఇశ్రాయేలీయులు రక్షించబడుదురు – అంతిమంగా వీరు సువార్తకు సాక్షులుగా నిలుచుదురు, వీంలో చాలా మంది హతసాక్షులవుదురు. అటు తరువాత చూడగా, 9వ వచనంలో – "**ప్రతి జనములోనుండియు ప్రతి వంశములోనుండియు ప్రజలలోనుండియు, ఆయా భాషలు మాటలాడువారిలో నుండియు వచ్చి, యెవడును లెక్కింపజాలని యొక గొప్ప సమూహము**" – అనగా, అన్యజనులైన వారునూ రక్షించబడుదురు.

**రెండవది** – శ్రమల కాలం యొక్క **ప్రారంభం** – శ్రమల కాలం ఎలా ప్రారంభించబడుతుందన్న ప్రశ్నకు సమాధానం – **ప్రకటన 5:1-14**లో కనబడుతుంది – ఈ వాక్యభాగమందు, దేవుడు తన సింహాసనంపై కూర్చొని, తన చేతిలో పట్టుకొనియున్న గ్రంథం – భూమిపై తన రాజ్యాన్ని సంపూర్ణం చేయు, దేవుని చిత్తాన్ని సూచిస్తుంది. ముందుగా పరిచయంలో చెప్పుకున్నట్లుగా, దేవుడు తన సార్వభౌమాధికారం చేత, సమస్త సృష్టిని సర్వకాలములలో పరిపాలిస్తాడు. అయితే, దేవుడు తన అంతిమ ప్రణాళిక నెరవేర్పు నిమిత్తం, శ్రమల కాలమందు – భూమిపై కొంతకాలం పాటు, ఒక చిన్న తిరుగుబాటుకు అనుమతిస్తాడు. ఈ తిరుగుబాటును నడిపించేది సాతాను, అది పరిమితమైన అధికారాన్ని పొంది, దేవుని యేర్పాటు కొరకు నిర్దేశించబడిన కాలం ముగిసేంతవరకు ఉంటుంది (**1 యోహాను 5:19**).

దావీదు వంశపు చిగురైన, యూదా గోత్రపు సింహము (యేసుక్రీస్తు), తన తండ్రి సింహాసనాన్ని చేరి, ఆ గ్రంథాన్ని తీసికొని, ఆ 7 ముద్రలను ఒక్కొక్కటిగా తెరుచు దృశ్యం, ప్రకటన గ్రంథం 6వ అధ్యాయం నుండి మనకు కనబడుతుంది. ఈ విశేషమైన కార్యం, యేసుకు భూమిమీద గల పూర్తి అధికారాన్ని సూచిస్తుంది. దేవుడు దావీదుతో చేసిన నిబంధన ప్రకారం – పరలోకంలో ఉన్నట్లుగానే, తన రాజ్యాన్ని మరియు నీతిని, క్రీస్తు భూమిపై స్థాపిస్తాడు. ఆ వాగ్దానం యొక్క నెరవేర్పు, ఈ శ్రమల కాలంతోనే

మొదలవుతుంది. యేసు ఆ గ్రంథాన్ని తీసికొని, 7 ముద్రలను ఒకొక్కటిగా విప్పుచుండగా, భూమిపై ఏమేం సంభవిస్తాయో మనం చూడబోతున్నాము.

**మూడవది** – ముందుగా మనం **అబద్ధక్రీస్తును** గురించి తెలుసుకోవాలి. 2 **థెస్సలొనీకయులకు 2:3-8**లో పౌలు – **అబద్ధక్రీస్తును** గురించి, అతని రాకడ గురించి, అతడు చేయబోవు కార్యాల గురించి వివరిస్తాడు:

**“మొదట భ్రష్టత్వము సంభవించి నాశన పాత్రుడగు పాపపురుషుడు బయలుపడితేనే గాని ఆ దినము రాదు. ఏది దేవుడనబడునో, ఏది పూజింపబడునో, దానినంతటిని ఎదిరించుచు, దానికంతటికిపైగా వాడు తన్నుతానే హెచ్చించుకొనుచు, తాను దేవుడనని తన్ను కనుపరచు కొనుచు, దేవుని ఆలయములో కూర్చుండును గనుక ఏవిధముగానైనను ఎవడును మిమ్మును మోసపరచ నియ్యకుడి. నేనింకను మీయొద్ద ఉన్నప్పుడు ఈ సంగతులను మీతో చెప్పినది మీకు జ్ఞాపకములేదా? కాగా వాడు తన సొంతకాలమందు బయలుపరచబడవలెనని వానిని అడ్డగించునది** [అడ్డగించునది – పరిశుద్ధాత్మ] **ఏదో అది మీరెరుగుదురు. ధర్మవిరోధ సంబంధమైన మర్మము ఇప్పటికే క్రియచేయుచున్నది గాని, యిదివరకు అడ్డగించుచున్నవాడు మధ్యనుండి తీసి వేయబడు వరకే అడ్డగించును. అప్పుడా ధర్మవిరోధి బయలుపరచబడును.”**

కావున పునరుత్థాన దినమందు, పరిశుద్ధులతో కలిసి పరిశుద్ధాత్మ భూమిమీద నుండి నిష్క్రమించిన తరువాత, అబద్ధక్రీస్తు ప్రవేశిస్తాడని చదివిన వాక్యభాగాన్ని బట్టి మనకు అర్థమవుతుంది. వాని రాకతో సంభవించు సంగతులను గురించి తరువాయి వచనాలలో పౌలు ఇలా ప్రకటిస్తాడు – **“నశించుచున్నవారు తాము రక్షింప బడుటకై సత్యవిషయమైన ప్రేమను అవలంబింపక పోయిరి గనుక, వారి రాక అబద్ధ విషయమైన సమస్త బలముతోను, నానావిధములైన సూచకక్రియలతోను, మహత్కార్యములతోను దుర్నీతిని పుట్టించు సమస్త మోసముతోను, నశించుచున్న వారిలో సాతాను కనుపరచు బలమును అనుసరించియుండును”** (9-10). మనం గమనిస్తే, ఇక్కడ రెండు పరిణామాలు ఒకే సమయంలో జరుగుతున్నాయి – అక్కడ పరలోకంలో, క్రీస్తు ఆ గ్రంథాన్ని పొంది, ఒక్కొక్క ముద్రను విప్పుతూ భూమిపైకి దండనలను, నాశనాన్ని తీసుకురాబోతున్నాడు. అదే

సమయంలో ఇక్కడ, భూమిపై సంగతులు మరింత చెడ్డవిగా మారుతూ, అబద్ధక్రీస్తు – ప్రపంచమంతటిపై అధికారాన్ని పొందబోతున్నాడు (దానియేలు 11:36-45).

**నాలుగవది** – ఇప్పుడు మనం **శ్రమల పురోగతి**ని పరిశీలిద్దాం – ఇది ఒలీవల కొండమీద యేసు చెప్పినట్లుగా జరుగుతుంది (మత్తయి 24:9-35; లూకా 21:8-32; మార్కు 13:5-31) – **ప్రకటన గ్రంథం 6** నుండి **19** అధ్యాయాలలో మరింత వివరంగా చెప్పబడింది. శ్రమల పురోగతి క్రమం ఇలా ఉంటుంది: యేసు చేతులలో ఉన్న గ్రంథం, "ఏడు ముద్రలను" కలిగి ఉంటుంది. ఈ ముద్రలలో ప్రతి ఒక్కటి శ్రమల కాలంలో, భూమిమీద జరిగే ఒక్కొక్క సంగతిని సూచిస్తుంది. ఏడవ ముద్ర విప్పబడినప్పుడు, ఏడు బూరలను పట్టుకొనియున్న ఏడుగురు దూతలు ఊదుటకు సిద్ధపడతారు. ఒక్కొక్క బూర ఊదబడగా, భూమిపై ఒక్కొక్క పరిణామం జరుగుతుంది, చివరగా ఏడవ బూర ఊదబడగా, దేవుని కోపముతో నిండిన "ఏడు పాత్రలు" ఒక్కొక్కటిగా భూమిమీద కుమ్మరించబడతాయి. ఇక్కడ గమనిస్తే, ఏడవ ముద్ర విప్పబడినప్పుడు భూమిమీద జరుగబడు సంగతుల వేగం పెరుగుతుంది. తరువాత వరుసలో, ఏడవ బూర ఊదబడినప్పుడు, భూమిమీద దేవుని దండనలు – మరింత వేగాన్ని అందుకుంటాయి.

## ఏడు ముద్రల దండనలు:

శ్రమలకాలం ప్రారంభమైనప్పుడు – మొదటి నాలుగు ముద్రలు, వరుసగా నాలుగు గుర్రాలను ప్రవేశపెడతాయి. ప్రతి గుర్రము దాని స్వంత రౌతును కలిగి ఉంటుంది. మొదటి ముద్ర విప్పబడినప్పుడు, బాణాలు లేని విల్లు పట్టిన రౌతు, ఒక తెల్లని గుర్రం మీద వస్తాడు – ఇది భూమిమీద శాంతి సమాధానాలను భ్రమపరుస్తుంది. ఇదే అబద్ధక్రీస్తు రాకడకు దారి వేస్తుంది. (మత్తయి 24:3-5). **దానియేలు 9:27** ప్రకారం – **ఒక వారం వరకు, అంటే యేడేళ్ళ కాలం వరకు** – అబద్ధక్రీస్తు, ఇశ్రాయేలుతో ఒక **అబద్ధపు శాంతి నిబంధన**ను స్థిరపరుస్తాడు.

అయితే, రెండవ ముద్ర విప్పబడగా – ఎర్రని గుర్రం మీద వేరొక రౌతు స్వారీ చేస్తూ, భూమిమీదకి యుద్ధాన్ని తీసుకొస్తాడు. తరువాత మూడవ ముద్ర తెరవబడినప్పుడు, నల్లని గుర్రం మీద వేరొక రౌతు స్వారీ చేస్తూ, ప్రపంచానికి కరువును తీసుకొస్తాడు. దాని తరువాత, నాలుగవ ముద్ర తెరవబడినప్పుడు, పాండుర వర్ణముగల గుర్రం మీద వేరొక రౌతు స్వారీ చేస్తూ – యుద్ధాలు, కరువులు, వ్యాధులు మరియు క్రూరమృగాల చేత, ప్రపంచం యొక్క నాలుగవ వంతు జనాభాను హతమారుస్తాడు. (ప్రకటన 6:8).

యేసు ఐదవ ముద్రను విప్పగా, దేవుని వాక్యము నిమిత్తమును, తాము ఇచ్చిన సాక్ష్యము నిమిత్తమును, హతసాక్షులైన వారు, వారి మరణాల నిమిత్తము ప్రతిదండన చేయుమని బిగ్గరగా కేకలు వేస్తుంటారు. **వీరు ఎవరు?** ప్రకటన 7వ అధ్యాయంలో చెప్పబడిన – ప్రతి గోత్రము నుండి 12,000 మంది చొప్పున, మొత్తం 144,000 మంది రక్షించబడిన ఇశ్రాయేలీయులు (ప్రకటన 7:9-17) – వీరు శ్రమలకాల ప్రారంభంలో మార్చబడతారు, తరువాత భూమి అంతటా సువార్త సాక్షులుగా పని చేస్తారు. వీరు ప్రకటన 6:9-10లో – దేవుని వద్దకు వారి మరణాల నిమిత్తము ప్రతిదండన చేయుమని కేకలు వేయగా, వారిలో ప్రతి ఒక్కరికీ తెల్లని వస్త్రము ఇవ్వబడి, శ్రమకాల హతసాక్షులగు వారి సంఖ్య సంపూర్ణమగు వరకు ఓపిక పట్టవలెనని వారికి సమాధానం ఇవ్వబడుతుంది.

**ఐదవది** – 5వ మరియు 6వ ముద్రల మధ్యన సమయంలో, ఇప్పుడు మనం శ్రమలకాలంలోని ముఖ్యమైన **పరివర్తన దశ**కు చేరుకున్నాము. అబద్ధక్రీస్తు – ఇశ్రాయేలుతో 7 సంవత్సరాల అబద్ధపు శాంతి నిబంధనను చేసి ఇప్పటికి మూడున్నర (3 1/2) సంవత్సరాలు అవుతుంది. ఇప్పుడు ఆ నిబంధనను ఉల్లంఘించి, యూదులను, మరియు విశ్వాసులనందరినీ హింసించడం, వేధించడం మొదలు పెడతాడు (ప్రకటన 13:7). కావున, ఈ పరివర్తన దశ – శ్రమల నుండి మహాశ్రమలకు మార్పు చెందడాన్ని సూచిస్తుంది. భూమిమీద పరిస్థితులు అంధకారం నుండి మరింత భయంకరంగా మారుతాయి. ఈ **పరివర్తన దశ**ను గుర్తించగలుగునట్లు యేసు ఇలా హెచ్చరిస్తాడు – "... **నాశకరమైన హేయవస్తువు నిలువరాని స్థలమందు నిలుచుట మీరు చూచునప్పుడు**..." (మార్కు 13:14) ఈ వాక్యం వెనుక ఆయన ఉద్దేశ్యం ఏమిటి?

**దానియేలు 9:27** ప్రకారం, శ్రమలకాల ప్రారంభంలో, అబద్ధక్రీస్తు – యూదులతో ఒక అబద్ధపు శాంతి నిబంధనను చేస్తాడు. యెరూషలేములో దేవాలయం తిరిగి నిర్మించబడుతుంది. ఎన్నో శతాబ్దాల తరువాత, వారు ఆ పవిత్ర స్థలంలో, బలులు అర్పించుటకు అనుమతించబడతారు. అయితే ఈ **పరివర్తన దశ** మొదలు కాగా, బలులు ఆపబడతాయి, మరియు అబద్ధక్రీస్తు తనను తాను దేవుడిగా ప్రతిష్టించుకుంటాడు (ఇదే యేసు చేసిన హెచ్చరిక – మత్తయి 24:15; మార్కు 13:14; దానియేలు 12:11). **దానియేలు 9:27** ప్రవచనాన్ని మళ్ళీ ఒకసారి చూద్దాం – "**అతడు [అబద్ధక్రీస్తు] ...... అర్ధవారమునకు** [శ్రమలకాలంలో మూడున్నర సంవత్సరాలకు] **బలిని నైవేద్యమును నిలిపివేయును హేయమైనది నిలుచు వరకు నాశనము చేయువాడు వచ్చును నాశనము చేయువానికి రావలెనని నిర్ణయించిన నాశనము ముగించువరకు ఈలాగున జరుగును.**" ఆ సమయం

మొదలుకొని అతడు అంతిమంగా ఓడిపోవు వరకు, అబద్ధక్రీస్తు ఏ ఇతర ఆరాధనను అనుమతించడు.

ఈ సమయం వరకు, మూడున్నర సంవత్సరాలు పూర్తయ్యాయి; ఇక మిగిలినవి – మూడున్నర సంవత్సరాలు లేదా 42 నెలలు (ప్రకటన 13:5), లేదా 1260 రోజులు (ప్రకటన 11:3; 12:6). శ్రమల మధ్యస్థ కాలంలో, అబద్ధక్రీస్తు తన క్రోధాన్ని యూదుల మీద (మత్తయి 24:15-28; ప్రకటన 11:7; 12:17) మరియు అన్యజన విశ్వాసుల మీద (ప్రకటన 13:7) ఉంచుతాడు. వారు అతికిరాతకంగా చంపబడతారు. మరణించిన వీరంతా హతసాక్షులలో చేర్చబడతారు (ప్రకటన 6:9-11). అయితే, దేవుడు మొత్తం ఇశ్రాయేలు నశించబడుటకు అనుమతించడు (ప్రకటన 12:6). ఎందుకనగా, దేవుడు ఇశ్రాయేలుకు భూ-రాజ్యాన్ని (వెయ్యేళ్ళ క్రీస్తు రాజ్యాన్ని) వాగ్దానం చేశాడు – "**ఏలయనగా, దేవుడు తన కృపావరముల విషయము లోను, పిలుపు విషయములోను పశ్చాత్తాపపడడు.**" (రోమా 11:29).

**ఆరవది** – ఇప్పుడు మనం శ్రమలకాల **రక్షణ**ను చూస్తాము. దేవుడు తాను **ఎన్నుకొనిన జనాంగాన్ని**, మరియు "**విశ్వాసము ద్వారా అబ్రహాము సంతతిగా ఎంచబడిన వారిని**" (రోమా **3:29-30;** గలతీ **3:9, 29**), శ్రమలకాల విపత్తుల నుండియు, అబద్ధక్రీస్తు క్రోధము నుండియు రక్షించునట్లుగా వాగ్దానం చేశాడు, వారు వాగ్దానం చేయబడిన క్రీస్తు రాజ్యములోనికి ప్రవేశింతురు (2 సమూయేలు 7:12; రోమా 11:25-32). ఎంతమంది ఈ విధంగా రక్షించబడతారు? **జెకర్యా 13:8** ఇలా తెలియజేస్తుంది: "**దేశమంతట జనులలో రెండు భాగములవారు తెగవేయబడి చత్తురు, మూడవ భాగము వారు శేషింతురు.**"

కావున దేవుడు శ్రమలకాలమందు ఒక శేషాన్ని రక్షిస్తాడు. అయితే, వారు ఎలా రక్షించబడతారు? వారి రక్షణ విషయమై, యేసు వారికి చేసిన హెచ్చరిక:

**"మరియు నాశకరమైన హేయవస్తువు నిలువరాని స్థలమందు నిలుచుట మీరు చూచునప్పుడు చదువువాడు గ్రహించుగాకయూదయలో ఉండువారు కొండలకు పారిపోవలెను; మిద్దెమీద ఉండువాడు ఇంటిలోనుండి ఏదైనను తీసికొనిపోవుటకై దిగి అందులో ప్రవేశింపకూడదు; పొలములో ఉండువాడు తన వస్త్రము తీసికొనిపోవుటకు ఇంటిలోనికి తిరిగి రాకూడదు. అయ్యో, ఆ దినములలో గర్భిణులకును పాలిచ్చు వారికిని శ్రమ. అది చలికాలమందు సంభవింపకుండ వలెనని ప్రార్థించుడి. అవి శ్రమగల దినములు; దేవుడు సృజించిన సృష్ట్యాదినుండి ఇదివరకు అంత శ్రమ కలుగలేదు, ఇక ఎన్నడును కలుగబోదు. ప్రభువు ఆ దినములను తక్కువచేయని**

**యెడల ఏ శరీరియు తప్పించు కొనక పోవును; ఏర్పరచబడినవారి నిమిత్తము, అనగా తాను ఏర్పరచుకొనిన వారినిమిత్తము ఆయన ఆ దినములను తక్కువ చేసెను. కాగా ఇదిగో క్రీస్తు ఇక్కడ నున్నాడు, అదిగో అక్కడ నున్నాడు అని యెవడైనను మీతో చెప్పినయెడల నమ్మకుడి. ఆ కాలమందు అబద్ధపు క్రీస్తులును అబద్ధపు ప్రవక్తలును వచ్చి, సాధ్యమైనయెడల ఏర్పరచబడినవారిని మోసపుచ్చుటకై సూచక క్రియలను మహత్కార్యములను అగపరచెదరు. మీరు జాగ్రత్తగా ఉండుడి; ఇదిగో సమస్తమును మీతో ముందుగా చెప్పి యున్నాను." (మార్కు 13:14-23).**

దేవుడు తన ప్రజలను ఇలా హెచ్చరిస్తున్నాడు: "**నాశకరమైన హేయవస్తువు నిలువరాని స్థలమందు నిలుచుట మీరు చూచునప్పుడు**" (దేవాలయంలో అబద్ధక్రీస్తు ఆరాధన పొందుట) చూసినప్పుడు వారు యెరూషలేము నుండి దూరంగా వెళ్ళిపోవాలి/ పారిపోవాలి.

బైబిల్ ప్రకారం, దేవుడు వారిని రక్షించుట కొరకు, తన అద్భుతమైన శక్తి చేత సహాయాన్ని అందిస్తాడు. **ప్రకటన 12:14** – అరణ్యములో ఉన్న తన చోటికి ఎగిరి పోవునట్లు, ఇశ్రాయేలుకు "రెండు పక్షిరాజు రెక్కలు" అందించబడతాయని వెల్లడిస్తుంది. అదే అధ్యాయంలో, అబద్ధక్రీస్తు శక్తులు ఇశ్రాయేలును మరియు ఇతర విశ్వాసులను హతమార్చవలెనని నీటి ప్రవాహము వలె వెంటపడి రాగా, భూమి తన నోరు తెరచి ఆ ప్రవాహాన్ని మింగేస్తుంది. ఈ విధంగా, వాగ్దాన నెరవేర్పు నిమిత్తం, దేవుడు తన ప్రజలను రాబోవు క్రీస్తు రాజ్యం కొరకు సురక్షితంగా ఉంచుతాడు.

**యేడవది** – ఇప్పుడు మనం మహా శ్రమల కాలంలోని ఆపదలను గురించి చూద్దాం. 6వ ముద్ర విప్పబడగా, గ్రంథంలో ఇలా వ్రాయబడింది:

**"పెద్ద భూకంపము కలిగెను. సూర్యుడు కంబళివలె నలుపాయెను, చంద్రబింబమంతయు రక్తవర్ణమాయెను, పెద్ద గాలిచేత ఊగులాడు అంజూరపు చెట్టునుండి అకాలపు కాయలు రాలినట్టు ఆకాశ నక్షత్రములు భూమిమీద రాలెను. మరియు ఆకాశమండలము చుట్టబడిన గ్రంథము వలెనై తొలగిపోయెను. ప్రతికొండయు ప్రతిద్వీపమును వాటివాటి స్థానములు తప్పెను. భూరాజులును, ఘనులును, సహస్రాధిపతులును, ధనికులును, బలిష్ఠులును, ప్రతి దాసుడును, ప్రతి స్వతంత్రుడును కొండ గుహలలోను బండల సందులలోను దాగుకొని సింహాసనాసీనుడై యున్న వానియొక్కయు గొఱ్ఱెపిల్లయొక్కయు ఉగ్రత మహాదినము వచ్చెను; దానికి తాళజాలినవాడెవడు? మీరు మామీద పడి ఆయన**

**సన్నిధికిని గొఱ్ఱెపిల్ల ఉగ్రతకును మమ్ము కను మరుగు చేయుడి అని పర్వతములతోను బండల తోను చెప్పుచున్నారు.**" **(ప్రకటన 6:12-17).**

ఈ విధంగా, దేవునిని తిరస్కరించిన వారందరి పరిస్థితి మరింత భయంకరంగా మారిందని మనకు కనబడుతుంది.

ఆ తరువాత ఏడవ ముద్ర విప్పబడగా, పరలోకమందు ఇంచుమించు అరగంటసేపు నిశ్శబ్దముగా ఉన్నట్లు మనం చూస్తాము. ఆ తరువాత ఏడు బూరలు ఒక్కొక్కటిగా ఊదబడగా, వేగవంతమైన దండనలు, భూమి మీదకి వచ్చుట మనం చూస్తాము (**ప్రక 8:1-13; 9:1-21**).

## బూరల దండనలు

మొదటి బూర ఊదబడగా, రక్తముతో మిళితమైన వడగండ్లును, అగ్నియు పుట్టి భూమిపైన పడవేయబడి, భూమిలో మూడవ భాగము కాలి పోయెను (**ప్రక 8:7**). రెండవ బూర ఊదబడగా, అగ్నిచేత మండుచున్న పెద్ద కొండవంటిదొకటి సముద్రములో పడ వేయబడి, సముద్రములో మూడవ భాగము రక్తమాయెను, సముద్రములోని ప్రాణముగల జంతువులలో మూడవ భాగము చచ్చెను, ఓడలలో మూడవ భాగము నాశన మాయెను. **(8:8-9).** మూడవ బూర ఊదబడగా, దివిటీవలె మండుచున్న యొక పెద్ద నక్షత్రము ఆకాశమునుండి రాలి నదుల మూడవ భాగముమీదను నీటిబుగ్గల మీదను పడి, నీళ్లలో మూడవభాగము చేదై పోయినందున, దానివలన మనుష్యులలో అనేకులు చచ్చిరి. **(8:10-11).** నాలుగవ బూర ఊదబడగా, సూర్య చంద్ర నక్షత్రములలో మూడవ భాగము చీకటి కమ్ముకనట్లును, పగటిలోను, రాత్రిలోను మూడవ భాగమున కాంతి ప్రకాశింప కుండునట్లును వాటిలో మూడవ భాగము కొట్టబడెను. **(8:12)**.

ఆ సమయంలో – "**ఆకాశమధ్యమున ఒక పక్షి రాజు ఎగురుచు - బూరలు ఊదబోవుచున్న ముగ్గురు దూతల బూరల శబ్దములనుబట్టి భూనివాసులకు అయ్యో, అయ్యో, అయ్యో, అని గొప్ప స్వరముతో చెప్పుట వింటిని.**" (ప్రక 8:13). ఐదవ బూర ఊదబడగా, భూమి మీదికి భయంకరమైన రాక్షస మిడతలు విడుదల చేయబడతాయి (**9:1-11**). వారు దేవునిని విశ్వసించని వారిపై దాడి చేసి, భయాన్ని, నొప్పిని కలిగిస్తాయి – "**ఆ దినములలో మనుష్యులు మరణమును వెదకుదురు గాని అది వారికి దొరకనే దొరకదు; చావవలెనని ఆశపడుదురు గాని మరణము వారియొద్దనుండి పారిపోవును.**" **(9:6).**

తరువాత ఆరవ దూత తన బూరను ఊదగా, ఒక పెద్ద రాక్షస సైన్యం, ఇంచుమించు 20కోట్ల సంఖ్యలో వచ్చి, మనుష్యులలో మూడో భాగాన్ని చంపుతుంది. అయినప్పటికీ, ఇంత భయంకరమైన పరిస్థితుల మధ్యన ఉన్నప్పటికీ, భూమి మీద మిగిలిన వారు – తమ పాపాలకు పశ్చాత్తాప పడరు, దేవునిని క్షమాపణ కోరరు (ప్రక **9:13-21**). చివరగా, ఏడవ దూత తన బూరను ఊదగా, పరలోకము నుండి ఈ విధంగా శబ్దాలు వినిపిస్తాయి – "**ఈ లోక రాజ్యము మన ప్రభువు రాజ్యమును ఆయన క్రీస్తు రాజ్యము నాయెను; ఆయన యుగయుగముల వరకు ఏలుననెను.**" (**11:15**). తరువాత, **ప్రకటన గ్రంథం 16**లో ఉన్న ఏడు పాత్రల దండనలు ఆరంభమవుతాయి.

## పాత్రల దండనలు

మొదటి పాత్ర భూమిమీద కుమ్మరించబడగా, "**ఆ క్రూరమృగము** (అబద్ధక్రీస్తు) **యొక్క ముద్రగలవారికిని దాని ప్రతిమకు నమస్కారము చేయువారికిని బాధకరమైన చెడ్డ పుండు పుట్టెను.**" (ప్రక **16:2**). రెండవ దూత తన పాత్రను సముద్రంలో కుమ్మరించగా, సముద్రంలోని ప్రతి జీవీ చనిపోతుంది. **(16:3)**. మూడవ దూత తన పాత్రను కుమ్మరించగా, త్రాగు నీరు అంతా రక్తంగా మారిపోతుంది. **(16:4)**.

నాలుగవ పాత్ర కుమ్మరించబడగా – సూర్యుడు, మనుష్యులను అగ్నితో కాల్చి వేస్తాడు; ప్రతిస్పందనగా, వారు దేవుని నామాన్ని దూషిస్తారు (**16:8**). ఐదవ దూత తన పాత్రను ఆ క్రూరమృగము (అబద్ధక్రీస్తు) యొక్క సింహాసనముమీద కుమ్మరించగా, అంతా చీకటిగా మారిపోతుంది. ఆ సమయంలో, భూమిమీద మిగిలిన వారు నొప్పి, పుండ్ల కారణంగా తమ నాలుకలను కొరుకుతుంటారు కానీ – ఆశ్చర్యకరంగా, వారి బాధల మధ్యన కూడా, వారు దేవుని  దూషించడం ఆపరు, తమ పనుల పట్ల పశ్చాత్తాప పడరు (**16:10-11**). ఆరవ దూత తన పాత్రను యూఫ్రటిస్ మహానదిమీద కుమ్మరించగా [అది ఇశ్రాయేలుకు వాగ్దానం చేయబడిన భూభాగం యొక్క తూర్పు సరిహద్దు (**ఆది 15:18; ద్వితీ 1:7; యెహోషువ 1:4**).], ఆ నది నీరు ఎండిపో , తూర్పు నుండి వచ్చే రాజులకు, వారి సైన్యాలకు – హార్ మెగిద్దోనను చోటుకు, యుద్ధం చేయుటకు వెళ్ళవలసిన మార్గాన్ని ఏర్పరుస్తుంది. (ప్రక **16:12-16**).

చివరగా – ఏడవ దూత, తన పాత్రను కుమ్మరించగా, దేవుని సింహాసనం నుండి ఒక పెద్ద శబ్దము ఇలా ప్రకటిస్తుంది – "**సమాప్తమైనది!**" (ప్రక 16:17). 18వ వచనం – "**అప్పుడు మెరుపులును ధ్వనులును ఉరుములును పుట్టెను, పెద్ద భూకంపమును కలిగెను. మనుష్యులు భూమిమీద పుట్టినది మొదలుకొని అట్టి మహాభూకంపము కలుగలేదు, అది అంత గొప్పది.**" ఇంతటితో ఈ భయంకరమైన దండన ముగిసింది. శ్రమల కాలం యొక్క **ఉద్దేశ్యం, ప్రారంభం, అబద్ధక్రీస్తు, శ్రమల పురోగతి, పరివర్తన దశ, రక్షణ, ఆపదలు** – అన్నీ బయలుపరచబడ్డాయి. అయితే, మిగిలిన **ఎనిమిదవ** అంశం: **వాగ్దానం.**

అయితే, శ్రమల కాలం యొక్క **వాగ్దానం** ఏమిటి? – **క్రీస్తు రెండవ రాకడ!**
అదే మనం తదుపరి అధ్యాయంలో, అధ్యయనం చేయబోవు పాఠం.

# 7

# క్రీస్తు రెండవ రాకడ

**క్రీస్తు రెండవ రాకడ**ను సూచించే ప్రవచనాలు పాతనిబంధన మరియు క్రొత్తనిబంధన రెండింటిలోనూ విస్తరించి ఉంటాయి. వాస్తవానికి, వాక్యగ్రంథము – సుమారు 5వ వంతు – ప్రవచనాలను కలిగి ఉంది – ఆ ప్రవచనాలలో సుమారు 3వ వంతు – **క్రీస్తు రెండవ రాకడ**ను గురించి ఉంటాయి. అయితే, **క్రీస్తు రెండవ రాకడ**ను గురించి, 200 కంటే ఎక్కువ ప్రవచనాలు – ఇంకా నెరవేరబడవలసి యున్నాయి. యేసు స్వయంగా తన రెండవ రాకడను గురించి, 21 సార్లు వేరువేరు సందర్భాలలో ప్రస్తావించాడు. ఒక పాస్టర్ గారు, బైబిల్ లో వెల్లడించబడిన **క్రీస్తు రెండవ రాకడ**కు గల ప్రాధాన్యతను ఇలా వివరించారు:

> వాక్యగ్రంథము – సుమారు 5వ వంతు – ప్రవచనాలను కలిగి ఉంది – ఆ ప్రవచనాలలో సుమారు 3వ వంతు – **క్రీస్తు రెండవ రాకడ**ను గురించి ఉంటాయి. అనగా – వాక్య గ్రంథంలో, మొత్తంగా – 650 కంటే ఎక్కువ ప్రవచనాలు ఉన్నాయి – అందులో సగం క్రీస్తును గురించి ఉంటాయి. అనగా – 330 కంటే ఎక్కువ ప్రవచనాలు క్రీస్తును గురించి మాట్లాడితే – అందులోని, 225 ప్రవచనాలు ఆయన రెండవ రాకడను సూచిస్తాయి. పాతనిబంధనలో 46 ప్రవక్తలు ఉన్నారు – అందులో ఇంచుమించు 10 మంది, ఆయన మొదటి రాకడను గురించి మాట్లాడితే; 36 మంది, ఆయన రెండవ రాకడను గురించి మాట్లాడారు. వాక్య గ్రంథంలోని, 1,500 కంటే ఎక్కువ వాక్యభాగాలలో – అనగా బైబిల్ లోని ప్రతి 25 వచనాలలో ఒకటి – క్రీస్తు రెండవ రాకడను సూచిస్తుంది. బైబిల్ నందు, క్రీస్తు మొదటి రాకడను గురించి ప్రస్తావించిన ప్రతిసారీ, 8 సార్లు ఆయన రెండవ రాకడను గురించి ప్రస్తావించబడింది. గ్రంథమునందు, ప్రాయశ్చిత్తం గురించి మాట్లాడిన ప్రతిసారీ, 2 సార్లు ఆయన రెండవ రాకడను గురించి మాట్లాడబడింది. యేసు స్వయంగా తన రెండవ రాకడను గురించి 21 సార్లు చెబితే, దాని కొరకు మనలను "**సిద్ధంగా ఉండండి!**" అని 50 సార్లు చెబుతాడు. కావున, క్రైస్తవులు క్రీస్తు రెండవ రాకడను దృష్టిలో ఉంచుకుని జీవించాలని, ముఖ్యంగా ఆయన రాకడ విషయాలను మరియు దాని ఆచరణాత్మక ప్రభావాలను గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని గమనించాలి.

రెండవ రాకడ గురించి అధ్యయనం చేసేముందు, 3 ప్రాథమిక సత్యాలను గమనించడం చాలా ముఖ్యం. **మొదటి సత్యం** – గత అధ్యాయం (**దానియేలుకు కలిగిన దర్శనము**)లో చెప్పినట్లుగా, పాతనిబంధన విశ్వాసులుకు మెస్సయ్య యొక్క "రెండవ" రాకడ గురించి ఏమీ తెలియదు. పాతనిబంధన – రెండవ రాకడను గురించిన వివరాలను ఇచ్చినప్పటికీ, **మొదటి** మరియు **రెండవ రాకడల** మధ్య కాలవ్యవధి ఎంత ఉండవచ్చనే విషయాలను తెలుపలేదు. పాతనిబంధన పరిశుద్ధులు – మెస్సయ్య రాకడ అనునది ఒక్కటే సంఘటనగా వారు చూశారు. ఎన్నో ప్రవచన భాగాలలో – మొదటి మరియు రెండవ రాకడల సంగతులు ఇమిడివుండడం వలన కావచ్చు, ఆ సంగతులన్నీ ఒకేసారి జరుగనున్నట్లు కనబడతాయి. దీనిని బాగా అర్థం చేసుకోవడానికి ఒక మంచి ఉదాహరణను చూద్దాం – **యెషయా** 61:1-3 – ఇది మెస్సయ్య రాకడను గురించిన సంగతులను ఒకే సంఘటనగా వర్ణిస్తుంది. అయితే యేసు – 1వ వచనం, తన మొదటి రాకడను సూచిస్తుందని, మరియు 2-3 వచనాలు, తన రెండవ రాకడను సూచిస్తాయని స్పష్టంగా వివరిస్తాడు. ఈ ఉదాహరణ, బైబిల్ ప్రవచనాలను అర్థం చేసుకోవడంలో మనకు దోహదపడుతుంది.

**రెండవ సత్యం యేమిటంటే** – భూమి మీదకు, వెయ్యేళ్ళ క్రీస్తు రాజ్యం వచ్చుటకు మునుపు సంభవించబోవు చివరి సంఘటన – **క్రీస్తు రెండవ రాకడ**. అంతవరకు జరిగిన ప్రతీ సంగతి, ఈ అద్భుతమైన అంతిమ ఘట్టానికి చేరు నిమిత్తమే జరిగింది. చివరగా, **మూడవ సత్యం యేమిటంటే** – యేసు తన రెండవ రాకడలో – రక్షకుడిగా కాదుగానీ, తీర్పు తీర్చు మహారాజుగా వస్తున్నాడు.

రెండవ రాకడను గురించి **2 థెస్సలొనీకయులకు 1:7-10**లో, పౌలు ఇలా వివరిస్తాడు:

“**దేవుని నెరుగనివారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునప్పుడు, మిమ్మును శ్రమపరచు వారికి శ్రమయు, శ్రమ పొందుచున్న మీకు మాతోకూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే. ఆ దినమున తన పరిశుద్ధులయందు మహిమపరచబడుటకును, విశ్వసించినవారందరి యందు ప్రశంసింపబడుటకును, ప్రభువు వచ్చినప్పుడు అట్టివారు ఆయన సముఖము నుండియు ఆయన ప్రభావమందలి మహిమనుండియు పారదోలబడి, నిత్యనాశనమను దండన పొందుదురు. ఏలయనగా మేము మీకిచ్చిన సాక్ష్యము మీరు నమ్మితిరి.**”

క్రీస్తు భూమిమీదకు తిరిగి వచ్చి, తనను తిరస్కరించినవారికి తీర్పు తీర్చడం అనేది, ఆయన మొదటి రాకడకు, ఆనాటి సౌమ్యతకు చాలా భిన్నంగా కనబడుతుంది. మొదటి రాకడలోని క్రీస్తు గురించి చెప్పబడిన వాక్యం: "**విజయమొందుటకు న్యాయవిధిని ప్రబలము చేయువరకు ఈయన నలిగిన రెల్లును విరువడు మకమకలాడుచున్న అవిసెనారను ఆర్పడు**" (మత్తయి 12:20; యెషయా 42:3). **మత్తయి 11:28-30**లో, యేసు అలసిపోయిన, భారము మోసికొనుచున్న వారందరినీ తనవద్దకు రమ్మని పిలిచినప్పుడు తాను – "**సాత్వికుడును, దీనమనస్సు గలవాడును**"(29) అని ప్రకటిస్తాడు. అయితే ఇప్పుడు తన రెండవ రాకడలో – ముందు వలె సౌమ్యుడిగా కాక, న్యాయము తీర్చు ఒక న్యాయాధిపతి గాను, శిక్షకుడి గాను రానున్నాడని దేవుని వాక్యం సెలవిస్తుంది.

అయితే అత్యంత బాధాకరమైన విషయమేమిటంటే, ఈ రోజుల్లో ఎంతోమంది – యేసు, తన రెండవ రాకడలో కూడా, ముందు వలె ప్రేమామయుడు గాను, శాంతియుతుడు గాను, సౌమ్యుడుగాను రానున్నాడనే అభిప్రాయాన్ని కలిగియున్నారు. అయితే అలా కానేకాదని, దేవుని వాక్యం స్పష్టం చేస్తుంది. ఒకసారి **ప్రకటన 6:16-17**లో గమనిస్తే, విమోచన పొందని అవిధేయులైన వారు, భయముతో పలికిన మాటలు – "**బండల సందులలోను దాగుకొని సింహాసనాసీనుడై యున్న వానియొక్కయు గొఱ్ఱెపిల్లయొక్కయు ఉగ్రత మహాదినము వచ్చెను; దానికి తాళజాలినవాడెవడు? మీరు మామీద పడి ఆయన సన్నిధికిని గొఱ్ఱెపిల్ల ఉగ్రతకును మమ్మును మరుగు చేయుడి అని పర్వతములతోను బండల తోను చెప్పుచున్నారు.**"

క్రీస్తు రెండవ రాకడను గురించి వ్రాయబడిన అన్ని విషయాలను బాగుగా అర్థం చేసుకొను నిమిత్తం, తన రెండవ రాకడలో ఆయన అగుపరచు, 7 ముఖ్యమైన లక్షణాలను పరిశీలిద్దాం: **ఆయన నామములు, ఆయన సమయము, ఆయన సేన, ఆయన కార్యములు, ఆయన విజయము, ఆయన సింహాసనము** మరియు **ఆయన తీర్పు**.

**మొదటిది** – దేవుని కుమారుడు, తన రెండవ రాకడలో పొందు **నామములు** ఏమిటి? ఇప్పటికైతే, నాలుగు సువార్తలలోను ప్రకటించబడినట్లుగా – బెత్లెహేములో ఒక కన్యకు జన్మించి, కల్వరి కొండపైన శిలువపై మరణించి, ఆ పై పునరుత్థానమొంది, పరలోకానికి ఆరోహణుడై వెళ్ళిన యేసుక్రీస్తే తిరిగి రానున్నవాడు అనే స్పష్టతను కలిగి వున్నాము. అయితే, క్రీస్తు తన రెండవ రాకడ విషయమై ప్రత్యేకమైన నామములు కలిగియున్నాడు. తన రాకడను చిత్రించే అత్యంత వర్ణనాత్మకమైన వాక్యభాగాలలో ఒకటి **ప్రకటన 19:11-21**లో కనబడుతుంది – 11వ వచనంలో చూస్తే – ఇక్కడ మనం

నజరేయుడైన యేసు, ఒక తెల్లని గుఱ్ఱము మీద కూర్చొని యుద్ధానికి సిద్ధముగానున్న యోధుడిలా కనబడతాడు. ఇక్కడ ఆయన, "**నమ్మకమైనవాడును సత్యవంతుడును**" అని నామము గలవాడని చెప్పబడివుంది. ప్రభువైన యేసు తన వాగ్దానములలోను మరియు తన కార్యములలోను **నమ్మకమైనవాడును సత్యవంతుడును**. తరువాత 12వ వచనంలో చూస్తే, క్రీస్తు – "**అది ఆయనకేగాని మరి ఎవనికిని తెలియదు**" అని మరొక నామము కలిగివున్నాడని చెప్పబడివుంది. **ద్వితీ 29:29** ని ఒకసారి జ్ఞాపకం చేసుకుంటే – "**రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును**" అని ప్రకటించబడిన వాక్యానికి ఇదొక అద్భుతమైన ఉదాహరణ. దేవుని గురించి మనకు తెలియని మహిమాన్వితమైన రహస్యాలు ఎల్లప్పుడూ ఉంటాయని మనం జ్ఞాపకం ఉంచుకోవాలి.

తరువాత 13వ వచనంలో చూస్తే, క్రీస్తు – "**దేవుని వాక్యము**" అనబడు మరొక నామము కలిగివున్నాడని ప్రకటించబడింది. ఇదొక ఆశ్చర్యకరమైన నామము – ఎందుకనగా, ఇది క్రీస్తునకు సాక్ష్యమైయున్న దేవునివాక్యమును సూచిస్తుంది. ఈ సత్యం **కీర్తన 138:2**లో ప్రతిధ్వనిస్తుంది – "**నీవు నీ నామమంతటికంటె నీవిచ్చిన వాక్యమును నీవు [దేవుడు] గొప్పచేసియున్నావు**". ఈ భూమిమీద దేవుడు, తన వాక్యమందు తనను తాను ప్రకటింపజేసినందు వలన, దేవుని మహిమ అత్యంత స్పష్టముగా బయలు పరచబడినది (**2 పేతురు 1:19-21**), ఆ వాక్యము శరీరధారియై **[యేసుక్రీస్తు]** కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్యన నివసించెను గనుక, దాని స్థాయి అత్యున్నతమైనదిగా మనకు కనబడుతుంది (**యోహాను 1:1-3, 14; హెబ్రీయులు 1:1-3**).

చివరగా, 16వ వచనంలో చూస్తే " **రాజులకు రాజును ప్రభువులకు ప్రభువును అను నామము ఆయన వస్త్రముమీదను తొడమీదను వ్రాయబడియున్నది.**" అని చెబుతుంది. అనగా – క్రీస్తు ఒక యోధుడిగా మాత్రమే కాదుగానీ ఒక మహారాజుగా వస్తున్నాడని, తనకు వాగ్దానం చేయబడిన రాజ్యాన్ని స్వీకరించడానికి, దాని పరిపాలించడానికి వస్తున్నాడని మనకు అర్థమవుతుంది.

**రెండవది** – రెండవ రాకడ సంభవించబోవు **సమయాన్ని** మనం ఇలా అర్థం చేసుకోవచ్చు: **ఇదొక అనిశ్చయమైన సమయములో జరుగబోవు నిశ్చయమైన సంఘటన** (**లూకా 12:35-40**). క్రీస్తు రెండవ రాకడ నిర్థారితమైనది – భూమిమీద సంభవించబోవు కొన్ని పరిణామాల ద్వారా అది సూచించబడుతుంది, కానీ ఖచ్చితమైన సమయం ఎవ్వరికీ తెలియదు. అదే విషయాన్ని **మత్తయి 24:36**లో యేసు తన అపొస్తలులకు ఇలా బోధిస్తాడు – "**అయితే ఆ దినమును గూర్చియు ఆ గడియనుగూర్చియు తండ్రి మాత్రమే**

**(యెరుగును) గాని, యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను కుమారుడైనను ఎరుగరు.**" అయినప్పటికీ, రాకడ సంభవించబోవు ముందు భూమిమీద సంకేతాలను కనిపెట్టుమని, నిత్యమూ సిద్ధముగా ఉండుమని పదేపదే హెచ్చరిస్తాడు. (**మత్తయి 24:42,44; లూకా 12:40; 21:36**). మరో వాక్యభాగంలో, ఆయన వారికి "**మెలకువగా నుండుడి**" అని హెచ్చరిస్తాడు (**మార్కు 13:37**).

తన రాకడ కొరకు కనిపెట్టుట యొక్క ప్రాముఖ్యతను బాగా అర్థం చేసుకోవడానికి, క్రీస్తు – అంజూరపు చెట్టు ఉపమానమును చెబుతాడు (**మత్తయి 24:32-33**) – "**అంజూరపు చెట్టును చూచి ఒక ఉపమానము నేర్చు కొనుడి. అంజూరపుకొమ్మ లేతదై చిగిరించునప్పుడు వసంత కాలము యింక సమీపముగా ఉన్నదని మీకు తెలియును. ఆ ప్రకారమే మీరీ సంగతులన్నియు [శ్రమల కాలములో జరుగు సంగతులు] జరుగుట చూచునప్పుడు ఆయన సమీపముననే, ద్వారముదగ్గరనే యున్నాడని తెలిసికొనుడి.**" ఆ తరువాత ఆయన, తమ దివిటీలు పట్టుకొని పెండ్లికుమారుని (క్రీస్తును) ఎదుర్కొనుటకు బయలుదేరిన పదిమంది కన్యకల ఉపమానమును చెబుతాడు. **(మత్తయి 25:1-13)** – వీరిలో అయిదుగురు బుద్ధిగలవారు, వారు తమ దివిటీలతో పాటు నూనెను తీసికొని వెళతారు, మరియు మిగిలిన అయిదుగురు బుద్ధిలేనివారు, వారు తమతో పాటు అదనపు నూనెను తీసికొనిపోరు. పెండ్లికుమారుడు ఆలస్యము చేయగా, బుద్ధిలేని కన్యలు—వారి నూనెనిల్వ తక్కువగా ఉండగా—తమ దివిటీలకు మరింత నూనె కొరకు వెదుకుతూ వెళతారు. అర్ధరాత్రివేళ పెండ్లికుమారుడు రాగా, బుద్ధిలేని కన్యలు ఆయనను ఎదుర్కొనుటకు హాజరుకాలేదు గనుక పెండ్లి విందుకు (క్రీస్తు రాజ్యములోనికి) ప్రవేశము పొందలేకపోతారు. "**ఆ దినమైనను గడియయైనను మీకు తెలియదు గనుక మెలకువగా ఉండుడి.**" అనే హెచ్చరికతో కథ ముగుస్తుంది (25:13).

బైబిల్ మనకు ఇలా బోధిస్తుంది – క్రీస్తు రాకడ కొరకు **కనిపెట్టుకొని ఉండుమని (ఫిలిప్పీ 3:20; తీతు 2:13)**, **ప్రార్థిస్తూ ఉండుమని** (ప్రకటన 22:20), మరియు **ఎదురు చూస్తూ ఉండుమని (1 కొరింథీయులు 1:7; 1 థెస్సలొనీకయులు 1:10)** చెబుతోంది.

గనుక **క్రీస్తు రెండవ రాకడ సంభవించబోవు ఖచ్చితమైన సమయాన్ని తెలుసుకోవాలనుకోవడం అనవసరమైనదని** మరియు **బుద్ధిహీనమైనదని**; అలానే **రాకడ సంభవించబోవు ముందు భూమిమీద సంకేతాలను గమనించకపోవడం, మరియు సిద్ధముగా ఉండకపోవడం కూడా అంతే బుద్ధిహీనమైనదని** మనం నేర్చుకున్నాము.

**మూడవది** – క్రీస్తు "**సేన**" – అనగా, తన రెండవ రాకడలో, ఆయనతో పాటు వచ్చేవారు ఎవరు? **2 థెస్స 1:7 & మత్తయి 25:31**లో చెప్పబడినట్లుగా, క్రీస్తు **తన ప్రభావమును కనుపరచు సమస్త దూతలతో కలిసి** వస్తాడు. **మత్తయి 16:27**లో, యేసు ఇలా ప్రకటిస్తాడు – "**మనుష్యకుమారుడు తన తండ్రి మహిమ గలవాడై తన దూతలతో కూడ రాబోవుచున్నాడు....**" అలానే **మార్కు 8:38** ఇలా ప్రకటిస్తుంది – "**మనుష్యకుమారుడు తన తండ్రి మహిమగలవాడై పరిశుద్ధ దూతలతోకూడ వచ్చునప్పుడు....**". కావున ఇంతటితో, ప్రభువు తన దూతలతో కలిసి తిరిగి రానున్నాడని మనకు అర్థమయింది. అయితే, దూతలతో పాటు ఇంకా ఎవరెవరు వస్తున్నారో చూద్దాం: పునరుత్థానదినమందు ఎత్తబడిన వారందరు కూడా, క్రీస్తు రెండవ రాకడలో పాల్గొంటారు. (1 థెస్స 4:17). ఆ రాకడ దినమును గురించి **జెకర్యా 14:5**లో – "**అప్పుడు నీతోకూడ పరిశుద్ధులందరును వచ్చెదరు. నా దేవుడైన యెహోవా ప్రత్యక్ష మగును.**" అని చెప్పబడింది. అలానే **యూదా 1:14**లో – "**ప్రభువు తన వేవేల పరిశుద్ధుల పరివారముతో వచ్చెను....**" అని చెప్పబడింది. **1 థెస్స 3:13** – విశ్వాసులు, ఒకరినొకరు ప్రేమించుకొనవలెనని ప్రోత్సహిస్తోంది – "**మరియు మన ప్రభువైన యేసు తన పరిశుద్ధులందరితో వచ్చినప్పుడు, మన తండ్రియైన దేవుని యెదుట మీహృదయములను పరిశుద్ధత విషయమై అనింద్యమైనవిగా ఆయన స్థిరపరచుటకై, మేము మీయెడల ఏలాగు ప్రేమలో అభివృద్ధిపొంది వర్ధిల్లుచున్నామో, ఆలాగే మీరును ఒకని యెడల ఒకడును మనుష్యులందరి యెడలను, ప్రేమలో అభివృద్ధిపొంది వర్ధిల్లునట్లు ప్రభువు దయచేయును గాక.**". తారువత **ప్రకటన 19:14**లో – క్రీస్తు **సేన** – ఎలా వర్ణించబడిందో చూద్దాం – "**పరలోకమందున్న సేనలు శుభ్రమైన తెల్లని నారబట్టలు ధరించుకొని తెల్లని గుఱ్ఱము లెక్కి ఆయనను వెంబడించుచుండిరి.**". వీరే క్రీస్తు యొక్క దూతలు మరియు తన పరిశుద్ధులు – **భూమిమీదకు క్రీస్తు రెండవ రాకడ నిమిత్తం వారు సిద్ధంగా ఉన్నారు.**

**నాలుగవది** – క్రీస్తు రెండవ రాకడలో ఆయన చేయబోవు "**కార్యములలో**", దేవుని వాక్యం రెండు ప్రాముఖ్యమైన వాటిని ఇలా బయలుపరుస్తుంది: తన **శత్రువులను జయించుట**, మరియు తరువాత **వారికి శిక్షను విధించుట**. అనగా – క్రీస్తు మొదట

**జయశాలి**గా వచ్చి తరువాత **న్యాయాధిపతి**గా తీర్పు తీరుస్తాడు. అందువలన, తన కార్యములలోనే – క్రీస్తు **విజయము** మరియు, ఆయనిచ్చు **తీర్పు** ఉన్నాయని అర్థం.

**ఐదవది** – క్రీస్తు జయశాలిగా **విజయమును** సాధించుట కొరకు రానున్నాడు. అనగా – భూమిమీద తనకు విరోధముగా తిరుగుబాటు చేసి, అబద్ధక్రీస్తుని మరియు అతని అబద్ధ ప్రవక్తని అనుసరించిన అన్యజాతివారిపై యుద్ధం చేయడానికి రానున్నాడు. (**ప్రకటన 13:1-18**). చెప్పబడిన అన్యజాతులను గురించి ఒకసారి చూద్దాము:

దానియేలు 2&7లో చూస్తే – భూమిమీద వరుసగా ఏలుబడి చేసే 4 అన్యజాతి రాజ్యాలను దానియేలు ప్రవచిస్తాడు: **బబులోను, మాదీయులు & పారసీకులు, గ్రీకు** మరియు **రోమా.** **క్రీ.పూ.605**లో – నెబుకద్నెజరు నాయకత్వంలో, బబులోను దళాలు యెరూషలేమును జయించినప్పటి నుండి, ఈ అన్యజాతి రాజ్యపాలనలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుండి అనేకమైన ఆక్రమణదారులు, వివిధమైన రూపాలలో – ఇశ్రాయేలుకు వాగ్దానం చేయబడిన భూమిని ఏలుబడి చేస్తూనే ఉన్నారు. అయితే యేసు వాగ్దానం చేసినట్లుగా – వారి ఏలుబడులు ఎట్టకేలకు ముగియనున్నాయి. (లూకా 21:24).

దేవునికి వ్యతిరేకముగానున్న అన్యజాతి దళాలు, రోమా రాజ్యాన్ని తిరిగి ఏర్పాటు చేయునట్లుగా లేదా పునర్వ్యవస్థీకరించునట్లుగా ప్రవచనాలు ప్రకటిస్తున్నాయి (దానియేలు 7:24; ప్రకటన 17:12), మరియు అబద్ధక్రీస్తు దానికి ఆధిపత్యం వహిస్తాడాని, యెరూషలేమునకు ఉత్తర దిశగా సుమారు 60 మైళ్ళు దూరంలోనున్న **హార్ మెగిద్దోను** (ప్రకటన 16:16) అనబడు చోటుకు, తిరుగుబాటు సైన్యాలు యుద్ధం చేయుటకై సమీకరించబడతాయని, వాక్యం ప్రకటిస్తుంది. ఆ శత్రువులపై క్రీస్తు ఎలా విజయం సాధిస్తాడని ఇక్కడ వివరించబడింది: "**కాగా ఆ దూత తన కొడవలి భూమిమీద వేసి భూమిమీదనున్న ద్రాక్షపండ్లను కోసి, దేవుని కోపమను ద్రాక్షల పెద్ద తొట్టిలో వేసెను ఆ ద్రాక్షలతొట్టి పట్టణమునకు వెలుపట త్రొక్కబడెను; నూరు కోసుల దూరము గుఱ్ఱముల కళ్ళెము మట్టుకు ద్రాక్షల తొట్టిలోనుండి రక్తము ప్రవహించెను.**" (ప్రకటన 14:19-20).

యుద్ధం గురించి మరింత వివరణాత్మకంగా **ప్రకటన 19:11-21**లో వివరించబడింది: [11]"**మరియు పరలోకము తెరువబడియుండుట చూచితిని. అప్పుడిదిగో, తెల్లని గుఱ్ఱమొకటి కనబడెను. దానిమీద కూర్చుండియున్నవాడు నమ్మకమైనవాడును సత్యవంతుడును అను నామము గలవాడు. ఆయన నీతినిబట్టి విమర్శ చేయుచు యుద్ధము జరిగించుచున్నాడు**". ఇక్కడ మనం క్రీస్తు యొక్క రెండు కార్యాలను చూస్తాము: **ఆయన శత్రువులతో యుద్ధం చేయుట** మరియు **తీర్పు విధించుట**. తరువాత

12-13 వచనాలు ఇలా వివరిస్తున్నాయి: "**ఆయన నేత్రములు అగ్నిజ్వాల వంటివి, ఆయన శిరస్సుమీద అనేక కిరీటములుండెను. వ్రాయబడినయొక నామము ఆయనకు కలదు, అది ఆయనకేగాని మరి ఎవనికిని తెలియదు; రక్తములో ముంచబడిన వస్త్రము ఆయన ధరించుకొని యుండెను. మరియు దేవుని వాక్యము అను నామము ఆయనకు పెట్టబడియున్నది.**" ఇది క్రీస్తు యొక్క ఉగ్ర రూపాన్ని, మరియు తన మహిమాన్వితమైన నామములను బయలుపరుస్తుంది. అంతమాత్రమే కాదు, "....**సర్వాధికారియగు దేవుని తీక్షణమైన ఉగ్రత అను మద్యపుతొట్టి త్రొక్కును**" (19:15) అని వర్ణించబడిన రీతిని, ఆయన దేవుని మహా రోషము మరియు కోపము చేత, ద్రాక్షా తొట్టిని త్రొక్కునట్లు, శత్రువులను త్రొక్కి హతమార్చగా, **రక్తములో ముంచబడిన వస్త్రము**ను ధరించివున్నవాని వలె ఆయన కనబడుతున్నాడు.

ఇప్పుడు, 15వ వచనాన్ని పరిశీలిస్తే – "**జనములను కొట్టుటకై ఆయన నోటనుండి వాడిగల ఖడ్గము బయలు వెడలు చున్నది. ఆయన యినుపదండముతో వారిని ఏలును; ఆయనే సర్వాధికారియగు దేవుని తీక్షణమైన ఉగ్రత అను మద్యపుతొట్టి త్రొక్కును.**" ఈ వాక్యము – **2 థెస్సలొనీకయులకు 1:6-8**లో చెప్పబడిన ప్రవచనానికి సరిపోతుంది. ఇప్పుడు **ప్రకటన 19:17-18** ఏం ప్రకటించబడిందో చూద్దాం:

**"మరియు ఒక దూత సూర్యబింబములో నిలిచి యుండుట చూచితిని. అతడు గొప్ప శబ్దముతో ఆర్భటించి – రండి, రాజుల మాంసమును సహస్రాధిపతుల మాంసమును బలిష్ఠుల మాంసమును గుఱ్ఱముల మాంసమును వాటిమీద కూర్చుండువారి మాంసమును, స్వతంత్రులదేమి దాసులదేమి కొద్దివారిదేమి గొప్పవారిదేమి, అందరియొక్క మాంసమును తినుటకై దేవుని గొప్ప విందుకు కూడిరండని ఆకాశమధ్యమందు ఎగురుచున్న సమస్త పక్షులను పిలిచెను."**

అపొస్తలుడైన యోహాను తన ప్రకటన గ్రంథమును వ్రాయడానికి దాదాపు **600** సంవత్సరాలకు ముందుగానే ప్రవక్తయైన జెకర్యా తన గ్రంథమందు (**14**వ అధ్యాయంలో) ఈ యుద్ధం గురించి ప్రవచించియున్నాడు – క్రీస్తు తన రెండవ రాకడలో, యుద్ధం చేయుటకు భూమి మీదకు దిగి వచ్చునప్పుడు – "**యెరూషలేము ఎదుట తూర్పుతట్టుననున్న ఒలీవ కొండమీద ఆయన పాదములుంచగా ఒలీవకొండ తూర్పు తట్టునకును పడమటి తట్టువకును నడిమికి విడిపోయి సగము కొండ ఉత్తరపుతట్టునకును సగముకొండ దక్షిణపుతట్టు నకును జరుగును గనుక జీవజలములు ప్రవహించునట్లు విశాలమైన లోయ**

**యొకటి యేర్పడును**" **(4, 8).** "శత్రువులు నిలిచి యున్నపాటుననే వారి దేహములు కుళ్లిపోవును, కల్లోలము పుట్టింపగా వారందరు ఒకరి కొకరు విరోధులై ఒకరిమీదనొకరు పడుదురు." **(12-13).** అని ప్రకటించబడింది.
ఇప్పుడు, ప్రకటన గ్రంథానికి తిరిగి వెళ్ళి, యుద్ధం ఏ విధంగా ముగుస్తుందో చూద్దాం:

**"మరియు ఆ గుఱ్ఱముమీద కూర్చున్నవానితోను ఆయన సేనతోను యుద్ధము చేయుటకై ఆ క్రూరమృగమును భూరాజులును వారి సేనలును కూడియుండగా చూచితిని. అప్పుడా మృగమును, దానియెదుట సూచక క్రియలు చేసి దాని ముద్రను వేయించుకొనిన వారిని ఆ మృగపు ప్రతిమకు నమస్కరించినవారిని మోసపరచిన ఆ అబద్ధప్రవక్తయు, పట్టబడి వారిద్దరు గంధకముతో మండు అగ్నిగుండములో ప్రాణముతోనే వేయబడిరి. కడమ వారు గుఱ్ఱముమీద కూర్చున్న వాని నోటనుండి వచ్చిన ఖడ్గముచేత వధింపబడిరి; వారి మాంసమును పక్షులన్నియు కడుపార తినెను."**
**(19:19-21).**

ఈ విధంగా, క్రీస్తు తన శత్రువులపై విజయాన్ని సాధించడానికి తిరిగి వస్తాడు. విజయం సాధించిన క్రీస్తు, ఇప్పుడు తీర్పు తీర్చుటకు సిద్ధంగా ఉంటాడు.

**ఆరవది** – అయితే, తీర్పుకు ముందు అసలు ఆ తీర్పుతీర్చు ప్రదేశం గురించి తెలుసుకోవడం ముఖ్యం – అదే క్రీస్తు **సింహాసనము.** **మత్తయి 25:31** ప్రకారం, "**తన మహిమతో మనుష్యకుమారుడును ఆయనతో కూడ సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమగల సింహాసనముమీద ఆసీనుడై యుండును.**" అయితే, ఈ సింహాసనం ప్రత్యేకత ఏమిటి? – "**ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును.**" (లూకా 1:32). కావున యేసు యెరూషలేమునందు, దావీదు సింహాసనాన్ని వారసత్వంగా పొంది, దానిని అధిరోహిస్తాడని అర్థం చేసుకున్నాము.

**ఏడవది** – యెరూషలేములో తన సింహాసనము మీద ఆసీనుడైయున్న క్రీస్తు, ఇప్పుడు **తీర్పు** తీర్చుటకు సిద్ధముగానున్నాడు. ఇది ఒలీవల కొండమీద యేసు చెప్పినట్లుగా జరుగుతుంది (మత్తయి 24:3-25:46). **ఇది – భవిష్యత్తులో క్రీస్తు, ధవళమైన మహాసింహాసనము మీద ఆసీనుడైన ఇచ్చు తీర్పునకు భిన్నమైనదని గమనించాలి.** మహా శ్రమలకాలమందును మరియు హార్ మెగిద్దోను యుద్ధంలోను – శేషించి సజీవులుగా

నున్న వారు ఈ ధర్మాశనము ముందుకు వస్తారు. వీరిలో శత్రువులైన వారు, మరియు విశ్వాసులైన వారు (మహాశ్రమల ఆపదల నుండి రక్షించబడినవారు) కూడా ఉంటారు.

**మత్తయి 25:31-46** లో ప్రకటించబడినట్లుగా – ఆయన తన కుడి వైపున "**గొఱ్ఱెలను**"—అనగా విమోచింపబడినవారిని — మరియు తన ఎడమ వైపున "**మేకలను**"— అనగా శత్రువులు లేదా అవిధేయులైన వారిని — నిలువబెట్టును. కుడి వైపునున్న **గొఱ్ఱెలతో**, ఆయన – "**నా తండ్రిచేత ఆశీర్వదింపబడినవారలారా, రండి; లోకము పుట్టినది మొదలుకొని మీకొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి**"(25:34), అని ఆహ్వానిస్తాడు. దేవునిచేత ఆశీర్వదింపబడిన వారు, వారి క్రియల చేత – దేవుని రక్షణా కృపను వారి జీవితాలలో సాక్ష్యమిచ్చిన వారు (35-36) మాత్రమే క్రీస్తు రాజ్యమునకు వారసులు. అయితే ఎడమ వైపున ఉన్న **మేకలతో**, ఆయన – "**శపింపబడినవారలారా, నన్ను విడిచి అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి.**" (41), అని అజ్ఞాపిస్తాడు.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని గమనిస్తున్నారా? – **నిత్యాగ్ని – అపవాదికిని, వాని దూతల కొరకు మాత్రమే సిద్ధపరచబడింది**. వారితో మానవులెవరూ చేరవలెనని దేవుని ఉద్దేశ్యంలో ఎప్పుడూ లేదు. అనగా – నరకం మానవజాతి కొరకు సిద్ధపరచబడలేదు, మరియు దేవుడు ఎవరినీ అక్కడికి పంపేందుకు ముందస్తుగా నిర్ణయించలేదని భావం. అయినప్పటికీ, దేవుని కుమారుని విశ్వసించని, మారుమనస్సు పొంది పశ్చాత్తాపపడని వారి విధి అదే—వారి పాపములు తెచ్చు మరణాన్ని వారు పొందుదురు. (యోహాను 8:24). క్రీస్తును బుద్ధిపూర్వకంగా తిరస్కరించే వారు సాతానుతో సమానమైన విధిని ఎదుర్కొంటారు—**శాశ్వత నరక దండన, ఇది అత్యంత భయంకరమైన పరిణామం**. యేసు, ఈ తీర్పును గురించిన తన ప్రవచనాన్ని ఇలా ముగిస్తున్నాడు: "**వీరు నిత్యశిక్షకును నీతిమంతులు నిత్యజీవమునకును పోవుదురు.**" (మత్తయి 25:46).

# 8

# వెయ్యేళ్ళ క్రీస్తు రాజ్యము

అంత్యదినాల సంగతులను గురించిన మన అధ్యయనంలో, ఎక్కడి వరకూ వచ్చామో ఒకసారి పరిశీలిద్దాం – **పునరుత్థాన దినమందు**, క్రీస్తునందుండిన సజీవులును మరియు మృతులైన వారును ఎత్తబడి, ఆకాశమండలములో క్రీస్తును కలుస్తారు. అటు తరువాత, **శ్రమల కాలం** ప్రారంభమయ్యి, దేవుని ఉగ్రత – భయంకరమైన దండనల రూపంలో, భూమిమీద వరుసగా కురిపించబడతాయి. ప్రభువైన యేసుక్రీస్తు రెండవ రాకడతో, శ్రమల కాలం ముగుస్తుంది. అప్పుడాయన భూమిమీదనున్న దుష్టత్వాన్ని జయించి, తాను అధిరోహించిన **దావీదు సింహాసనం** ముందు – సజీవులను మరియు మృతులను నిలువ బెడతాడు. అటు తరువాత భూమి మీద, **వెయ్యేళ్ళ క్రీస్తు రాజ్యం** ప్రారంభమవనుంది.

ఇప్పుడు, ఆయన రాజ్యంలోనికి ప్రవేశించుటకు, ఆయనతో పాటు ఎవరెవరున్నారో చూద్దాం – మహిమ శరీరాలతో పునరుత్థానమొందిన విశ్వాసులు (**1 థెస్స 4:17**) – వీరిలో పాతనిబంధన పరిశుద్ధులు (క్రీస్తు పునరుత్థానముతో కలిసి పునరుత్థానమును పొందిన వారు) కూడా ఉంటారు. **(యెషయా 26:19-20; దానియేలు 12:1-2; యోహాను 5:29; యూదా 1:14; ప్రకటన గ్రంథం 20:4-6)**. భూమిమీదకు తిరిగి వస్తున్న క్రీస్తుతో కలిసి, వీరంతా ఆయన సేనగా కూడి **(ప్రకటన గ్రంథం 19:14)** వచ్చి, **శ్రమల కాల పరిశుద్ధులను** (యూదులు & అన్యజనాంగ విశ్వాసులు) – అనగా, మహా శ్రమలను తట్టుకుని ఇంకా సజీవులుగానున్న విశ్వాసులను కలుసుకుంటారు. శ్రమల కాల పరిశుద్ధులు – సజీవులుగానే క్రీస్తు వెయ్యేళ్ళ రాజ్యంలోనికి ప్రవేశిస్తారని మనం గమనించాలి.

ఈ శ్రమల కాల పరిశుద్ధులలోని, సజీవులుగానున్న యూదులపై ఒకసారి దృష్టి పెడదాం – **యెషయా 10:20-23**లో ప్రవచించబడిన, **యాకోబు శేషము** వీరే.  వీరి గురించి, అపొస్తలుడైన పౌలు ఇలా ప్రకటించాడు – "**వారు ప్రవేశించు నప్పుడు విమోచకుడు సీయోనులోనుండి వచ్చి యాకోబులో నుండి భక్తిహీనతను తొలగించును; నేను వారి పాపములను పరిహరించినప్పుడు నావలన వారికి కలుగు నిబంధన ఇదియే అని వ్రాయబడినట్టు ఇశ్రాయేలు జనులందరును రక్షింపబడుదురు.**" (రోమీయులకు 11:26-

27). శ్రమల కాలమందు, తన దండనలనుండి దేవుడు, ఈ **యాకోబు శేషము**ను రక్షించి ఇప్పుడు వెయ్యేళ్ళ క్రీస్తు రాజ్యంలోనికి వారిని నడిపిస్తున్నాడు.

ఇది **యిర్మీయా 31 మరియు యెహెజ్కేలు 36** లో వాగ్దానం చేయబడిన **క్రొత్త నిబంధన యొక్క నెరవేర్పు!** ఇది **జెకర్యా 12:10 మరియు జెకర్యా 13:1** లో, ఎన్నికొనబడిన యాకోబు శేషమునకు, **వాగ్దానం చేయబడిన నూతన స్వభావం యొక్క నెరవేర్పు!**

నూతన హృదయమును పొందినవారై, వారి అతిక్రమములను బట్టి పశ్చాత్తాపము నొంది, వారి పూర్వీకులు తిరస్కరించిన రక్షకుడిని, ఇప్పుడు వీరు స్వీకరిస్తారు. నూతన పరచబడిన వీరు – ఇప్పుడు క్రీస్తుతో కలిసి, తన వెయ్యేళ్ళ రాజ్యంలోనికి ప్రవేశిస్తారు.

క్రీస్తు రాజ్యం యొక్క ప్రధానమైన లక్షణాలను అధ్యయనం చేయడానికి ముందు కొన్ని ముఖ్యమైన విషయాలను గమనిద్దాము – దేవుడు ఆదాము హవ్వలను సృష్టించి నప్పుడు, వారిని ఆశీర్వదించి ఇచ్చిన ఆజ్ఞ – "**భూమిని ఏలుడి**". **(ఆది 1:28).** తరువాత రాజైన దావీదుకు చేసిన వాగ్దానంతో, **భూమిమీద రాజ్యస్థాపన** అధికారీకరించబడింది **(2 సమూ 7:12-13).** తరువాత యేసుప్రభువు – స్థాపించబడనున్న **దేవుని రాజ్యాన్ని** గురించి ప్రకటించాడు **(లూకా 4:43).** అంతేకాకుండా, **ఆ రాజ్యం స్థాపించబడు నిమిత్తం ప్రార్థించ వలెనని, మనకు <u>పరలోక ప్రార్థన</u>ను కూడా నేర్పించాడు (మత్తయి 6:10).** తరువాత, అపొస్తలుడైన యోహాను – ప్రకటన గ్రంథములో, దేవుని రాజ్యాన్ని గురించిన దేవుని ప్రణాళికను, మరింత వివరంగా మనకు అందించి, భూమి మీద క్రీస్తు రాజ్యం – 1,000 సంవత్సరాల పాటు ఉంటుందని **(ప్రకటన 20:1-6)** ప్రకటించాడు. ఈ సంగతి, పాత నిబంధనలోను మరియు యేసు సువార్త పరిచర్య సమయంలోనైనను బయలు పరచబలేదు. **వెయ్యేళ్ళ క్రీస్తు రాజ్యాన్ని** ఆంగ్లములో "**మిల్లీనియం**" (Millennium) అని అంటారు. అది "**మిల్లీ**" (Mille) అనగా "**వెయ్యి**" మరియు '**ఆనం**' (Annum) అనగా "**సంవత్సరం**" – అను రెండు లాటిన్ పదాల కలయిక.

**భూమిమీద స్థాపించబడనున్న <u>వెయ్యేళ్ళ క్రీస్తు రాజ్యము</u> గురించి <u>7 ప్రధానాంశాలను చూద్దాం:</u>**

## 1) వాగ్దానాల సంపూర్ణ నెరవేర్పు

దేవుడు చేసిన నిబంధన వాగ్దానాలు సంపూర్ణముగా నెరవేరబడు ముఖ్యమైన దశ ఇది. భూమిమీదకు క్రీస్తు రాజ్యము రాగా, దేవుడు ఇశ్రాయేలుకు చేసిన వాగ్దానాలన్నీ సంపూర్ణమవుతాయి (**2 సమూయేలు 7:12-13, 16; హెబ్రీయులు 6:13-20**). ఆ వాగ్దానాలు

ఏమిటి? దేవుడు – అబ్రాహాము, దావీదులతో చేసిన వాగ్దానాలు, మరియు ప్రవక్తలైన యెహెజ్కేలు, యిర్మియాల ద్వారా ఇశ్రాయేలుకు ఇవ్వబడిన **క్రొత్త నిబంధన-రక్షణ వాగ్దానం,** ఇశ్రాయేలు వారు తమ వాగ్దాన దేశాన్ని స్వతంత్రించుకొనుదురను వాగ్దానం, మరియు యెరూషలేమునందు, దావీదు సింహాసనాన్ని అదిరోహించు ఒక రాజు వాగ్దానం – భూమిమీదకు రాబోవు వెయ్యేళ్ళ క్రీస్తు రాజ్యముతో – ఈ వాగ్దానాలన్నీ సంపూర్ణము చేయబడతాయి.

ఈ సంగతిని అర్థంచేసుకోవడం ఎందుకంత అవసరమంటే – ఒకవేళ దేవుడు ఇశ్రాయేలుతో చేసిన తన నిబంధన వాగ్దానాలను నెరవేర్చకపోతే, ఇప్పుడు ఆయనను విశ్వసిస్తున్న వారైన అన్యజన విశ్వాసుల కొరకు చేయబడిన వాగ్దానాలకు ఆధారమేమిటి? అయితే, దేవుడు నమ్మదగినవాడు. ఆయన తన వాగ్దానాలన్నీ నెరవేర్చుతాడు. (యెహెజ్కేలు 36:22). **రోమా 11:29** లో ఇలా ప్రకటించబడింది – "**ఏలయనగా, దేవుడు తన కృపావరముల విషయములోను, పిలుపు విషయములోను పశ్చాత్తాప పడడు.**"
**1 సమూయేలు 12:22** – మనకు ఇలా భరోసా కల్పిస్తుంది – "**యెహోవా మిమ్మును తనకు జనముగా చేసికొనుటకు ఇష్టము గలిగి యున్నాడు; తన ఘనమైన నామము నిమిత్తము తన జనులను ఆయన విడనాడడు.**"

**రోమా 11:25** లో ప్రకటించబడినట్లుగా – "**అన్యజనుల ప్రవేశము సంపూర్ణ మగువరకు ఇశ్రాయేలునకు కొంత కఠిన మనస్సు కలుగును**". ఇశ్రాయేలు సంతానము కాని వారందరూ అన్యజనులని పిలువబడుదురు. వారి పట్ల దేవుని కృప ఎంతో అధ్భుతమైనది. **విశ్వాసము ద్వారా అన్యజనులను అబ్రాహాము సంతానముగా మార్చిన దేవుని ప్రేమ** (గలతీ 3:9, 29), **ఇశ్రాయేలుకు దయచేసిన ఆశీర్వాదాలలో కూడా మనల్ని పాలిభాగస్తులను చేస్తుంది.**

## 2) బంధించబడు ఘటసర్పము

2వ ప్రధానాంశమైన బంధించబడు సర్పము గురించి **ప్రకటన గ్రంథం 20:1-3** లో ఇలా ప్రకటించబడింది:

**"మరియు పెద్దసంకెళ్లను చేత పట్టుకొని అగాధము యొక్క తాళపుచెవిగల యొక దేవదూత పరలోకమునుండి దిగివచ్చుట చూచితిని. అతడు ఆదిసర్పమును, అనగా అపవాదియు సాతానును అను ఆ ఘటసర్పమును పట్టుకొని వెయ్యి సంవత్సరములు వానిని బంధించి అగాధములో పడవేసి, ఆ వెయ్యి సంవత్సరములు**

**గడచువరకు ఇక జనములను మోసపరచకుండునట్లు అగాధమును మూసి దానికి ముద్ర వేసెను; అటుపిమ్మట వాడు కొంచెము కాలము విడిచి పెట్టబడవలెను.**"

భూమిమీద క్రీస్తు రాజ్య స్థాపన ప్రారంభంలో, సాతాను అనబడు ఘటసర్పమును, దేవుడు అగాధములో బంధిస్తాడు. క్రీస్తు రాజ్యంలో శాంతి సమాధానములు ఉండునట్లు, శత్రు ప్రమాదం ఉండకుండునట్లు, సాతాను వెయ్యేళ్ళ వరకూ బంధించబడి ఉండాలి.
**(కీర్తన 110:1; హెబ్రీ 10:13, 1 పేతురు 5:8).**

నమ్మడానికి కష్టమైనప్పటికీ, సాతానుని బంధించడం వలన భూమిపై పాపం ముగియబడదని మనం గ్రహించాలి. ఎందుకనగా, సాతానుడు పాపానికి బాధ్యుడు కాదు; మానవుడిలోని సహజ పాప స్వభావమే పాపానికి బాధ్యత వహిస్తుంది **(రోమా 3:9; 5:12).** సాతానుడు స్వయంగా ఏ పాపాన్నీ ప్రారంభించలేడు; అతడు కేవలం పాపం చేయగలుగు వాతావరణాన్ని సృష్టించి పాపిని శోదిస్తాడు. అయితే, సాతానుని వెయ్యేళ్ళ రాజ్య కాలమంతయు బంధించినప్పటికీ, మానవుని హృదయంలోని పాపస్వభావం అలానే ఉండిపోతుంది.

## 3) రాజైన క్రీస్తు పాలన

**కీర్తన 2:9**లో ప్రవచించబడిన విధంగా, క్రీస్తు—తన వెయ్యేళ్ళ రాజ్యంలో, యెరూషలేములోని తన సింహాసనము మీద ఆసీనుడై, **యినుపదండము**తో భూమి యందంతటా ఎదురులేని యేలుబడిని సాగిస్తాడు (**ప్రకటన 19:15**), ఏ విధమైన తిరుగుబాటుకైననూ సత్వరితమైన, నీతియుక్తమైన తీర్పును వెలువడిస్తూ, ప్రతిఘటన లేని అత్యున్నతమైన పరిపాలనను సాగిస్తాడు.

**అసలు యేసు తిరిగివచ్చి భూమిమీద రాజ్యాన్ని స్థాపించడం ఎందుకంత అవసరం?** పరిచయంలో అధ్యయనం చేసిన విధంగా, సృష్టి యందంతటిమీద, దేవుని సార్వభౌమత్వం ఎల్లప్పుడూ ఉంటుంది. కానీ ఆదాము హవ్వల పతనం మొదలుకొని, ఈ భూమి పాపభరితమై, శపించబడి, సాతానుని తాత్కాలిక పాలనలో నడుస్తూ వచ్చింది (**యోహాను 14:30; 1 యోహాను 5:19**). భూమిమీద జరిగిన మొదటి అపరాధం మొదలుకొని, ఈ ప్రపంచం దాని నిజమైన ప్రభువు పాలనకు బదులుగా శత్రువు పాలనలో నడిచింది, అయితే ఇప్పుడు పునరాగమనంతో, క్రీస్తు స్థాపించు రాజ్యముతో ఆ స్థితి మారి, ఈ భూమి దాని నిజమైన ప్రభువు చెంతకు చేరుతుంది. ఒక విషాదకరమైన విషయమేమిటంటే, కొందరు క్రైస్తవులు ఈ సత్యాన్ని అంగీకరించలేకున్నారు – క్రీస్తు రాజ్యం ఈ భూమిమీదనే

స్థాపించబడునన్న సత్యాన్ని నిరాకరిస్తున్నారు. కానీ దేవుడు తన కుమారుడిని, పరిశుద్ధ పర్వతమైన సీయోను మీద రాజుగా ఆసీనుడిని చేసియున్నాడని ప్రకటిస్తున్నాడు (**కీర్తనలు 2:6-9; 89:20-29**). జెకర్యా, తిరిగి రానైయున్న మెస్సయ్యను గురించి ఇలా ప్రకటిస్తాడు – "**యెహోవా సర్వలోక మునకు రాజైయుండును**" (**జెకర్యా 14:9**) అని, ఆయన సింహాసనం "**యెరూషలేములో**" ఉండును (**4వ వచనం**) అని ప్రకటిస్తాడు. తరువాత క్రొత్తనిబంధన గ్రంథంలో చూస్తే, **లూకా 1:32-33** – గబ్రియేలను దేవదూత, మరియకు – **2 సమూయేలు 7** లోని ప్రవచనాన్ని గుర్తుచేస్తూ, – ఆయన "**దావీదు సింహాసనమును**" అధిరోహిస్తాడాని ప్రకటిస్తాడు — **దావీదు సింహాసనం భూమిపైనే ఉంది కాని పరలోకములో కాదని గమనించగలరు.** అయితే, **లూకా** మరియు **మరియ** కూడా ఈ ప్రవచనం భూమిమీదనే నెరవేరుతుందని విశ్వసించారు.

**భూమిమీద క్రీస్తురాజ్యం ఎందుకు అవసరమైనదో మరొక కారణం చూద్దాం – మొదట భూమిమీద రాజ్యస్థాపన** జరుగును, **తరువాత పరలోక నిత్యరాజ్యము** వచ్చునని మనం విశ్వసిస్తున్నాము. ఒకవేళ రెండవ రాకడ తరువాత, భూమిమీద రాజ్యస్థాపన చేయబడకుండా, నేరుగా పరలోక నిత్యరాజ్యస్థాపన జరిగిపోతే – దేవుడు సరిచేయలేని విధంగా, **పాపం** – ఈ భూప్రపంచాన్ని నాశనం చేసేసిందనే భావన కలుగవచ్చు, అది దేవుని సామర్థ్యాన్ని సవాలు చేస్తుంది. మరో విధంగా చూస్తే, దేవుడు **హార్ మెగిద్దోను** యుద్ధం గెలిచినప్పటికీ, శత్రువు మాత్రం – దేవుడు సరిచేయలేని విధంగా ఈ సృష్టిని పాడుచేసి, తన యుద్ధాన్ని గెలిచాడు – అనే భావనను కూడా అది కలుగజేయవచ్చు.

అందువలన, యేసు భూమిమీదకు తిరిగి వచ్చి, పరిపూర్ణమైన రాజ్యాన్ని స్థాపించి, దానిని పాలించాలి. ఆ రాజ్యమందు – ప్రేమ, సంతోషం, శాంతి, సమృద్ధి, సౌందర్యం, సమన్వయం, న్యాయం, నీతి, మొదలగు అద్భుతమైన ప్రతి ఒక్కటీ ఉండాలి. ఆ విధంగా అయితేనే క్రీస్తు—పాపాన్ని మరియు మరణాన్ని గెలిచినవాడిగా మాత్రమే కాకుండా—తన రెండవ రాకడతోను మరియు తన వెయ్యేళ్ళ రాజ్యపాలనతోను – సాతానుడి మీద మరియు వాడి క్రియలన్నిటి మీద, దేవుని కుమారుడిగా సమగ్ర విజయాన్ని సాధించాడని నిరూపించబడుతుంది. 1 యోహాను 3:8 లో "....**అపవాది యొక్క క్రియలను లయపరచుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను.**" అని ప్రకటించబడిన వాక్యం అద్భుతంగా నెరవేరబడుతుంది.

## 4) హతసాక్షుల పునరుత్థానము

ఇప్పుడు శ్రమల కాలంలో హతసాక్షులైన వారి గురించి మాట్లాడుకుందాం. ఇప్పటికైతే, పునరుత్థానదినమందు ఎత్తబడిన వారి గురించి, పాత నిబంధన పరిశుద్ధుల గురించి, మరియు క్రీస్తు సింహాసనం వద్ద కుడిపైపున నిలువబెట్టబడిన (గొర్రెలు) విశ్వాసుల గురించి మాట్లాడుకున్నాము. ఈ చివరగా చెప్పబడిన వారైతే మానవ శరీరాలతోనే ఉన్నప్పటికీ **(అనగా,ఇంకా పునరుత్థాన మహిమశరీరాలను పొందకుండానే)** క్రీస్తురాజ్యంలోనికి ప్రవేశించబడతారు.

ఒక సమూహం గురించి మనం ఇంకా పూర్తిగా మాట్లాడుకోలేదు – శ్రమలకాలంలో వారి విశ్వాసం నిమిత్తం, వారి సాక్ష్యం నిమిత్తం హతమార్చబడినవారు – **వీరే శ్రమలకాల హతసాక్షులు**. వీరే ఐదవ ముద్ర దండన సమయంలో – చిందించబడిన వారి రక్తము నిమిత్తము, ప్రతిదండన చేయుమని దేవునికి ప్రార్థన చేసినవారు. అప్పుడు వారిలో ప్రతి ఒక్కరికీ ఒక తెల్లని వస్త్రం ఇవ్వబడి, హతసాక్షులగు వారి లెక్క సంపూర్ణమగు వరకూ ఓర్పు వహించమని చెప్పబడినవారు (ప్రకటన 6:9-11). అయితే ఇప్పుడు వారి గురించి **ప్రకటన 20:4** లో ఇలా చెప్పబడింది:

> **"అంతట సింహాసనములను చూచితిని; వాటిమీద ఆసీనులై యుండువారికి విమర్శచేయుటకు అధికారము ఇయ్యబడెను. మరియు క్రూరమృగమునకైనను దాని ప్రతిమకైనను నమస్కారముచేయ తమ నొసళ్లయందు గాని చేతుల యందు గాని దాని ముద్రవేయించుకొనని వారిని, యేసు విషయమై తామిచ్చిన సాక్ష్యము నిమిత్తమును దేవుని వాక్యము నిమిత్తమును శిరచ్ఛేదనము చేయబడిన వారి ఆత్మలను చూచితిని. వారు బ్రదికినవారై, వెయ్యి సంవత్సరములు క్రీస్తుతోకూడ రాజ్యము చేసిరి."**

చివరగా, శ్రమలకాల హత సాక్షులు కూడా పునరుత్థానమొంది, ఇప్పుడు వెయ్యేళ్ళ క్రీస్తు రాజ్య భాగస్వాములవుతున్నారు. ఇక్కడితో, దేవుడు తనవారైన వారిలో ఎవ్వరినీ విడిచిపెట్టక, అందరికీ పునరుత్థానమును మరియు ప్రభురాజ్య ప్రవేశమను ఆశీర్వాదము నిచ్చి తన వాగ్దానాలను నెరవేరుస్తున్నాడు **(యోహాను 6:40, 57; 1 కొరింథీయులకు 15:22).** ఇక్కడ గమనించవలసిన ఒక అద్భుతమైన విషయం: దేవుని పరిశుద్ధులందరూ – పరలోక నిత్యరాజ్యముతో పాటుగా, భూమిమీద స్థాపించబడు క్రీస్తురాజ్యంలో కూడా పాలుపంచుకుంటారు! మరొక అద్భుతమైన విషయమేమిటంటే – దేవుడు, తాను ఎన్నుకున్న జనాంగమైయున్న ఇశ్రాయేలుకు చేసిన వాగ్దానాలను, అంతిమంగా –

అన్యజన విశ్వాసులకు కూడా విస్తరించినట్లు మనం చూస్తున్నాము. **గలతీ 3:29** లో ప్రకటించబడినట్లుగా, "**మీరు క్రీస్తు సంబంధులైతే ఆ పక్షమందు అబ్రాహాముయొక్క సంతానమైయుండి వాగ్దాన ప్రకారము వారసులైయున్నారు.**" అనగా – "**వాగ్దాన ప్రకారము వారసులై**", ఇశ్రాయేలుకు వాగ్దానం చేయబడిన ప్రభురాజ్యంలోనికి ప్రవేశిస్తారు!

పాత నిబంధనలోను, అనేక వాక్యభాగాలలోను ఈ విషయం ప్రకటించబడింది. దేవుడు అబ్రాహాముతో, తన సంతానము వలన భూలోకములోని జనములన్నియు ఆశీర్వదించబడునని ప్రమాణము చేసియున్నాడు **(ఆది 22:18)**. మరియు ప్రవక్తయైన యెషయా, రాబోవు క్రీస్తు గురించి ఇలా ప్రకటిస్తాడు – "**నీవు యాకోబు గోత్రపువారిని ఉద్ధరించునట్లును ఇశ్రాయేలులో తప్పింపబడినవారిని రప్పించునట్లును నా సేవకుడవై యుండుట ఎంతో స్వల్పవిషయము; భూదిగంతములవరకు నీవు నేను కలుగజేయు రక్షణకు సాధనమగుటకై అన్యజనులకు వెలుగై యుండునట్లు నిన్ను నియమించి యున్నాను.**" **(యెషయా 49:6).** **రోమా 9:25-26**లో చూస్తే – పౌలు హోషేయా2:23 లోని వాగ్దానాన్ని గుర్తుచేస్తాడు – "**నా ప్రజలు కానివారికి నా ప్రజలనియు, ప్రియురాలు కానిదానికి ప్రియురాలనియు, పేరుపెట్టుదును. మరియు జరుగునదేమనగా, మీరు నా ప్రజలు కారని యేచోటను వారితో చెప్ప బడెనో, ఆ చోటనే జీవముగల దేవుని కుమారులని వారికి పేరుపెట్టబడును.**"

అలానే **రోమా 15:8-12**లో చూస్తే – పాతనిబంధన యందంతటా, దేవుడు అన్యజనుల రక్షణ కొరకు ప్రవచించిన వాక్యాలను పౌలు వివరిస్తాడు – **ధర్మశాస్త్రాన్ని (ద్వితీ 32:43), ప్రవక్తలను (యెషయా 11:1; 10)** మరియు **కీర్తనలను (117:1)** ఉదాహరిస్తూ, దేవుని ఉద్దేశ్యాన్ని ప్రకటిస్తాడు – **దేవునికి, ఇశ్రాయేలు ద్వారా – లోకమంతటినీ ఆశీర్వాదించుట ఆయన ఉద్దేశ్యమైవుందని స్పష్టం చేస్తాడు!**

## 5) ఏలుబడి చేయు పరిశుద్ధులు

పునరుత్థానమునొందిన హతసాక్షులైన పరిశుద్ధులు, ఇప్పుడు క్రీస్తుతో కలిసి ఏలుబడి చేయనున్నారు. **ప్రకటన గ్రంథం 20:4**లో యోహాను ఇలా ప్రకటిస్తాడు: "**అంతట సింహాసనములను చూచితిని; వాటిమీద ఆసీనులై యుండువారికి విమర్శచేయుటకు అధికారము ఇయ్యబడెను.**" ఇక్కడ కొందరు పరిశుద్ధులు క్రీస్తుతో కలిసి, తన రాజ్యమందు ఏలుబడి చేయుటకు అధికారమును పొందియున్నారు. అయితే ఆ ఏలుబడి చేయు పరిశుద్ధులు ఎవరెవరు?

ఆ పరిశుద్ధులలో – క్రీస్తు యొక్క అపొస్తలులు కూడా ఉన్నారని మనకు తెలుసు. **మత్తయి 19:28**లో యేసు చేసిన ప్రకటన: "**(ప్రపంచ) పునర్జననమందు మనుష్య కుమారుడు తన మహిమగల సింహాసనముమీద ఆసీనుడై యుండునపుడు నన్ను వెంబడించిన మీరును పండ్రెండు సింహాసనములమీద ఆసీనులై ఇశ్రాయేలు పండ్రెండు గోత్రములవారికి తీర్పుతీర్చుదురు.**" అయితే, ఆ సింహాసనములపై ఆసీనులయ్యే వారిలో, అపొస్తలులతో పాటు మరికొందరు కూడా ఉంటారు. **ప్రకటన గ్రంథం 2:26-27**లో ఇలా ప్రకటించబడింది: "**నేను నా తండ్రివలన అధికారము పొందినట్టు జయించుచు, అంతమువరకు నా క్రియలు జాగ్రత్తగా చేయువానికి జనులమీద అధికారము ఇచ్చెదను. అతడు ఇనుపదండముతో వారిని ఏలును; వారు కుమ్మరవాని పాత్రలవలె పగులగొట్టబడుదురు.**" గనుక అపొస్తలులతో పాటు, పునరుత్థాన పరిశుద్ధులందరూ (అనగా – క్రైస్తవ విశ్వాసులు, పాత నిబంధన పరిశుద్ధులు, శ్రమల కాల హతసాక్షులు)—ఇప్పుడు వారి శాశ్వతమైన మహిమ శరీరాలలో—క్రీస్తుతో కలిసి భూమిమీద ఏలుబడి చేస్తారు. **(మత్తయి 11:27; 28:18; యోహాను 4:34).**

నేటి ప్రపంచంలో, **భూమిమీద పరిపూర్ణమైన రాజ్యం** అనునది ఒక వింత విషయం. ఎందుకంటే, ఈ ప్రపంచంలోని అన్ని దేశాల ప్రభుత్వాలు, అధికారాలు – అన్ని స్థాయిల లోనూ, మానవుల పాపస్వభావము చేత కలుషితమైపోయాయి. అందువలన మనము – అపరిపూర్ణ పాలకుల నుండి అపరిపూర్ణ పాలనలను, అపరిపూర్ణ ఫలితాలను చూస్తూ వస్తున్నాము. అయితే వెయ్యేళ్ళ క్రీస్తు రాజ్యంలో అలా జరగదు. క్రీస్తు యొక్క పునరుత్థాన పరిశుద్ధులు, భూమిమీద ఆయనతో కలిసి పరిపూర్ణమైన ఏలుబడిని చేస్తారు. ఆ దృష్టితోనే పౌలు – ఒకరితోనొకరు వ్యాజ్యెములాడుతున్న కొరింథు సంఘాన్ని మందలిస్తూ, వారిని ఇలా ప్రశ్నిస్తున్నాడు: "**పరిశుద్ధులు లోకమునకు తీర్పు తీర్చుదురని మీరెరుగరా?**" **(1 కోరింథీయులకు 6:2).**

ఇప్పుడు, పునరుత్థాన పరిశుద్ధుల ఏలుబడిలో, వెయ్యేళ్ళ క్రీస్తు రాజ్యం ఎలాంటి లక్షణాలను కలిగివుంటుందో చూద్దాం:

*(1)* ***వ్యవహారికంగా చూస్తే,*** దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానం పరిపూర్ణంగా నెరవేరబడి, వాగ్దాన దేశం – ఇశ్రాయేలీయులతో పునరుద్ధరించబడుతుంది, మరియు ప్రపంచాన్ని నడిపించే కేంద్రమవుతుంది. క్రీస్తు – పునరుద్ధరించబడిన యెరూషలేములో, దావీదు సింహాసనం మీద ఆసీనుడైయుంటాడు. ఆ సింహాసనం మీద నుండి, క్రీస్తు ప్రపంచమంతటినీ పాలిస్తాడు, ఆయనతో పాటు వారి వారి సింహాసనాలపై

ఆసీనులైయున్న పరిశుద్ధులు **(ప్రకటన 3:21)**, ఆయన సహపాలకులుగా, భూమిమీద ఏలుబడిని చేస్తారు **(ప్రకటన 5:10)**. ఇది దానియేలు ప్రవచనాన్ని నెరవేరుస్తుంది: "**ఆకాశమంతటి క్రిందనున్న రాజ్యమును అధికారమును రాజ్య మహాత్మ్యమును మహోన్నతుని పరిశుద్ధులకు చెందును.**" **(దానియేలు 7:27)**. ఇంతకుముందు చెప్పుకున్నట్లుగా, **క్రీస్తు రాజ్యం – పూర్తిగా నీతియుక్తమైనదిగాను, న్యాయవంతమైనది గాను, మరియు సత్యవంతమైనదిగాను ఉండును.**

*(2)* ***ఆధ్యాత్మికంగా చూస్తే,*** రక్షించబడిన ఇశ్రాయేలీయులేమి, అన్యజన విశ్వాసులేమి, అందరూ క్రీస్తు రాజ్యంలోనికి ప్రవేశించి, క్రీస్తును మహిమపరుస్తారు. సాతానుడుని, మరియు అన్ని అబద్ధాల మూలములును, పాతాళమున ముందుగానే బంధించివుంచినందున **(యోహాను 8:44)**, క్రీస్తు రాజ్యమునందు అబద్ధ బోధలు కానీ, అబద్ధపు మతాచారాలు కానీ ఏమీ ఉండవు.

*(3)* **భౌతికంగా చూస్తే**, భూమిమీదనుండి దేవుని శాపము తొలగించబడుతుంది. "**అరణ్యమును ఎండిన భూమియు సంతోషించును అడవి ఉల్లసించి కస్తూరిపుష్పమువలె పూయును**" (యెషయా 35:1). "**అరణ్యమును నీటిమడుగుగాను ఎండిన నేలను నీటి ఊటల చోటుగాను ఆయన మార్చును**" (కీర్తన 107:35; యెషయా 41:18). "**యూదా నదులన్నిటిలో నీళ్లు పారును, నీటి ఊట యెహోవా మందిరములోనుండి ఉబుకును**" (యోవేలు 3:18). ఆహారం సమృద్ధిగా నుండును **(యోవేలు 2:24)**, మరియు ఎవరూ ఆకలితో నుండక, ఆరోగ్యం మరియు దీర్ఘాయువును కలిగివుంటారు **(యెషయా 65:19-20)**.

క్లుప్తంగా చూస్తే, పతనానికి ముందుగల ఏదెను స్థితికి, భూమి పునరుద్ధరించ బడుతుంది. పాప ప్రవేశానికి ముందు స్థితికి, భూమి చేరుకుంటుంది. అక్కడ —"**తోడేలు గొఱ్ఱెపిల్లయొద్ద వాసముచేయును చిఱుతపులి మేకపిల్లయొద్ద పండుకొనును**" (యెషయా 11:6). ప్రకృతి విపత్తులైన—భూకంపాలు, తుఫానులు, వరదలు, మొదలగు విపత్తులు ఇకనుండవు. లోకం ఇలాంటి పునరుద్ధరణ కోసం యుగాలుగా ఎదురుచూస్తోంది **(రోమా 8:20-22)**. అయితే దేవుని వాక్యం, ఇది త్వరలోనే రాబోతుందని హామీ ఇస్తుంది.

అయితే ఈ సంగతులన్నీ, మనం అధ్యయనం చేసిన మునుపటి అధ్యాయాలలో, చెప్పబడిన అనేక అంత్యకాల సూచనల వెంబడి జరుగుతాయి. అపహాసకులను, అబద్ధ బోధకులను లక్ష్య పెట్టక, కేవలం దేవుని వాక్యము మీదనే దృష్టి పెట్టి, ఆయన వాగ్దానాలు సంపూర్ణముగా నెరవేరు వరకు మనం వేచియుండవలెను. **(2 Tim 3:1-5)**.

## 6) సాతానుడి పునరాగమనము

**ప్రకటన 20:7-8**లో ఇలా వ్రాయబడింది: "**వెయ్యి సంవత్సరములు గడచిన తరువాత సాతాను తానున్న చెరలోనుండి విడిపింపబడును; భూమి నలు దిశల యందుండు జనములను.......మోసపరచుటకు బయలుదేరును.**" దానికి ముందుగా **ప్రకటన 20:3**లో, "**కొంచెము కాలము విడిచి పెట్టబడవలెను.**" అని చేయబడిన ప్రకటనకు అనుగుణంగా, ఇప్పుడు వెయ్యేళ్ళ రాజ్య ముగింపు దశలో, **సాతానుడి పునరాగమనము** జరుగుతుంది.

**ఎందుకు?** వెయ్యేళ్ళ క్రీస్తు రాజ్యములో నిర్బంధించబడిన సాతాను, ఇప్పుడు ఎందుకని భూమిమీదకు తిరిగి విడుదల చేయబడాలి? **సమాధానం:** ఎందుకనగా, **బహిరంగముగానైనను, అంతరంగములోనైనను** ప్రభువైన యేసు క్రీస్తునకు వ్యతిరేకముగా నిలుచు శక్తులనన్నిటినీ, సంపూర్ణముగా నిర్మూలించు నిమిత్తము, దేవుడు సాతానుడిని విడుదల చేయవలెను. మనం ఒక విషయాన్ని గుర్తుచేసుకుంటే, శ్రమల కాలం ముగిసిన తరువాత, విశ్వాసులుగా ఎంచబడిన "గొఱ్ఱెలు", క్రీస్తు రాజ్యం లోనికి అనుమతించబడ్డారు. అయితే వారు నిజమైన విశ్వాసులైనప్పటికీ, వారి అంతరంగమున పాప స్వభావం ఎంతోకొంత శేషమును కలిగివుంటుందని గమనించాలి. ఆదాము సంతానము మొదలుకొని అందరూ పాపము చేత మలినమైయున్నారు (**రోమా 5:12**). అయితే, క్రీస్తు యొక్క పరిపూర్ణ రాజ్యంలోనికి స్వాగతించబడిన వారి అంతరంగములో కూడా ఈ పాప శేషము ఉండిపోతుంది. ఆ తరువాత, వెయ్యేళ్ళ రాజ్యంలో వారి జనాభా పెరుగు తున్నప్పుడు, వారి పాప స్వభావం తదుపరి తరాలకు కూడా వ్యాపిస్తుంది. అందువలన, రాజ్యంలో ప్రవేశించిన వారందరూ నిజమైన విశ్వాసులైన్నప్పటికీ, వారి సంతానమై యున్న తదుపరి తరాలవారు, అదే విశ్వాసాన్ని కలిగివుండరు. ఆ కారణం చేత, వెయ్యేళ్ళ రాజ్య ముగింపు దశలో, ఎంతో మంది అవిశ్వాసులు దేవునికి విరుద్ధంగా తిరుగుబాటునకు సన్నద్ధమగునని వ్రాయబడింది (**ప్రకటన 20:8-9**).

**బహిరంగముగా,** ఆ అవిశ్వాస తరాలవారు క్రీస్తురాజ్యమునందు, ఆయన పాలనలో కొనసాగుతున్నప్పటికీ, వారి తిరుగుబాటు ఆలోచనలు ఎప్పటికప్పుడు అణచివేయ బడుతూ వస్తున్నాయి (**కీర్తన 2:9; ప్రకటన 2:27; 19:15**). అయితే వారి అంతరంగములో, పాపం ప్రబలమవుతూ, క్రీస్తును తిరస్కరిస్తూ, ఆయన పరిపాలనను ద్వేషిస్తారు. గనుక, వెయ్యేళ్ళ రాజ్య ముగింపు దశలో, సాతానుడు విడుదలకాబడినప్పుడు, ఈ తిరుగుబాటు దారులు కూడా వాడితో కలుస్తారు, అయితే తరువాత వారు నాశనం చేయబడతారని

వారు గ్రహించలేక పోతారు. ఇది మానవుల హృదయాలలోని సహజ పాపస్వభానికి ఒక గొప్ప ఉదాహరణ. మనిషి పాప స్వభావం గురించి యేసు పలికిన మాటలు: "**ఆ తీర్పు ఇదే; వెలుగు లోకములోనికి వచ్చెను గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి.**" (యోహాను 3:19). ఎలా ఉండవలెనని భూమి సృష్టించబడిందో, అలా ఆ వెయ్యేళ్ళ క్రీస్తు రాజ్యపాలనలో ఉంటుంది (**యోహాను 1:9; 8:12**). అంతిమంగా, కొందరు అవిశ్వాసులు తిరుగుబాటు చేస్తారు.

## 7) అంతిమ తిరుగుబాటు

చివరగా, సాతానుడి పునరాగమనము, ఒక **అంతిమ తిరుగుబాటు**నకు దారి తీస్తుంది. దీని గురించి **ప్రకటన 20:8**లో ఇలా ప్రకటించబడింది – "**భూమి నలు దిశలయందుండు జనములను, లెక్కకుసముద్రపు ఇసుకవలె ఉన్న గోగు మాగోగు అనువారిని మోసపరచి వారిని యుద్ధమునకు పోగుచేయుటకై వాడు బయలుదేరును.**" ఈ వాక్యములోని ఒక విషయాన్ని గమనిస్తే, తిరుగుబాటు దారుల సంఖ్య "**సముద్రపు ఇసుకవలె నున్నది**". ఇంతకుముందు మనం చెప్పుకున్నట్లుగా, అవిశ్వాసతరాలవారు చివరికి, సాతానుడి సమూహంలో చేరి, దేవునిపై యుద్ధం చేయుటకు సమీకరిస్తారు.

తరువాత **ప్రకటన 20:9**లో చూస్తే: "**వారు భూమియందంతట వ్యాపించి, పరిశుద్ధుల శిబిరమును ప్రియమైన పట్టణమును ముట్టడివేయగా....**" ఇక్కడ సాతానుడి సమూహాలు, యెరూషలేమును చుట్టుముట్టి యుద్ధం కొరకు సన్నద్ధులయ్యారని మనం చూస్తున్నాము. **అయితే తరువాత ఏం జరుగుతుంది?** అదే వచనంలో చూస్తే – "**పరలోకములోనుండి అగ్ని దిగివచ్చి వారిని దహించెను. వారిని మోసపరచిన అపవాది అగ్ని గంధకములుగల గుండములో పడవేయబడెను. అచ్చట ఆ క్రూరమృగమును అబద్ధ ప్రవక్తయు ఉన్నారు; వారు యుగయుగములు రాత్రింబగళ్లు బాధింపబడుదురు.**" (9-10).

**ఇంతటితో సాతానుడి కథ ముగిసింది.** అన్ని దేవదూషణలకు, అన్ని పాపాలకు, అన్ని అవిధేయతలకు, అన్ని దుర్మార్గతలకు ఇక తెరపడింది. అప్పటినుండి, ఇంకెప్పటికీ దేవుని నీతి మాత్రమే నిలిచియుంటుంది. అయితే ఇక్కడ, పరలోకములో నుండి దిగివచ్చిన అగ్నిని గమనించారా? ఈ అగ్ని విధ్వంసకరమైనది. **2వ పేతురు 3:10** – దీని గురించి ఇలా ప్రకటిస్తుంది – "**ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును, పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దానిమీద నున్న కృత్యములును కాలిపోవును**". అనగా, **ఈ అగ్ని – అది తాకు ప్రతి దానిని,**

**దాని పరమాణువు స్థాయికి విచ్ఛిన్నము చేయగల శక్తిగలది –** ఈ భూమిమీదనున్న అన్ని జంతువులు, పక్షులు, చేపలు, మొక్కలు, సముద్రాలు, సరస్సులు, నదులు, పర్వతాలు, లోయలు; అలానే విశ్వములోని అన్ని గ్రహాలు, నక్షత్రాలు మొదలగు ప్రతీ ఒక్కటి – **ఈ అగ్నికి ఆహుతైపోతాయి.**

ఈ సమగ్ర వినాశనానికి సంబంధించి రెండు ముఖ్యమైన సమూహాలను మనం పరిగణించాలి. మొదటి సమూహం – **నిజమైన విశ్వాసులు** – వెయ్యేళ్ళ రాజ్య ముగింపు దశలో, వీరు నిత్య స్వరూపములోనికి పునరుత్థానమునొంది, నిత్యరాజ్యములోనికి ప్రవేశించుటకు సిద్ధపడివుంటారు **(ప్రకటన 20:5).** అయితే, రెండవ సమూహం – **అవిశ్వాసులు** – వీరు తిరుగుబాటుదారులు గనుక, సాతానుతో కలిసి యెరూషలేముపై దాడికి సిద్ధపడతారు – ఇప్పుడు వీరికిక భౌతిక కాలం ముగియబడి; వారి నిత్య నాశనానికై సిద్ధపరచబడివుంటారు.

9

# తీర్పు తీర్చు ధవళ మహాసింహాసనం

ఇప్పుడు మనం అంత్యదినాలలో సంభవింపబోవు ఐదవ సంఘటన – **తీర్పు తీర్చు ధవళ మహాసింహాసనం** వద్దకు చేరుకున్నాము. సర్వలోకము యొక్క విధ్వంసకరమైన ముగింపుతో, మనం **ప్రకటన 20:11-15** ను చేరుకున్నాము. ఇక్కడేమని ప్రకటించబడిందో చూద్దాము:

**"మరియు ధవళమైన మహా సింహాసనమును దానియందు ఆసీనుడైయున్న యొకనిని చూచితిని; భూమ్యాకాశములు ఆయన సముఖమునుండి పారిపోయెను; వాటికి నిలువ చోటు కనబడకపోయెను. మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైనవారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడి యుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను; మరియు జీవగ్రంథమును వేరొక గ్రంథము విప్పబడెను; ఆ గ్రంథములయందు వ్రాయబడియున్న వాటినిబట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పు పొందిరి. సముద్రము తనలో ఉన్న మృతులను అప్పగించెను; మరణమును పాతాళలోకమును వాటి వశముననున్న మృతుల నప్పగించెను; వారిలో ప్రతివాడు తన క్రియల చొప్పున తీర్పుపొందెను. మరణమును మృతుల లోకమును అగ్నిగుండములో పడవేయబడెను; ఈ అగ్నిగుండము రెండవ మరణము. ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్టు కనబడనియెడల వాడు అగ్నిగుండములో పడవేయబడెను."**

ఈ విధంగా మనం, సృష్టించబడియున్న సర్వలోకము – పూర్తిగా నాశనం చేయబడి, అదృశ్యమైపోయినట్లు చూస్తున్నాము. ఇప్పుడు **ధవళమైన మహా సింహాసనము** తప్ప మనకింకేమీ కనబడుటలేదు. సృష్టి ప్రారంభం మొదలుకొని అన్ని కాలాలకు చెందిన, రక్షించబడని అవిశ్వాసులు, పాపులైన వారు, ఇప్పుడు నిత్యశరీరాలతో పునరుత్థానము నొంది, ఆ సింహాసనం ముందు నిలుచున్నారు. అయితే, ఆ తీర్పు తీర్చు సింహాసనంపై ఆసీనులైనవారెవరో తెలుసుకొనుటకు, యేసు పలికిన మాటలను ఒకసారి గుర్తు చేసుకుందాము – **"నేను ఒక్కడనైయుండక, నేనును నన్ను పంపిన తండ్రియు కూడ**

**నున్నాము గనుక నేను తీర్పు తీర్చినను నా తీర్పు సత్యమే."** (యోహాను 8:16). గనుక ఆ సింహాసనంపై, యేసు తన తండ్రితో కలిసి కూర్చొంటాడు **(ప్రకటన 3:21)**.

గడచిన అధ్యయనాలలో, రక్షించబడని వారు కూడా పునరుత్థానము నొందెదరని మనం నేర్చుకున్నాము. అయితే దేవుని గ్రంథమందు, మనకు రెండు వేరువేరు పునరుత్థానములు కనబడతాయి. మొదటిది, **మొదటి పునరుత్థానము** – అనగా – అన్ని కాలములలోని పరిశుద్ధులు (అనగా – క్రైస్తవ విశ్వాసులు, పాత నిబంధన పరిశుద్ధులు, శ్రమల కాల హతసాక్షులు, వెయ్యేళ్ళ రాజ్య పరిశుద్ధులు) పొందు పునరుత్థానము. ఇది "**నీతిమంతుల పునరుత్థానము**" (లూకా 14:14) **లేదా** "**జీవ పునరుత్థానము**" (యోహాను 5:29) అని కూడా పిలువబడుతుంది. **ప్రకటన 20:6**లో యోహాను ఇలా ప్రకటిస్తాడు – "**ఈ మొదటి పునరుత్థానములో పాలుగలవారు ధన్యులును పరిశుద్ధులునై యుందురు. ఇట్టివారిమీద రెండవ మరణమునకు అధికారములేదు; వీరు దేవునికిని క్రీస్తుకును యాజకులై క్రీస్తుతో కూడ వెయ్యి సంవత్సరములు రాజ్యము చేయుదురు.**"

రెండవది, **రెండవ పునరుత్థానము** – అనగా – "**తీర్పు పునరుత్థానము**" (యోహాను 5:29; దాని 12:2). అవిశ్వాసులైన వారు పొందు పునరుత్థానము ఇది. **ప్రకటన 20:5**లో చెప్పబడిన కడమ మృతులు పొందు పునరుత్థానము ఇదే. వెయ్యేళ్ళ రాజ్యం ముగిసిన తరువాత, కడమ మృతులైన వారు, ఈ తీర్పు పునరుత్థానమును పొంది – **గొప్పవారేమి కొద్దివారేమి మృతులైనవారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడుదరు**. అప్పుడు గ్రంథములు తెరువబడును. వాటితో పాటు **జీవగ్రంథము** కూడా తెరువబడును. రక్షించబడిన విశ్వాసులైనవారి పేర్లు మాత్రమే, ఆ జీవగ్రంథము నందు కనబడతాయి. **(ప్రకటన 20:12, దాని 12:1; లూకా 10:20; ప్రకటన 3:5).**

అయితే విషాదకరమైన విషయమేమిటంటే, ఇప్పుడు దేవుని మహాసింహాసనం ఎదుట నిలబడియున్న వారిలో, ఎవరి పేరూ ఆ **జీవగ్రంథము**నందు కనబడదు. తరువాత దేవుడు తన ముందున్న ఇతర గ్రంథాలను తెరచిచూడగా, వారి వారి జీవితకాలమంతటి లోనూ వారు చేసిన ప్రతీ ఆలోచన, మాట్లాడిన ప్రతీ మాట, చేసిన ప్రతీ పని – నమోదు చేయబడివుంటాయి. ఇప్పుడు వారి పనుల విలువను బట్టి వారికి తీర్పు ఇవ్వబడుతుంది **(ప్రకటన 20:13; లూకా 12:47-48).** అయితే మరొక బాధాకరమైన విషయమేమిటంటే, అక్కడ నిలిచియున్న వారెవరూ వారి పాపముల నిమిత్తము పశ్చాత్తాపపడి, మారుమనస్సు పొంది, దేవుని కుమారుడు చేసిన శిలువయాగమందు విశ్వాసముంచి, రక్షణ పొందలేదు గనుక, వారి జీవితాలలో వారు చేసిన భౌతికపరమైన ఎలాంటి నీతి కార్యమూ వారికి,

దేవునికృప కొరకైన అర్హతను కల్పించజాలదు. **(రోమా 3:20, యెషయా 61:10; 2 కొరింథీ 5:21; ఫిలిప్పీ 3:9).** అందువలన ఆ సింహాసనం ముందు నిలుచున్నవారెవరూ నిర్దోషులుగా ఎంచబడలేరు. యేసు బోధించినట్లుగా, **పెండ్లి వస్త్రము** (మత్తయి 22:1-14) లేనివాడు నిత్యరాజ్యమునకు అర్హుడు కానేరడు. "**ధర్మశాస్త్రముచేత ఎవడును దేవునియెదుట నీతిమంతుడని తీర్చబడడు**" (గలతీ 3:11).

ఇప్పుడు దేవుని అంతిమ తీర్పు – **ప్రకటన గ్రంథం 20:14-15**లో కనబడుతుంది: "**మరణమును మృతుల లోకమును అగ్నిగుండములో పడవేయబడెను; ఈ అగ్ని గుండము రెండవ మరణము. ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్టు కనబడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయబడెను.**" **మొదటి మరణము**ను పొందిన అవిశ్వాసులు – వెయ్యేళ్ళ రాజ్యం ముగిసిన తరువాత, వారు **తీర్పు పునరుత్థానము**ను పొంది, అగ్నిగుండములో పడవేయబడి **రెండవ మరణమును పొందుదురు.** ఇది నిత్యకాల శిక్షావిధి. క్రీస్తును తిరస్కరించి, పశ్చాత్తాపమొందక, రక్షణపొందని వారి అంతిమ గతి ఇదే.

అయితే ఇలాంటి భయంకరమైన హెచ్చరికలు ముందునుండీ ఉన్నప్పటికీ, ఆ వినాశనాన్ని తప్పించుకునే సమయం ఇంకా ఉంది. ఈరోజుకి ఇంకా జీవించియున్న వారెవ్వరూ, ఆ శిక్షావిధికి గురికావలసిన అవసరం లేదు. దేవుని సువార్త సత్యాన్ని, ఆయన కుమారుడి ద్వారా అందించబడిన రక్షణను & విమోచనను స్వీకరించుటకు, అందరికీ ఈ నిముషమున, ఇంకా సమయముకలదు. ప్రవక్తయైన యెషయా ఇలా ప్రకటిస్తున్నాడు – "**యెహోవా మీకు దొరుకు కాలమునందు ఆయనను వెదకుడి ఆయన సమీపములో ఉండగా ఆయనను వేడు కొనుడి. భక్తిహీనులు తమ మార్గమును విడువవలెను దుష్టులు తమ తలంపులను మానవలెను వారు యెహోవావైపు తిరిగినయెడల ఆయన వారి యందు జాలిపడును వారు మన దేవునివైపు తిరిగినయెడల ఆయన బహుగా క్షమించును.**" (యెషయా 55:6-7). అపొస్తలుడు పౌలు ప్రకటించిన గొప్ప సందేశం – "**ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము.**"(2 కొరింథీ 6:3; సామెతలు 1:20-23; హెబ్రీ 3:7-8; 4:7)

యేసు – "**నా మాట విని నన్ను పంపినవానియందు విశ్వాసముంచువాడు నిత్య జీవము గలవాడు; వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటియున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.**" (యోహాను 5:24).

అందరికీ ఇదే దేవుని వాగ్దానం: **మీరు మీ పాపస్థితిని బట్టి పశ్చాత్తాపమొంది, క్రీస్తును మీ స్వంత రక్షకుడిగా అంగీకరించి; మీ జీవితాన్ని, మీ ఆలోచనయావత్తును ప్రభువుకు సమర్పించినట్లైతే, మీరు ఎన్నటికీ శిక్షించబడక, నిత్యజీవాన్ని పొందుతారు.** (యోహాను 3:16-18).

తదుపరి అధ్యాయంలో మనం, అంత్యదినాలలో సంభవింపబోవు చివరి సంఘటనకు చేరుకోబోతున్నాము – **క్రొత్త ఆకాశము & క్రొత్త భూమి** – దేవదూతలతోను, రక్షించబడి పునరుత్థానమొందిన పరిశుద్ధులతోను, పరిపూర్ణమైన మహిమతో నింపబడియుండు దేవుని నివాస స్థలమును, మనం చూడబోతున్నాము.

# 10

# క్రొత్త ఆకాశము & క్రొత్త భూమి

చివరగా మనం ముగింపునకు వచ్చాము – భూమ్యాకాశములు కనుమరుగాయెను. సర్వ సృష్టియు గతించిపోయెను. సాతానుడును, మరణమును, పాపుల మృతుల లోకమును అగ్నిగుండములో పడవేయబడెను. చెడు అనునది శాశ్వతముగా నశించిపోయెను.

అంత్యదినాలలో సంభవింపబోవు చివరి సంఘటన – **క్రొత్త ఆకాశము & క్రొత్త భూమి.** ఈ సృష్టి నిమిత్తం, ఇదొక మహా గొప్ప ముగింపు. ఇది **ప్రకటన 21,22** లో వివరించబడింది:

**"అంతట నేను క్రొత్త ఆకాశమును క్రొత్త భూమిని చూచితిని. మొదటి ఆకాశమును మొదటి భూమియు గతించిపోయెను. సముద్రమును ఇకను లేదు. మరియు నేను నూతనమైన యెరూషలేము అను ఆ పరిశుద్ధపట్టణము తన భర్తకొరకు అలంకరింపబడిన పెండ్లికుమార్తెవలె సిద్ధపడి పరలోకమందున్న దేవుని యొద్దనుండి దిగి వచ్చుట చూచితిని. అప్పుడు ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడ ఉన్నది, ఆయన వారితో కాపురముండును, వారాయన ప్రజలైయుందురు, దేవుడు తానే వారి దేవుడైయుండి వారికి తోడైయుండును. ఆయన వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచివేయును, మరణము ఇక ఉండదు, దుఃఖమైనను ఏడ్పైనను వేదనయైనను ఇక ఉండదు, మొదటి సంగతులు గతించి పోయెనని సింహాసనములోనుండి వచ్చిన గొప్ప స్వరము చెప్పుట వింటిని. అప్పుడు సింహాసనాసీనుడైయున్నవాడు ఇదిగో సమస్తమును నూతనమైనవిగా చేయుచున్నానని చెప్పెను; మరియు - ఈ మాటలు నమ్మకమును నిజమునై యున్నవి గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు." (ప్రకటన 21:1-5).**

ఈ పై 5 వచనాలు చూపించు, **క్రొత్త భూమ్యాకాశముల** యొక్క **5 లక్షణాలు:**

1) ఒక క్రొత్త సృష్టి;
2) ఒక క్రొత్త నగరం;
3) ఒక క్రొత్త సహవాసం;
4) ఒక క్రొత్త స్థితి;
5) ఒక క్రొత్త భరోసా.

## ఒక క్రొత్త సృష్టి

**మొదటిది – దేవుడు చేయబోవు ఒక క్రొత్త సృష్టి.** యోహాను ఇలా ప్రకటిస్తున్నాడు – "**అంతట నేను క్రొత్త ఆకాశమును క్రొత్త భూమిని చూచితిని. మొదటి ఆకాశమును మొదటి భూమియు గతించిపోయెను. సముద్రమును ఇకను లేదు.**" (ప్రకటన 21:1). ఈ వచనాన్ని పరిశీలిస్తే, ఎలాంటి సందేహం లేకుండా, ఇప్పుడు మనం నివసిస్తున్న ఈ భూమి, కేవలం తాత్కాలికమైనదిగా కనబడుతుంది. దేవుడు దీనిని ఒక తాత్కాలికమైన విశ్వంగానే చేసియున్నాడని అర్థమవుతుంది. దేవుడు ఈ భూమ్యాకాశములను మళ్లీ సృష్టించాలనే ఉద్దేశ్యంతోనే మొదట దానిని స్థాపించియున్నాడు. అయితే దీని అర్థం, మనం భూమి యందించు వనరుల వినియోగ విషయంలో ఎలా ఉన్నా పర్వాలేదని కాదు, దుర్వినియోగ పరిచినా పర్వాలేదని అస్సలు కాదు. దేవుడు మనకు అప్పగించిన ప్రతి విషయంలోనూ, అలానే ఈ భూమి విషయంలోనూ – నమ్మకముగాను, బాధ్యతగాను నడుచుకుంటూ, మంచి నిర్వాహకుల వలె ఉండాలి. ఈ భూమిని, దాని వనరులను సంరక్షిస్తూ, దానిని సద్వినియోగ పరుచుకోవడం మన హక్కు మరియు బాధ్యత.

అయితే, ఈ భూమిని సంరక్షించాలనే వారి ఆలోచనలు మరియు ప్రయత్నాలు విఫలమవుతూనే ఉన్నట్లు మనకి కనబడుతూ ఉన్నాయి. ఎందుకనగా, ఆదాము హవ్వల అపరాధము మొదలుకొని, వారి నిమిత్తం ఈ భూమి శపించబడిన దినము మొదలుకొని, ఈ భూమి క్రమక్రమంగా క్షీణిస్తూ, జీవరాసుల మనుగడను కష్టతరం చేస్తూ ఉంది. **(ఆది 5:29; రోమా 8:18-22)**. భూమి దాని తుది వినాశనం దిశగా ప్రయాణిస్తు న్నదని మనకు అర్థమవుతుంది. **లూకా 21:33**లో యేసు – "**ఆకాశమును భూమియు గతించును...**" అని వాఖ్యానించినప్పుడు, **సమస్తమునకు ఆధారభూతుడైన వాని** ఉద్దేశ్యం స్పష్టం చేయబడింది **(కొలస్సీ 1:17; హెబ్రీ 1:3)**. కావున, భూమి మరియు దాని పర్యావరణ భవిష్యత్తు – మనుష్యుల చేతులలో లేవని, దానిని రక్షించాలనుకునే వారి ఉద్దేశ్యాలు సఫలమవవని, దాని తుది వినాశనం నుండి తప్పించుకోవాలనే ప్రయత్నాలు, మూర్ఖ యత్నాలని గ్రహించి, విశ్వాసులు ధైర్యంగా ఉండవలెనని మనవి.

అయితే, మనందరికీ తలెత్తే కొన్ని సాధారణమైన ప్రశ్నలు: **అసలు ఈ విశ్వం ఎందుకు నశించిపోవాలి** మరియు **పునఃసృష్టించబడాలి? అసలు దేవుడు ఎందుకంత కష్టం తీసుకోవాలి? ప్రస్తుతం ఉన్నదానిని పునర్నిర్మించకపోవడానికి గల కారణం ఏమిటి?**

<u>అన్ని ప్రశ్నలకు ఒక్కటే జవాబు:</u> **ఈ భూమి పాపము చేత కలుషితం చేయబడింది.**

అపవిత్రమైనదానిని దేవుడు స్వీకరించడు **(కీర్తన 24:3; హబ 1:13)**, అయితే ఈ విశ్వం దేవుని దృష్టియందు అపవిత్రపరచబడినది కావున అది నాశనం చేయబడి పునఃసృష్టించబడాలి. **యోబు 15:15** ప్రకారం, "**ఆకాశ వైశాల్యము ఆయన [దేవుని] దృష్టికి పవిత్రముకాదు.**" **యెషయా 24:5** కూడా ఇలా ప్రకటిస్తుంది: "**లోకనివాసులు ధర్మశాసనములను అతిక్రమించి యున్నారు కట్టడను మార్చి నిత్యనిబంధనను మీరియున్నారు. దాని నివాసులచేత లోకము అపవిత్రమాయెను.**" గనుక, ఈ విధంగా అపవిత్రపరచబడిన దానికి పర్యవసానం, **కీర్తనలు 102:25-26** ప్రకారం: "**ఆదియందు నీవు భూమికి పునాది వేసితివి ఆకాశములు కూడ నీ చేతిపనులే. అవి నశించును గాని నీవు నిలచియుందువు అవియన్నియు వస్త్రమువలె పాతగిలును ఒకడు అంగవస్త్రమును తీసివేసినట్లు నీవు వాటిని తీసివేయుదువు అవి మార్చబడును.**"

## ఒక క్రొత్త నగరం

**రెండవది – దేవుని యొద్దనుండి దిగిరానున్న ఒక క్రొత్త నగరాన్ని చూస్తాము.** ఇది "**క్రొత్త యెరూషలేము**" అని వర్ణించబడింది. "**ఆ పరిశుద్ధపట్టణము తన భర్తకొరకు అలంకరింపబడిన పెండ్లికుమార్తెవలె సిద్ధపడి పరలోకమందున్న దేవుని యొద్దనుండి దిగి వచ్చుట చూచితిని.**" అని యోహాను ప్రకటిస్తాడు. అబ్రాహాము ఎదురు చూసిన పట్టణము ఇదే. **(హెబ్రీ 11:10)**, శాశ్వతమైన నగరమని వాగ్దానం చేయబడినది కూడా ఇదే (13:14). ఈ క్రొత్త యెరూషలేము, దేవుని క్రొత్త సృష్టి యొక్క రాజధాని నగరంగా మారుతుంది. ఇది పరలోకము నుండి దిగివస్తుందని చెప్పబడింది. వాస్తవానికి, యేసు – తన వారి కొరకు వెళ్ళి సిద్ధం చేసెదనని చెప్పిన స్థలము ఇదే **(యోహాను 14:1-3)**.

ఈ శాశ్వత నగరము, ఇప్పుడు క్రొత్త భూమ్యాకాశములలోని ఉన్నత స్థలమునకు దిగి రాగా, ఉపమానరీతిగా చెప్పబడిన భర్తను కలుసుకోవడానికి వచ్చిన వధువు **(మత్తయి 25:1-13; ఎఫెసీ 5:25-27)** – అనగా, ఆది నుండి రక్షించబడిన పరిశుద్ధులరందరూ ఇప్పుడు క్రొత్త యెరూషలేములో దేవునితో కలిసివున్నారు **(హెబ్రీ 12:23)**. కాల ఆవిర్భవానికి ముందుగానే, తన కుమారుడి కొరకు ఒక వధువును – విమోచించబడిన పరిశుద్ధులను **(యోహాను 6:37, 39; తీతు 1:2; 2 తిమోతీ 1:9)** దేవుడు నిర్ణయించియున్నాడు. విమోచించబడిన ఆ పరిశుద్ధులను – అనగా **వధువును** – క్రొత్త యెరూషలేములో ఉంచి, తాను ప్రేమించిన కుమారడైన క్రీస్తునకు – అనగా, **ప్రియమైన వరుడుకి** తండ్రి బహూకరిస్తాడు. ఇప్పుడు క్రొత్త యెరూషలేము దేవుని నివాసస్థలముగాను, తన కొత్త

రాజధానిగాను మారుతుంది. దీని గురించి దేవుని వాక్యం ఇలా ప్రకటిస్తుంది – "**అప్పుడు ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడ ఉన్నది, ఆయన వారితో కాపురముండును, వారాయన ప్రజలై యుందురు, దేవుడు తానే వారి దేవుడైయుండి వారికి తోడైయుండును.**" (ప్రకటన 21:3)

## ఒక క్రొత్త సహవాసం

**మూడవది – త్రిత్వదేవునితో ఒక క్రొత్త సహవాసం.** ఇప్పుడు క్రొత్త భూమిమీద, విశ్వాసులు – తండ్రితోను, కుమారుడితోను ఒక క్రొత్త సహవాసాన్ని కలిగియున్నారు **(1 యోహాను 1:3).** వారు కేవలం క్రీస్తు సత్యమైన సన్నిధిని **(2 కొరింథీ 13:5; కొలస్సీ 1:27)** మాత్రమే కాదు, తండ్రి నిత్యమైన సన్నిధిని కూడా వారు కలిగియున్నారు **(యోహాను 14:23).** అంతేకాదు, వారిలో నివసిస్తూ వారిని ఎల్లప్పుడూ పరిశుద్ధతలో నడిపించుటకు, వారు దేవుని పరిశుద్ధాత్మను కూడా కలిగియున్నారు **(రోమా 8:11).** క్లుప్తంగా చెప్పుకుంటే, విమోచించబడిన వారిలో త్రిత్వదేవుడు నిత్యమూ నివసిస్తాడు.

అయితే ఈ లోకమందు మానవులెవ్వరూ, దేవుని మహిమా స్వారూప్యాన్ని చూడజాలరు. **నిర్గమ 33:20** లో దేవుడు మోషేతో పలికిన మాట – "**నీవు నా ముఖమును చూడజాలవు; ఏ నరుడును నన్ను చూచి బ్రదుకడనెను.**" (న్యాయా 13:22). **1 తిమోతీ 6:16** లో, పౌలు – "**సమీపింపరాని తేజస్సులో ఆయన** (దేవుడు) **మాత్రమే వసించుచు అమరత్వముగలవాడైయున్నాడు. మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు, ఎవడును చూడనేరడు**" అని నిర్ధారిస్తున్నాడు. **మర్త్యత్వ** (పరిమిత) **స్థితిని** బట్టి, మానవులు దేవుని మహిమను చూడలేరు. అయితే ఈ స్థితి, క్రొత్త భూమ్యాకాశములతో మారిపోతుంది – మహిమ శరీరాలతో పునరుత్థానము నొందిన విశ్వాసులు, ఇప్పుడు దేవుని మహిమను చూడగలరు **(మత్తయి 5:8; 1 కొరింథీ 13:12).** అంతిమంగా తన జనులతో దేవుడు నిత్యము నివసించును (యెహె 37:27; ప్రకటన 21:3). **ఇమ్మానుయేలు** అనగా **దేవుడు మనతో ఉన్నాడు** అన్న దేవుని నామం సంపూర్ణర్థాన్ని పొందు సమయం ఇది **(యెషయా 7:14).**

**మత్తయి 5:8** లో యేసు పలికిన అద్భుతమైన మాటలను గుర్తుచేసుకుంటే – "**హృదయశుద్ధిగలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు.**" క్రొత్త భూమ్యాకాశముల ప్రపంచంలో, పరిశుద్ధులైన వారందరూ దేవునితో ఒక క్రొత్త సహవాస అనుభవాన్ని పొందుతారు.

దేవునితో ఏర్పడిన ఈ నుతన సహవాసంలో, విశ్వాసులు దేవునిని సేవించెదరు. **(హెబ్రీ 9:14)**. దీని గురించి **ప్రకటన 7:15** ఇలా ప్రకటిస్తుంది – "**వారు దేవుని సింహాసనము ఎదుట ఉండి రాత్రింబగళ్లు ఆయన ఆలయ ములో ఆయనను సేవించుచున్నారు.**". అంత మాత్రమే కాదు, దేవునికి సేవ చేస్తున్న విశ్వాసులకు, క్రీస్తు సేవ చేస్తాడని మీరు గ్రహించారా? ఇది కూడా దేవునితో ఏర్పడు కొత్త సహవాసంలో భాగమే! ఈ విషయాన్నే **లూకా 12:37** లో యేసు ఇలా చెబుతున్నాడు – "**ప్రభువు వచ్చి యే దాసులు మెలకువగా ఉండుట కనుగొనునో ఆ దాసులు ధన్యులు; అతడు నడుము కట్టుకొని వారిని భోజన పంక్తిని కూర్చుండబెట్టి, తానే వచ్చి వారికి ఉపచారము చేయునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.**" ఇలాంటి అద్భుతమైన వాగ్దానం ఊహకు అందనిది – ప్రపంచ రక్షకుడైన దేవుడే స్వయంగా, ఆయన విమోచించిన పాపులకు ఉపచారము చేస్తాడు!

## ఒక క్రొత్త స్థితి

**నాలుగవది – దేవుని జనులైన వారి క్రొత్త స్థితి.** దీనిని వివరిస్తూ యోహాను ఇలా వ్రాస్తున్నాడు: "**ఆయన వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచివేయును, మరణము ఇక ఉండదు, దుఃఖమైనను ఏడ్పైనను వేదనయైనను ఇక ఉండదు, మొదటి సంగతులు గతించి పోయెనని సింహాసనములోనుండి వచ్చిన గొప్ప స్వరము చెప్పుట వింటిని. అప్పుడు సింహాసనాసీనుడైయున్నవాడు ఇదిగో సమస్తమును నూతనమైనవిగా చేయుచున్నానని చెప్పెను. మరియు--ఈ మాటలు నమ్మకమును నిజమునై యున్నవి గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు**" (ప్రకటన 21:4-5). విశ్వాసుల స్థితి యంతయు నూతనపరచబడి – మరణమైనను, దుఃఖమైనను, వేదనైనను ఇక ఉండవని యోహాను ప్రకటిస్తున్నాడు. ఈ మాటలు నిజమైనవని దేవుడు దృవీకరిస్తున్నాడు. వర్ణించుటకు మాటలు చాలని, భాష సరిపోని ఆనందం అక్కడుందని యోహాను వ్రాసిన మాటలను బట్టి మనకు అర్థమవుతుంది.

## ఒక క్రొత్త భరోసా

చివరిగా **ఐదవది – విశ్వాసులకు దేవుడిచ్చు క్రొత్త భరోసా. ప్రకటన 21:5** లో యేసు యోహానుతో చెప్పిన మాటను గమనిస్తే – "**ఈ మాటలు నమ్మకమును నిజమునై యున్నవి గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు**". అయితే, దేవుని

వాక్యగ్రంథం లోని కొన్ని వాక్యాలు నమ్మకమైనవని, మరికొన్ని కాదని ఇక్కడ ఉద్దేశ్యం కాదు, ఎందుకనగా, "**ప్రతిలేఖనము దైవావేశమువలన కలిగినది**" (2 తిమోతికి 3:16) గనుక, ఇక్కడ చెప్పబడిన మాటలేమీ యోహాను స్వంత ఉద్దేశ్యాలు కాదని, యేసు వ్రాయమని ఇచ్చిన ఆజ్ఞ మేరకు యోహాను వ్రాసిన విషయాలని గుర్తించి, దైవమే మనకు ప్రకటిస్తున్న సత్యమని గ్రహించి, ఆయన మనకిచ్చు భరోసాను స్వీకరించుదాము. "**క్రీస్తునందు ముందుగా నిరీక్షించిన మనము తన మహిమకు కీర్తికలుగజేయవలెను.**" (ఎఫెసీ 1:11).

తరువాత యేసు యోహానుతో ఇలా చెబుతున్నాడు – "**సమాప్తమైనవి; నేనే అల్ఫాయు ఓమెగయు, అనగా ఆదియు అంతమునై యున్నవాడను**" (ప్రకటన 21:6). ఈ వాక్యము యెంతో లోతైన అర్థాన్ని కలిగివుంది. ఇక వివరణ లోనికి వెళితే – గ్రీకు అక్షరమాలలో **అల్ఫా** మొదటి అక్షరమైతే, **ఓమెగ** చివరి అక్షరం. ఇక్కడ యేసు గ్రీకు అక్షరమాలలోని మొదటి, చివరి అక్షరాలను ఉపయోగించి, తనను గురించి తాను ప్రకటిస్తున్నాడు. అనగా - **ఆయనే మొదటివాడని, ఆయనే ఆఖరివాడని** స్థిరీకరిస్తున్నాడు. అనాది నుండి ఆయన తండ్రితో ఉన్నవాడని, తన తండ్రి వద్దనుండి మహిమ వాగ్దానాన్ని పొందినవాడని, అలానే దాని పరిపూర్ణ నెరవేర్పును గురించి ప్రకటించుటకు అర్హత గలవడాని – ఆయన ఈ ఒక్క వాక్యము ద్వారా ఎంతో స్పష్టముగా ధృవీకరిస్తున్నడు.

## దేవుని నిత్య మహిమ

చివరగా ఇప్పుడు, చివరి అధ్యయన భాగానికి వచ్చాము – అదే **దేవుని నిత్య మహిమ.** దీని గురించి **1 కొరింథీ 15**వ అధ్యాయంలో పౌలు వివరిస్తాడు. కాల ఆవిర్భవానికి ముందుగానే, తన కుమారుడిని మహిమపరచు నిమిత్తం ఒక వధువును – అనగా విమోచించబడిన పరిశుద్ధులను, దేవుడు ఎన్నుకొని యున్నాడు. ఇప్పుడు వారితో ఒక మహారాజ్యాన్ని ఏర్పరచి, తండ్రి కుమారినికి అప్పగించగా, యేసు దానిని స్వీకరించి ఆ రాజ్యాన్ని పాలిస్తాడు. **(ఎఫెసీ 1:4; ప్రకటన 13:8; 17:8).** అయితే ఇప్పుడు, తాను తండ్రి వద్దనుండి పొందిన ప్రేమకు బదులుగా, యేసు తిరిగి తన తండ్రికి ప్రేమను అందిస్తున్నాడు. **1 కొరింథీ 15: 24-25**లోని పౌలు మాటలలో ఆ ప్రేమను చూడవచ్చు: "**అటుతరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును; అప్పుడు అంతము వచ్చును. ఎందుకనగా**

**తన శత్రువులనందరిని తన పాదముల క్రింద ఉంచువరకు ఆయన రాజ్యపరిపాలన చేయుచుండవలెను."** యేసు క్రీస్తు భూమిమీదకు తిరిగి వచ్చి, తన శత్రువులను నాశనం చేసి, యెరూషలేములో దావీదు సింహాసనాన్ని అధిరోహించి, వెయ్యేళ్ళ రాజ్య పరిపాలన చేయడమే, యేసు తన తండ్రికి తిరిగి అందించిన ప్రేమ!

తరువాత పౌలు ఇలా కొనసాగిస్తూ: "**కడపట నశింపజేయబడు శత్రువు మరణము. దేవుడు సమస్తమును క్రీస్తు పాదములక్రింద లోపరచియుంచెను....."** (1 కొరింథీ 15:26-27). ఇదే విషయాన్ని **మత్తయి 28:18** లో యేసు ఇలా ప్రకటిస్తాడు – "**పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధి కారము ఇయ్యబడియున్నది."** (యోహాను 3:35; 5:22). తరువాత **1 కొరింథీ 15:28**లో ప్రకటించబడిన అత్యంత అద్భుతమైన వాగ్దానం: "**మరియు సమస్తమును ఆయనకు** [దేవుని కుమారుడైన యేసుకు] **లోపరచబడి నప్పుడు దేవుడు సర్వములో సర్వమగు నిమిత్తము కుమారుడు తనకు సమస్తమును లోపరచిన దేవునికి తానే లోబడును.**"

తండ్రియైన దేవుడు, తన కుమారుడిని అత్యంత మహిమతో మహిమపరచుటకు నిర్ణయించిన అనాదిలోనే ఇదంతా మొదలయింది. **(యోహాను 17:5).** విమోచించబడిన పాపులను వధువుగా నిర్ణయించి, వారి ద్వారా అంత్యంత మహిమను కుమారుడి కొరకు ఉద్దేశించాడు. **(యెషయా 62:5).** ఇప్పుడు మనం మొట్టమొదటి అధ్యాయంలో చెప్పుకున్న విషయానికే చివరికి తిరిగి చేరుకున్నాము: **తండ్రి, కుమార, పరిశుద్ధాత్మల సమ్మేళనమైన త్రియేక దేవుడు** – ఒక శాశ్వతమైన అస్తిత్వాన్ని కలిగివుండి, తన కుమారుడు పొందిన అత్యంత మహిమను బట్టి ఆయన సంతోషిస్తున్నాడు **(ఫిలిప్పీ 2:9-11).**

అయితే,త్రియేక దేవుని మహిమాన్వితమైన కథ చివరిలో ఒకటి జత చేయబడింది: **అదే క్రీస్తు కొరకు విమోచించబడిన వధువు!** అన్ని కాలాలలోని విశ్వాసులు, ఇప్పుడు త్రిత్వ దేవుని మహిమలో చేర్చబడ్డారు. పాపపు బంధకాల నుండి విశ్వాసులు శాశ్వతమైన విముక్తిని పొందియున్నారు. **(రోమా 8:21).** విశ్వాసులు దేవునిని కలిసి, శాశ్వతమైన స్వేచ్ఛను అనుభవిస్తారు! **(యోహాను 8:36).** యేసు తన తండ్రికి ఇలా ప్రార్థిస్తాడు – "**తండ్రీ, నేనెక్కడ ఉందునో అక్కడ నీవు నాకు అనుగ్రహించిన వారును నాతోకూడ ఉండవలె ననియు, నీవు నాకు అనుగ్రహించిన నా మహిమను వారు చూడవలెననియు కోరుచున్నాను. జగత్తు పునాది వేయబడక మునుపే నీవు నన్ను ప్రేమించితివి."** **(యోహాను 17:24).** సమస్తమూ సంపూర్ణమవగా, యేసు ప్రార్థన ఏ విధంగా నెరవేరబడిందో మనం చూశాము!

**యోహాను 17:10**లో యేసు తన తండ్రికి చేసిన ప్రార్థనలో ఈ తుది స్థితిని ఆయన సంక్షిప్తంగా చెబుతాడు: "**నావన్నియు నీవి, నీవియు నావి; వారియందు నేను మహిమ పరచబడి యున్నాను.**"

యేసును విశ్వసించు వారందరి ఆశ ఇదే – ఆయనతో కలసి ఉండుట, ఆయన మహిమను చూచుట, త్రిత్వమైయున్న దేవునిని శాశ్వతముగా స్తుతించుట, మహిమపరచుట. శాశ్వతమైన దేవునితో, శాశ్వతమైన సహవాసం చేస్తూ, శాశ్వతమైన ఆనందాన్ని పొందడమే – విమోచించబడినవారి శాశ్వతమైన లక్ష్యము.

"అతడు ఈ సంగతులు అంత్యకాలమువరకు మరుగుగా ఉండునట్లు ముద్రింపబడినవి గనుక, దానియేలూ, నీవు ఊరకుండుమని చెప్పెను."

*(దానియేలు 12:9)*